సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
సూర్య 19వ వసంతంలోకి ...
visit us @ https://www.suryaepaper.com
శనివారం | 31 జనవరి 2026 | విజయవాడ
సంపుటి 19 | సంచిక 101
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...

☞ APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
☞ నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
☞ కరెంట్ అఫైర్స్
☞ నమూనా ప్రశ్నాపత్రాలు
☞ విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, మాఘ మాసం శుక్ల పక్షం త్రయోదశి ఉ.7.42, చతుర్దశి తె.5.52, పునర్వసు రా.1.47, వర్జ్యం మ.2.26 నుంచి 3.56 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.6.35 నుంచి 8.03 వరకు

## విద్యార్థులు వినూత్నంగా
# ఆలోచించాలి

- ఇన్నోవేషన్లను ప్రోత్సహిస్తున్నాం
- స్టార్టప్ కంపెనీలకు అండగా ఉంటున్నాం
- నీటి సంరక్షణపై కుప్పంలో పైలెట్ ప్రాజెక్ట్
- విద్యార్థులతో ముఖాముఖీలో సీఎం చంద్రబాబు
- కుప్పంలోని ఆగస్త్య అకాడమీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టిన ముఖ్యమంత్రి
- కుప్పంలో కృష్ణా జలాలకు హారతి ఇచ్చిన సీఎం
- కుప్పంలో చంద్రబాబు మూడు రోజుల పర్యటన ప్రారంభం


2 లో

విద్యార్థులు వినూత్నంగా ఆలోచన చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. వినూత్న ఆలోచనలకు భవిష్యత్ కాలంలో మంచి అవకాశాలు దక్కుతాయన్నారు. వినూత్నంగా ఆలోచన చేసేవారికి అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని... యువత ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు కోరారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గానికి శుక్రవారం చేరుకున్నారు. తొలి రోజు పర్యటనలో భాగంగా గుడిపల్లి మండలంలో ఆగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రాంగణంలోని టీచర్ ట్రైనింగ్ సెంటర్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. రూ. 3 కోట్ల వ్యయంతో 11 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆగస్త్య విద్యాచల్ అకాడమీ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసింది. ఏడాదికి 5 వేల మంది టీచర్లు, స్కూల్ లీడర్లను తీర్చిదిద్దేలా ఆగస్త్య విద్యాచల్ అకాడమీ శిక్షణ ఇవ్వనుంది. ఆధునిక, శాస్త్రీయ శిక్షణా కేంద్రంగా అగస్త్య విద్యాచల్ అకాడమీకి జాతీయ స్థాయిలో మంచి పేరుంది.

## కండువాను ధరించడానికి
# నిరాకరించారు
### రాష్ట్రపతిని అవమానించిన రాహుల్ గాంధీ

- బహూకరించిన కండువాను ధరించడానికి నిరాకరించారు
- కండువాను రాహుల్ ధరించకపోవడం ప్రథమ పౌరురాలిని అగౌరపరచడమే
- అసోం రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను రాహుల్ గాంధీ పట్టించుకోవడంలేదు
- కేంద్ర మంత్రి అమిత్ షా



అసోం రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టించుకోలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్వహించిన 'ఎట్ హోమ్' కార్యక్రమంలో ఆమె బహూకరించిన 'గమోసా' (కండువా)ను ధరించడానికి ఆయన నిరాకరించారని పేర్కొన్నారు. అది ఈశాన్య ప్రాంతాన్ని అగౌరవపరచడమేనని ఆయన అన్నారు. ఈ సందర్భంగా దిబ్రూఘర్లోని ఖనికర్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడారు.

వివరాలు-6లో

## నష్టాల్లో స్టాక్
# మార్కెట్లు


5 లో

- 269 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్, 98 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ
- భారీగా పతనమైన మెటల్ షేర్లు, ఐటీ రంగంలోనూ బలహీనత
- ముడిచమురు ధరలు తగ్గడంతో 15 పైసలు బలపడిన రూపాయి

## ఇప్పుడు ఆర్టీఐ వంతు
# వచ్చిందా?


6 లో

- ఇప్పటికే ఎంజీనరేగాను చంపేసిన మోడీ సర్కార్
- ఆర్‌టీఐ చట్టాన్ని బలహీనపరుస్తోన్న ఎన్‌డిఏ
- 2014 నుంచి ఇప్పటి వరకు 100 మందికిపైగా ఆర్‌టీఐ కార్యకర్తలు హత్య
- కేంద్రంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఘాటు వ్యాఖ్యలు

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

# కల్తీ నెయ్యి సరఫరా నిజమే

- సిట్ ఛార్జ్‌షీట్ చార్జి షీట్‌లో పేర్కొన్నది అదే
- భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వైసిపి నేతల అవాస్తవ ప్రకటనలు
- టీటీడీ పవిత్రతను భ్రష్టు పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవు
- లడ్డు నెయ్యి టెండర్లలో నిబంధనలు ఉల్లంఘించిన గత పాలక మండలి
- ఎన్‌డిడిబి దర్యాప్తులో జంతు కొవ్వు ఉందని నివేదిక ఇచ్చింది
- యావత్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి
- టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు


2 లో

## ఆంధ్రప్రదేశ్ నం.1 లక్ష్యం
# యువతే మా శక్తి

- అన్నిరంగాల్లో ఏపీని నెం.1గా చెయ్యడమే మా లక్ష్యం
- పాదయాత్ర ద్వారా సమాజం నుంచి ఎంతో నేర్చుకున్నా
- కూటమి ప్రభుత్వం వచ్చాక యువతకు 4లక్షల ఉద్యోగాలు కల్పించాం
- అభివృద్ధి వికేంద్రీకరణ, క్లస్టర్ బేస్డ్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం
- పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా చర్యలు
- సిఎస్ఆర్ తరహాలో పరిశోధనలకు కూడా పరిశ్రమలు నిధులివ్వాలి
- కాకినాడ జేఎన్టీయూలో హలో లోకేష్ పేరిట విద్యార్థులతో యువనేత ముఖాముఖి


2 లో

అన్నిరంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను నెం.1గా నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందులో విద్యార్థులంతా భాగస్వాములయ్యేలా వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. కాకినాడ జేఎన్టీయూ లో హలో లోకేష్ పేరిట నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు.

## అంతా ఇంతే!




తిరుమల లడ్డూపై నింద పోయినట్టేనా సార్ !

# తిరుమలలో సేవలు భేష్

- టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడుతో సూర్య పత్రిక అధినేత
- మర్యాద పూర్వకంగా కలిసిన నేటి దినపత్రిక సూర్య చైర్మన్ నూకారపు సూర్య ప్రకాష్ రావు
- తిరుమలలో పెరుగుతున్న సౌకర్యాలు, అభివృద్ధి పనుల పట్ల ప్రశంసలు


2 లో

టిటిడి బోర్డు అధ్యక్షులు బి ఆర్ నాయుడుని సూర్య పత్రిక అధినేత నూకారపు సూర్య ప్రకాష్ రావు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తిరుమలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రసాదాల నాణ్యత పెంపు పై తీసుకుంటున్న చర్యలను ప్రశంసిం చారు. అదే విధంగా లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల నాణ్యత పెంచడంలో చైర్మన్ తీసుకుంటున్న నిర్ణయాల పట్ల భక్తులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. గత పాలక మండలులకన్నా భిన్నమైన నిర్ణయాలు తీసుకుంటూ మీరు టిటిడిలో చాలా అభివృద్ధి పనులు చేస్తున్నారని అభినందించారు.

## ఏలూరులో రాష్ట్ర స్థాయి
# కోకో కాంక్లేవ్

- మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి గత ప్రభుత్వం రూ.7500 కోట్లు కేటాయించి పైసా విదల్చని వైనం
- కోకో పంటకు ఆయిల్ పామ్ పంట రీతిలో గిట్టుబాటు ధర కల్పించేందుకు కొత్త చట్టం
- ప్రారంభించిన వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్రాన్ని హార్టికల్చర్, కోకో హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. స్థానిక చింతలపూడి రోడ్డులోని బాలాజీ గార్డెన్స్ ఫంక్షన్ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సును మంత్రి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు.


2 లో




# విద్యార్థుల వినూత్నంగా ఆలోచించాలి

● ఇన్నోవేషన్లను ప్రోత్సహిస్తున్నాం ● స్టార్టప్ కంపెనీలకు అండగా ఉంటున్నాం ● నీటి సంరక్షణపై కుప్పంలో పైలెట్ ప్రాజెక్ట్ ● విద్యార్థులతో ముఖాముఖీలో సీఎం చంద్రబాబు ● కుప్పంలోని ఆగస్త్య అకాడమీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టిన ముఖ్యమంత్రి ● కుప్పంలో కృష్ణా జలాలకు హారతి ఇచ్చిన సీఎం ● కుప్పంలో చంద్రబాబు మూడు రోజులు పర్యటన ప్రారంభం



కుప్పం, జనవరి 30: విద్యార్థులు వినూత్నంగా ఆలోచన చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. వినూత్న ఆలోచనలకు భవిష్యత్ కాలంలో మంచి అవకాశాలు దక్కుతాయన్నారు. వినూత్నంగా ఆలోచన చేసేవారికి అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని... యువత ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు కోరారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గానికి శుక్రవారం చేరుకున్నారు. తొలి రోజు పర్యటనలో భాగంగా గుడిపల్లి మండలంలో ఆగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రాంగణంలోని టీచర్ ట్రైనింగ్ సెంటర్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. రూ. 3 కోట్ల వ్యయంతో 11 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆగస్త్య విద్యాచల్ అకాడమీ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసింది. ఏడాదికి 5 వేల మంది టీచర్లు, స్కూల్ లీడర్లను తీర్చిదిద్దేలా ఆగస్త్య విద్యాచల్ అకాడమీ శిక్షణ ఇవ్వనుంది. ఆధునిక, శాస్త్రీయ శిక్షణా కేంద్రంగా అగస్త్య విద్యాచల్ అకాడమీకి జాతీయ స్థాయిలో మంచి పేరుంది. లు, బ్లాక్ రిసోర్స్ సెంటర్లు, లైవ్ ఇంట్రాక్షన్ కోసం టూ వే బ్రాడ్ కాస్ట్ స్టూడియోలతో అత్యాధునిక ఏర్పాట్లు ఈ టీచర్ ట్రైనింగ్ సెంటర్లో చేశారు. అకాడమీలోని శిక్షణా కేంద్రాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ట్రైనింగ్ సెంటరుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు అకాడమీ ప్రాగంణంలోనే లెర్నర్స్ అకామిడేషన్ ఫెసిలిటీ సెంటర్ కు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.10 కోట్ల వ్యయంతో అకామిడేషన్ ఫెసిలిటీ సెంటర్ నిర్మించేలా ప్రణాళికలను సిద్దం చేసింది ఆగస్త్య అకాడెమీ సెంటర్. ప్రస్తుతం 240 మందికి అకాడెమిషన్ ఫెసిలిటీ కల్పిస్తుండగా... దీన్ని మరింత విస్తరిస్తూ ఆగస్త్య విద్యాచల్ అకాడెమీ నిర్మాణాలు చేపట్టింది. ఇదే ప్రాంగణంలో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఒబెరాయ్ విజిటర్స్ సెంటర్ కు సీఎం శంకుస్థాపన చేశారు. మల్టీ మీడియా ఎక్స్ పీరియన్స్ కలిగించేలా విజిటర్స్ సెంటర్ రూపకల్పన చేసినట్టు ఆగస్త్య విద్యాచల్ అకాడెమీ ప్రతినిధులు సీఎంకు వివరించారు. ట్రైనింగ్ పరిశీలన... విద్యార్థులతో ముఖాముఖి ట్రైనింగ్ తీసుకుంటున్న టీచర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పలకరించారు. రకరకాల కిట్లతో టీచర్ ట్రైనింగ్ ఇస్తున్న విధానాన్ని పరిశీలించారు. పిల్లలకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధన ఏ విధంగా చేయాలనే అంశంపై శిక్షణ తీసుకుంటున్నట్టు సీఎంకు టీచర్లు వివరించారు. ఆ తర్వాత అలాగే ఆగస్త్య విద్యాచల్ అకాడెమీలోని ఆడిటోరియంలో విద్యార్థులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. అకాడెమీ చేపడుతున్న కార్యక్రమాలు, విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికాంశాలపై అందిస్తున్న శిక్షణపై వీడియో ప్రదర్శనను విద్యార్థుల మధ్యలో కూర్చొని ముఖ్యమంత్రి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖ్యమంత్రి ఇంటరాక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఈ సంస్థ ఛైర్మన్ రామ్ జీ రాఘవన్ తో నాకు 25 ఏళ్ల నుంచి పరిచయం. మంచి ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభిస్తానని నాతో చెప్పారు... నేను అంగీకరించాను. 25 ఏళ్లుగా ఈ అకాడమీని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఇండియాలో ప్రముఖ సెంటరుగా పేరు తెచ్చుకుంది. స్వచ్ఛమైన వాతావరణంలో ఈ అకాడెమీ ఏర్పాటైంది. ఈ అకాడెమీలో చేపడుతున్న విధానాలే ఏపీ ఫ్యూచర్ విధానాలు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిణామాలను అందిపుచ్చుకోవాలి. అలా అందిపుచ్చుకోవడం వల్లే ఐటీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వాళ్లు విస్తరించారు. అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశాను... ఇప్పుడు ఏఐ గురించి అందరూ ఆలోచన చేయాలని చెబుతున్నాను."అని ముఖ్యమంత్రి చెప్పారు. భవిష్యత్ ఎలా ఉండబోతోందో విద్యార్థులు అంచనా వేయాలి "విద్యార్థుల ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి... భవిష్యత్ మనదే. రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త ఆవిష్కరణలు వస్తాయి. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్ కంపెనీలకు అవకాశాలు దక్కేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెట్టాం. డ్రోన్, స్పేస్ సిటీ వంటి వాటితో భవిష్యత్ రంగంలో ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. భవిష్యత్ భారతదేశం ఎలా ఉండబోతోందనే అంశంపై విద్యార్థులు కూడా అవగాహన పెంచుకోవాలి. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు... ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను గమనించాలి. విద్యుత్ రంగంలో మార్పులు వస్తున్నాయి... విద్యుత్ కొనుగోళ్లు ఛార్జీలు తగ్గించగలిగాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటే విద్యుత్ ఛార్జీలను తగ్గించవచ్చు. కుప్పాన్ని ప్రయోగశాలగా చూస్తాను... ఇక్కడికి అన్ని రకాల టెక్నాలజీలను తెస్తున్నాం. హంద్రీ-నీవా ద్వారా కుప్పం వరకు నీళ్లను తెచ్చాం... నీటి భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. నీటి సంరక్షణ విషయంలో ఆగస్త్య అకాడెమీ ప్రతినిధులు వినూత్నంగా ఆలోచన చేయాలి. నీటి సంరక్షణ, నీటి సద్వినియోగం విషయంలో కుప్పంలో పైలెట్ ప్రాజెక్టు చేపడదాం."అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, కుప్పం స్థానిక నేతలు పాల్గొన్నారు.



# ఏలూరులో రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్

● ప్రారంభించిన వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ● రైతుల ప్రతీ సమస్యను తెలుసుకుని వాటి పరిష్కార దిశగా కృషి ● మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి గత ప్రభుత్వం రూ.7500 కోట్లు కేటాయించి పైసా విదల్చని వైనం ● కోకో పంటకు ఆయిల్ పామ్ పంట రీతిలో గిట్టుబాటు ధర కల్పించేందుకు కొత్త చట్టం ● రాష్ట్రాన్ని హార్టికల్చర్, కోకో హబ్‌గా రూపొందించేలా ప్రణాళికలు ● త్వరలో విజయవాడలో అంతర్జాతీయ హార్టికల్చర్ కాంక్లేవ్ సదస్సు



ఏలూరు, ఉమ్మడి ప.గో. జిల్లా సూర్య బ్యూరో : రాష్ట్రాన్ని హార్టికల్చర్, కోకో హబ్ గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. స్థానిక చింతలపూడి రోడ్డులోని బాలాజీ గార్డెన్స్ ఫంక్షన్ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సును మంత్రి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కోకో ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. కోకో పంటను మరింత విస్తీర్ణంలో పెంచేలా రైతులను ప్రోత్సహించేందుకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన కోకో ఉత్పత్తి, సాగులో తీసుకోవలసిన మెళకువలు, మార్కెటింగ్ సౌకర్యాలు, తదితర అంశాలపై అధికారులు, ఉద్యానవన శాస్త్రవేత్తలతో కోకో అభ్యుదయ రైతులకు అవగాహన కలిగించడమే రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. రైతుల ప్రతీ సమస్యను ముందుగానే తెలుసుకుని వాటి పరిష్కార దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర జిఎస్డిపి లో వ్యవసాయం 50 వేల కోట్ల రూపాయలు ఉంటె ఉద్యానవన శాఖ 1. 68 లక్షల కోట్లు ఉందన్నారు. రాష్ట్రంలో రైతులకు మంచి ఆదాయం అందించేలా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నామని, ఉద్యానవన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు, ఆటోమేషన్ అందిస్తున్నామన్నారు. విజయవాడలో అంతర్జాతీయ స్థాయిలో హార్టికల్చర్ కాంక్లేవ్ సదస్సును త్వరలో పెద్దఎత్తున నిర్వహించి ఉద్యానవన పంటల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ని ఏర్పాటు చేసి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి గత ప్రభుత్వం రూ.7500 కోట్లు కేటాయించినప్పటికీ, 5 సంవత్సరాలలో కేవలం 1300 కోట్లు రూపాయలు మాత్రమే రైతులకు అందించిందన్నారు. తమ ప్రభుత్వం గత బడ్జెట్లో 300 కోట్లు కేటాయించి సంవత్సరకాలంలో 1200 కోట్ల రూపాయలు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి రైతులకు అందించామన్నారు. రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ కోకో పంట సాగులో తక్కువ ఖర్చుతో, నాణ్యమైన పంట అధిక దిగుబడి, రైతుకు లాభసాటిగా ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 44 వేల 984 ఎకరాలలో కోకో సాగవుతూ, 10 వేల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తితో దేశంలోనే ఏలూరు జిల్లా ప్రథమస్థానంలో ఉందన్నారు. జిల్లాలో అదనంగా 1200 హెక్టార్లలో కోకో పంట వేసేలా 15 వేల మంది రైతులకు శిక్షణ అందించామన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన కోకో ఉత్పత్తికి రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సులో శాస్త్రవేత్తల సూచనలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గత సంవత్సరం కోకో పంటకు ధర లేనప్పుడు రాష్ట్రప్రభుత్వం కిలోకి 50 రూపాయలు అందించిందన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సు శాస్త్రవేత్తలు అందించే సూచనలతో కోకో రైతులు తక్కువ ఖర్చుతో, నాణ్యమైన కోకో అధిక దిగుబడి సాధించాలన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ కోకో ఉత్పత్తిలో దేశంలో చింతలపూడి నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలుస్తుందన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ దేశంలోనే అధిక కోకో ఉత్పత్తి చేస్తున్న ఏలూరు జిల్లాలో కోకో ప్రాసెసింగ్ యూనిట్లు, చాకొలేట్ పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ కమీషనర్ కె. శ్రీనివాసులు, ఏలూరు ఉద్యానవన శాఖాధికారి సాజా నాయక్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, హార్టికల్చర్ వైస్ ఛాన్సలర్ ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, ఉద్యానవన విభాగానికి చెందిన జాతీయ సంస్థల డైరెక్టర్లు,అధిపతులు , ప్రముఖ పరిశోధనా సంస్థలు, సెంటర్ అఫ్ ఎక్సెలెన్స్ ప్రతినిధులు, ప్రముఖ జాతీయ బ్యాంకు ప్రతినిధులు,, కోకో ప్రాసెసింగ్ పెట్టుబడి దారులు, కోకో అభ్యుదయ రైతులు, ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ని, ఎమ్మెల్యే లు, జిల్లా కలెక్టర్, హార్టికల్చర్ ఉన్నతాధికారులను దుశ్శాలువాలతో సత్కరించారు. వివిధ కంపెనీలు, బ్యాంకర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు.

# తిరుమలలో సేవలు భేష్

● మర్యాద పూర్వకంగా కలిసిన నేటి దినపత్రిక సూర్య ఛైర్మన్ నూకారపు సూర్య ప్రకాష్ రావు
● తిరుమలలో పెరుగుతున్న సౌకర్యాలు, అభివృద్ధి పనుల పట్ల ప్రశంసలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల : టిటిడి బోర్డు అధ్యక్షులు బి ఆర్ నాయుడు ని సూర్య పత్రిక అధినేత నూకారపు సూర్య ప్రకాష్ రావు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తిరుమలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రసాదాల నాణ్యత పెంపు పై తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. అదే విధంగా లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల నాణ్యత పెంచడంలో ఛైర్మన్ తీసుకుంటున్న నిర్ణయాల పట్ల భక్తులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. గత పాలక మండలులకన్నా భిన్నమైన నిర్ణయాలు తీసుకుంటూ మీరు టిటిడిలో చాలా అభివృద్ధి పనులు చేస్తున్నారని అభినందించారు. సామాన్య భక్తులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వటం టీటీడీలో ఛైర్మన్ తీసికుంటున్న నిర్ణయాలలో ఒకటని సూర్య ప్రకాషరావు హర్షం వ్యక్తం చేసారు. లడ్డు ప్రసాదాలు మరియు అన్న ప్రసాదాలు నాణ్యత పెంచడం పై ఆయన టీటీడీ ఛైర్మన్ ని అభినందించారు. తిరుమలలోని అభివృద్ధి పనులు, సౌకర్యాలు భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని తెలిపారు. దీని వెనుక టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక కృషి ఉందన్నారు . ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఆత్మీయంగా ఆయనతో పలకరించారు. ఈ సందర్భంగా నేటి దినపత్రిక సూర్య ఛైర్మన్ నుకారపు సూర్యప్రకాష్ రావు కు ఘన స్వాగతాన్ని టీటీడీ ఛైర్మన్ బీ ఆర్ నాయుడు పలికారు. వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టిటిడి ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలో చేస్తున్న అభివృద్ధి గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తీసుకున్న నిర్ణయాలపై ఆయన పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ అభివృద్ధి వేగవంతంగా సాగుతోందని ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్వామి వారి భక్తులు పెద్ద ఎత్తున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని తెలియజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి వస్తున్న భక్తులకు అందిస్తున్న లడ్డు ప్రసాదాలు అన్నప్రసాదాల నాణ్యత పై టీటీడీ ఛైర్మన్ ఎంతో అభినందనీయమని ఆయన కితాబిచ్చారు. భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లు వారి కోసం తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో లాభదాయకంగా వ్యవహరించడం గర్వించ దగ్గ విషయమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య ఆత్మీయ పలకరింపు ద్వారా సుదీర్ఘంగా టిటిడి చేస్తున్న అభివృద్ధిపై చర్చించారు. టీటీడీ ఛైర్మన్ చేస్తున్న అభివృద్ధి భక్తుల సంక్షేమానికి ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో స్వామివారి భక్తులు ఎంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. టీటీడీ తన కార్యకలాపాలను తిరుమల కే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలలో కూడా పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించడం చాలా గర్వకారణమని ఆయన కొనియాడారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అనేకమంది భక్తులకు ఎంతో బాధ్యతతో ఆయన వ్యవహరిస్తున్న తీరు చాలా ఉన్నతమైనదని కొనియాడారు.

## ఆంధ్రప్రదేశ్ నం.1 లక్ష్యం
# యువతే మా శక్తి



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : అన్నిరంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను నెం.1గా నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందులో విద్యార్థులంతా భాగస్వాములయ్యేలా వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. కాకినాడ జేఎన్టీయూ లో హలో లోకేష్ పేరిట నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలిచ్చారు. జీవితంలో మనం కొన్ని నిర్ణయాలు తీసుకుంటాం, ఆ నిర్ణయాలే మన జీవితాన్ని మారుస్తాయి. పాదయాత్ర నిర్ణయం నా జీవితాన్ని మార్చేసింది. రాష్ట్రంలో కోట్లాది ప్రజలు, యువత ఆశలు, ఆకాంక్షలు, సమస్యలను తెలుసుకునే అవకాశం లభించింది. పాదయాత్రలో ఎంతో నేర్చుకున్నా. నాటి అనుభవాలనే ఇప్పుడు ప్రభుత్వంలో అమలు చేస్తున్నాం. ప్రభుత్వంలోకి రావడంతోనే మా పని పూర్తికాలేదు, అసలు పని ఇప్పుడే మొదలైంది. ఇకపై నెలకు ఒకసారి విద్యార్థులను కలవాలని భావిస్తున్నాను. దీనిద్వారా విద్యార్థుల ఆకాంక్షలు, మనోగతాన్ని తెలుసుకునే అవకాశం కలుగుతుంది. మీరు అద్భుతమైన ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. సమస్యలు చెప్పారు. మీ ఫీడ్ బ్యాక్ సీరియస్ గా తీసుకుంటాం. మీ సలహాలు కరిక్యులమ్ ఇంప్రూవ్ మెంట్ కు దోహదపడతాయి. ఏ స్థాయిలో ఉన్నా మోరల్ వాల్యూస్ మరువద్దు. నైతికవిలువలు నేర్పించేందుకు చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించాం. ఆయనకు కేబినెట్ ర్యాంకు ఇస్తే ప్రభుత్వం నుంచి ఎటువంటి సదుపాయాలు తీసుకోవడం లేదు. అమ్మకు చెప్పలేని పని మనం చెయ్యకూడదు అని గొప్పమాట చెప్పారు. అది సింపుల్, పవర్ ఫుల్ మాట.

**విద్యార్థుల ప్రశ్నలు - లోకేష్ సమాధానాలు**

శ్రావ్య, సివిల్ ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థిని: మా గోదావరికి ప్రతీ సంవత్సరం వరదలు వస్తూ ఉంటాయి. ప్రభుత్వం వరద సహాయ చర్యలు చేపట్టుతుంది.
**స్టూడెంట్స్ గా మేము ఏమన్నా చేయగలమా?**
**మా గోదావరి పై మీ ఆలోచనలు చెప్పండి?**

నారా లోకేష్ : దేశంలోనే ఉభయగోదావరి జిల్లాలు ధాన్యాగారంగా పేరొందాయి. ఆక్వాలో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉన్నాయి. అయితే స్థిరమైన అభివృద్ధి సాధించడం అవసరం. గత 18నెలలుగా రాష్ట్రానికి అనేక పెట్టుబడులు వస్తున్నాయి. ఆ వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. డిజైన్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీరింగ్ వంటివి ముఖ్యం. డిజిటల్ ట్విన్స్ ద్వారా వరదలను ముందుగా పసిగట్టే సాంకేతికతలపై దృష్టిసారించాలి. ఆక్వాలో ప్రపంచంలో నెం.1 స్థానంలో ఉన్నాం. ట్రంప్ టారీఫ్ కారణంగా కొత్తమార్కెట్లను వెతుకున్నాం. సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలు పరిష్కరించే దిశగా విద్యార్థులు పరిశోధనలపై దృష్టిపెట్టాలి.

సాయిప్రకాష్, బి.టెక్ 3వసంవత్సరం: సార్ నేను పిఠాపురం పవన్ కళ్యాణ్ తాలూకా...మీరు పవన్ కళ్యాణ్ ఎక్కడ కలిసినా సొంత అన్నాదమ్ముల్లా కలిసిపోతారు.. మీరు మొదటి సారి ఎప్పుడు కలుసుకున్నారు.

నారా లోకేష్: 2014 ఫలితాల తర్వాత తొలిసారి హైదరాబాద్ లో ఫస్ట్ టైమ్ పవనన్నను కలిశా. జీవన ప్రయాణంలో ఎంతోమందిని కలుస్తుంటాం. కొందరి కలయిక ప్రత్యేకంగా నిలచిపోతుంది. చంద్రబాబును రిమాండ్ లో పెట్టినపుడు పవనన్న వచ్చాడు. అక్కడ మాట్లాడుకున్నాం. తర్వాత థార్ వాహనంలో ఎక్కాం. ముందు పవనన్న, నా పక్కన బాలయ్యబాబు కూర్చున్నారు. నేను చాలా టెన్షన్ గా ఫీలయ్యాను. ఆరోజు పవనన్న మమ్మల్ని పలకరించి, కుటుంబానికి అండగా నిలబడిన విధానం జీవితాంతం గుర్తుపెట్టుకుంటా. మంచిగా ఉన్నపుడు అంతా మనవద్దకు వస్తారు. కష్టకాలంలో తక్కువమంది మాత్రమే అండగా ఉంటారు. ఎవరైతే కష్టకాలంలో మన వెంట నిలబడతారో... అటువంటి వారిని జీవితాంతం గుర్తుపెట్టుకోవాల్సిన బాధ్యత యువతపై ఉంది. చాందిని, బిటెక్ విద్యార్థిని: సర్, ఎప్పటి నుండో నాకు ఒక ప్రశ్నఉంది.. మనం ఎంత ఎదిగినా కులం, మతం, ప్రాంతం అనే చట్రాల్లో ఇరుక్కొని పోతున్నాము.. వీటిపై మీ అభిప్రాయం ఏమిటి? నారా లోకేష్: కొందరు వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం మనమధ్య డివిజన్ తెస్తున్నారు. ఏ కుటుంబంలో పుట్టడం అన్నది దేవుడు నిర్ణయిస్తారు. మనందరిపైన పవిత్ర బాధ్యత ఉంది. మనుషులుగా మనపై కొంత సామాజిక బాధ్యత ఉంది. భారత ప్రజాస్వామ్యం ఇతర దేశాలకంటే చాలా గొప్పది. దేశానికి మనవంతు సేవలందించాలి. మాది చిన్న కుటుంబం. మా ఇంట్లో మేమంతా కలిసే ఉంటాం. మేం అయిదుగురు కుటుంబ సభ్యులం. మాకు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలు లేవు. మావి అన్నీ ఉమ్మడి ఆస్తులే. మేమంతా ఒక్కటిగానే ముందుకు సాగుతాం. అదే భారతీయ సంస్కృతి, కుటుంబ వ్యవస్థ గొప్పదనం. ఎఐ, యూ ట్యూబ్, టిక్ టాక్ లాంటి సాంకేతికతలు మన సంస్కృతి, సాంప్రదాయాలను భర్తీచేయలేవు. ఇతరుల నుంచి నేర్చుకోవడం చాలా ముఖ్యం. దిలీప్ కుమార్, పెట్రోలియం ఇంజనీరింగ్, 3వ సంవత్సరం: లెర్నింగ్ ఎక్సలెన్స్ అవుట్ కమ్స్ కోసం ప్రాథమికస్థాయిలో మీరు లీప్ ప్రోగ్రామ్ ను అమలుచేస్తున్నారు. సింపుల్ లోకాస్ట్ మోడల్ లో ఇంజనీరింగ్ కాలేజిల్లో లీప్ నమూనాలోనే డిజైనింగ్, టెస్టింగ్, ఇనిస్టిట్యూషనలైజ్ మోడల్ అమలు చేయగలరా? నారా లోకేష్ : ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ఇండస్ట్రీ ఫీడ్ బ్యాక్ ఆధారంగా కరిక్యులమ్ రూపొందించి స్కిల్ గ్యాప్ ను భర్తీచేస్తున్నాం. స్కిల్ గ్యాప్ ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాల్లో ఉంది. దీనిని భర్తీచేయడంలో ఇండస్ట్రీ ది కూడా ముఖ్యమైన పాత్ర. రాష్ట్రానికి కొత్తగా వచ్చే పరిశ్రమలకు ఏం అవసరమో ఇప్పటినుంచే చెబితే అందుకు తగ్గట్టుగా కరిక్యులమ్ రూపొందిస్తాం. బ్లూకాలర్ వర్కర్లకు కావాల్సిన స్కిల్స్ నేర్పిస్తాం. ల్యాబ్ లు కూడా చాలా ముఖ్యం. అటల్ టింకరింగ్ ల్యాబ్ వంటివి ఏర్పాటు చేస్తున్నాం. ఇటువంటి అన్ని యూనివర్సిటీల్లో ఏర్పాటుచేస్తాం. పెట్రోలియం, ఆక్వా, గ్రీన్ హైడ్రోజన్ బేస్డ్ గా ఇక్కడ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తాం. ప్రతి వర్సిటీలో అక్కడ వచ్చే పరిశ్రమలకు అనుగుణంగా అవసరమైన ల్యాబ్ లు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశోధనలు చాలా అవసరం. భారతదేశవ్యాప్తంగా రిసెర్చి కొరతగా ఉంది. కేంద్రమంత్రి అశ్వనీ వైష్టవ్ ను దావోస్ లో కలిసినపుడు సిఎస్ ఆర్ ఫండ్స్ తరహాలో ఆర్ అండ్ డి పై కొంత పర్సంటేజిని పరిశ్రమలు యూనివర్సిటీలకు కేటాయించాలి.

# కల్తీ నెయ్యి సరఫరా నిజమే

● సిట్ ఛార్జ్‌షీట్ చార్జి షీట్‌లో పేర్కొన్నది అదే ● భక్తులు మనోభావాలు దెబ్బతీసేలా వైసిపినేతల అవాస్తవ ప్రకటనలు ● టీటీడీ పవిత్రతను భ్రష్టు పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవు ● లడ్డు నెయ్యి టెండర్లలో నిబంధనలు ఉల్లంఘించిన గత పాలక మండలి ● కమీషన్ల కోసం సరైన సామర్థ్యం లేని సంస్థలకు నెయ్యి టెండర్లు ● 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి కొనుగోలు చేసి 20 కోట్లు లడ్డూలు విక్రయం ● తమ మనోభావాలు దెబ్బతీసిన వారిపై శ్రీవారి భక్తులు ఆగ్రహంతో ఉన్నారు ● ఎన్‌డిడిబి దర్యాప్తులో జంతు కొవ్వు ఉందని నివేదిక ఇచ్చింది ● యావత్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి ● టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు



తిరుమల మేజర్ న్యూస్ : శ్రీవారి పవిత్రమైన లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడిన్నట్లు సిట్ బృందం ఛార్జ్‌షీట్‌లో స్పష్టం చేసిందని, కానీ అందులో క్లీన్ చిట్ అంటూ శ్రీవారి భక్తులను వైసిపి అందుకో మోసం చేస్తున్నారని, భక్తులు మనోభావాలు దెబ్బతీసేలా వైసిపి అవాస్తవ ప్రకటనలు చేస్తూ టిటిడి పవిత్రతను భ్రష్టు పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు జి భాను ప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మీ, నరేష్‌కుమార్, డాలర్స్ దివాకర్ రెడ్డి, దర్శన్ తో కలసి ఆయన మాట్లాడారు. నెయ్యి కల్తీ జరగలేదని చెప్పడం వాస్తవం కాదని, సిట్ ఛార్జ్‌షీట్‌లోనే కల్తీ జరిగిందని స్పష్టంగా నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియలో అప్పటి వైసిపి నిబంధనలు ఉల్లంఘించిందని, పార్టీలోని కొంతమంది లాభం చేకూర్చే విధంగా ఈ నిబంధనలు మార్చారన్నారు. నాణ్యమైన నెయ్యిని సరఫరా చేసే సరైన సామర్థం లేని సంస్థలకు నెయ్యి టెండర్లను అప్పగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రూ. 250 కోట్ల రూపాయలతో 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి కొనుగోలు జరిగిందన్నారు. ఈ నెయ్యిని పరీక్షించిన ఎన్ డిడిబి అందులో జంతు కొవ్వు ఉందని నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. కల్తీ నెయ్యి కొనుగోలు చేసి 20 లక్షల లడ్డూలను తయారుచేసి విక్రయించారని మండిపడ్డారు. భోలే బాబా సమస్త కు ఒక్క ఆవు కూడా లేకుండా చుక్క నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యిని కొనుగోలు చేసేందుకు టెండర్ల వేయించారని, ఇది పూర్తిగా అవాస్తవమని నెయ్యి తయారీలో వాడిన కొన్ని రసాయనాలు అత్యంత ప్రమాదకరమైనవని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ నెయ్యితో సుమారు 20 కోట్ల లడ్డూలు తయారు చేయడం ద్వారా తిరుమల క్షేత్ర పవిత్రతకు తీవ్రమైన భంగం కలిగించారని పేర్కొన్నారు. కమిషన్ల కోసమే కొన్ని డైరీలను ఎంపిక చేశారని, హైందవ సమాజాన్ని నాశనం చేయడానికి కొందరు మూర్ఖులు ప్రయత్నిస్తున్నారన్నారు. గత 5 ఏళ్లలో హిందూ దేవుళ్ళను, హిందూ సమాజాన్ని హేళన చేశారని, వారంతా హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కల్తీ నెయ్యి పై క్లీన్ చిట్ వచ్చిందని ప్రచారం చేయడం వాస్తవాలకు విరుద్ధమని ఆయన తెలిపారు. వైసిపి నేతలు పచ్చి అబద్దాలు మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. భోలే బాబాను కమిషన్ల కోసమే వైసీపీ ఎంచుకుందని మండిపడ్డారు. చేసిందంతా చేసి తమకేమీ తెలియదని కరుణాకర్ రెడ్డి మృత్యుంజయ యాగం చేయడం హాస్యాస్పదమన్నారు. ప్రాణంపై అంత భయం ఉంటే ఎందుకు తప్పు చేశావని ఆయన ప్రశ్నించారు. ఇంత జరిగినా వైసీపీ వాళ్లకు బుద్ధి రాలేదని మండిపడ్డారు. దుర్మార్గుల నుంచి శ్రీవారిని ఆలయాన్ని హిందూ సమాజం కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నెయ్యి నాణ్యతపై తుది నిజాలు వెలుగులోకి రావాలంటే మైక్రో డీఎన్ఏ టెస్ట్ తప్పనిసరిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొంతమంది ఖాతాల్లోకి వెళ్లిన కోట్ల రూపాయల లావాదేవీలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని సిట్‌ను కోరారు. బ్యాంక్ ఖాతాలలో కోట్ల రూపాయలు జమ కావడం వాస్తవమా కాదా, బినామీల వెనుక అసలు పెద్దలు ఎవరో నిగ్గుతేల్చాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని, టిటిడి పవిత్రతను కాపాడేందుకు ఎలాంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రీయం ఆంధ్రప్రదేశ్

### కాకినాడ జేఎన్ టీయూలో
# పీజీ బాయ్స్ హాస్టల్ ప్రారంభం
### ప్రారంభించిన మంత్రి లోకేష్



కాకినాడ: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కాకినాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాకినాడ జేఎన్ టీయూలో నందనం పేరుతో నూతనంగా నిర్మించిన పీజీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా రాజమండ్రి విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గం ద్వారా కాకినాడ జేఎన్ టీయూకి చేరుకున్న మంత్రి లోకేష్ కు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, జేఎన్ టీయూ యాజమాన్యం ఘనస్వాగతం పలికారు. అనంతరం పీజీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. అంతకుముందు యూనివర్సిటీ ప్రాంగణంలో జేఎన్ టీయూ అనుబంధ కాలేజీల ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ ఫెయిర్ పేరుతో" ఏర్పాటుచేసిన 20 స్టాళ్లను మంత్రి సందర్శించారు. వివిధ కాలేజీల విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను పరిశీలించారు. ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన అరటి దవ్వ నుంచి ఆహార ఉత్పత్తుల తయారీ ఆవిష్కరణ, ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు రూపొందించిన 'ద మొబైల్ బనానా ఎక్స్ ట్రాక్టర్', రామకృష్ణంరాజు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు రూపొందించిన 'ఇంటిలిజెంట్ ఎనర్జీ మేనేజ్ మెంట్ సిస్టమ్' ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. కాకినాడ జేఎన్ టీయూలో రూ.10 కోట్ల రూసా, యూనివర్సిటీ నిధులు వెచ్చించి 53,606 చదరపు అడుగుల వైశాల్యంలో జీ+2 పీజీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించడం జరిగింది. దీంతో పాటు జేఎన్ టీయూ క్యాంపస్ లో రూ.21 కోట్ల యూనివర్సిటీ నిధులు వెచ్చించి సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైయిన్స్ సౌకర్యాన్ని కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఎన్ టీయూ–కాకినాడ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డా.చేకూరి శివరామకృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ డా.ఎన్ మోహన్ రావు, జేఎన్ టీయూకే ఇన్నోవేషన్ హెడ్ గోపాలకృష్ణతో పాటు ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, ఆదిరెడ్డి వాసు, జోనల్ కోఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు, కాకినాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నవ్యాంధ్ర నవ నిర్మాణ వారధులు..

● లోకేష్ హలో - యువతలో సరికొత్త జోష్! ● ఓటమి అంటే పరాజయం కాదు.. అది నేర్చుకోవడంలో మొదటి అడుగు! ● జేఎన్టీయూ వేదికగా మంత్రి లోకేష్ స్ఫూర్తిమంతమైన పిలుపు ● విద్యార్థులు కేవలం పట్టభద్రులకే పరిమితం కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును మార్చే నాయకులుగా ఎదగాలి ● నూతన ఆలోచనలకు పదును పెట్టండి, ఆవిష్కరణలే సమాజ సమస్యలకు ఆయుధాలు కావాలి ● సంస్కారం, మానవ విలువలు కలిసిన సాంకేతికతే రాష్ట్రానికి శ్రీరామరక్ష జేఎన్టీయూకే మౌలిక వసతుల కోసం రూ. 31 కోట్ల కేటాయింపు



ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు తరగతి గదుల నుండే ఆరంభం కావాలని, ఆ దిశగా యువత అడుగులు వేయాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. కేవలం పట్టా పుచ్చుకుని బయటకు రావడం కాకుండా, సమాజానికి దిశానిర్దేశం చేసే నాయకులుగా, నూతన ఆవిష్కర్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, ఒక దార్శనిక ప్రసంగంతో విద్యార్థులలో నూతన ఉత్తేజాన్ని నింపింది.

**యువ మేధస్సుకు పట్టాభిషేకం :** విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనను మంత్రి సందర్శించినప్పుడు, విద్యార్థుల సృజనాత్మకతకు ఆయన అబ్బురపడ్డారు. సుమారు 20 వినూత్న ప్రయోగాలను స్వయంగా పరిశీలించిన లోకేష్, ప్రతి విద్యార్థితోనూ ముచ్చటించి వారి ఆలోచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీ ఆలోచనలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకూడదు. అవి సామాన్యుడి కష్టాలను తీర్చే సాధనాలుగా మారాలి. స్వయం ఉపాధి, సొంత పరిశ్రమల స్థాపన వైపు దృష్టి సారిస్తే, మీరే పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకుంటారు అని పేర్కొన్నారు.మీరు కేవలం పట్టభద్రులకే పరిమితం కావద్దు.. రాష్ట్ర భవిష్యత్తును మార్చే నాయకులుగా ఎదగాలి

**వైఫల్యంపై సరికొత్త నిర్వచనం :** చాలామంది విద్యార్థులు విఫలమవుతామనే భయంతో కొత్త ప్రయోగాలు చేయడానికి వెనుకాడుతుంటారని, ఆ భయాన్ని వీడాలని మంత్రి సూచించారు. ఓటమి అనేది విజయానికి ముగింపు కాదు, అది గెలుపు వైపు వేసే మొదటి అడుగు. ప్రతి అపజయం ఒక కొత్త పాఠాన్ని నేర్పుతుంది. సృజనాత్మకతకు పదును పెట్టి, పట్టుదలతో ముందుకు సాగితే ప్రపంచం మీ పాదాక్రాంతమవుతుంది అని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

**సాంకేతికతకు తోడవ్వాల్సిన మానవత్వం :** ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధ ప్రాధాన్యతను గుర్తిస్తూనే, దాని పరిమితులను లోకేష్ స్పష్టం చేశారు. యంత్రాలు మనిషి పనిని సులభం చేయగలవు కానీ, మనిషిలోని ఆలోచనా శక్తిని, కుటుంబ వ్యవస్థను భర్తీ చేయలేదు. సంస్కారం, మానవ విలువలు కలిసిన సాంకేతికతే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, ప్రైవేట్ రంగాలు మరియు ప్రజలు కలిసికట్టుగా పనిచేసే చతుర్ముఖ భాగస్వామ్యమే రాష్ట్ర అభివృద్ధికి అసలైన మార్గమని ఆయన ఉద్ఘాటించారు.

**అభివృద్ధి పథంలో విద్యా ప్రాంగణం :** వసతులు మెరుగ్గా ఉంటేనే విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టగలరని నమ్మే లోకేష్, జేఎన్టీయూకే అభివృద్ధి కోసం రూ. 31 కోట్ల నిధులతో చేపట్టిన పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా రూ. 10 కోట్లతో నిర్మించిన నందనం వసతి గృహం 252 మంది విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వసతిని కల్పించనుంది. అలాగే రూ. 21 కోట్లతో చేపట్టిన సిమెంట్ రోడ్లు మరియు మురుగునీటి పారుదల వ్యవస్థలు ప్రాంగణ మౌలిక వసతులను ఆధునీకరించాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికలో మార్పులు తీసుకురావడం ద్వారా, ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచ వేదికపై పోటీ పడేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. హరిత హైడ్రోజన్, క్వాంటం కంప్యూటింగ్ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాలలో జేఎన్టీయూకే ఒక పరిశోధనా కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ తన పర్యటనను ముగించారు.ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, రెక్టార్ ప్రొఫెసర్ పి.సుబ్బారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డి ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ఐక్యతే బలం

● పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి ● ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి ● పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండండి ● కూటమి నాయకుల మధ్య సఖ్యత ముఖ్యం.. ● కలిసికట్టుగా పని చేయండి.. ఐక్యంగా ముందుకు సాగాలి ● 11వ బ్యాచ్ క్యాడర్ శిక్షణలో పాల్గొన్న నేతలకు మంత్రి లోకేష్

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : వార్డు, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల కోసం నిర్వహించిన 11వ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన విస్తృతంగా మాట్లాడారు. పార్టీ క్యాడర్ సమన్వయంతో పాటు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని లోకేష్ స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా ఓర్పుతో, ఐక్యంగా దుష్ప్రచారాలను ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.

**అభివృద్ధిపైనే కాదు.. దుష్ప్రచారాల రాజకీయాన్ని కూడా ఎదుర్కోండి**

201419 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినా, వాటిని ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడంలో వెనుకబడ్డామని లోకేష్ గుర్తు చేశారు. అదే అప్పటి ఓటమికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి కార్యక్రమాన్ని ప్రజలకు నేరుగా వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. 2019లో అభివృద్ధిపై మాత్రమే దృష్టి పెట్టామని, కానీ ప్రతిపక్షం దుష్ప్రచార రాజకీయాలతో అధికారంలోకి వచ్చిందని లోకేష్ అన్నారు. ఇకపై అభివృద్ధితో పాటు, తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేసే శక్తులను ధీటుగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు.

**కూటమి నాయకుల మధ్య సఖ్యత ముఖ్యం**

కూటమి నాయకుల మధ్య సఖ్యత అత్యంత ముఖ్యమని లోకేష్ తెలిపారు. కూటమిని చీల్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నా, కూటమిని విడదీయడం ఎవరి తరం కాదని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో కూటమి నేతలందరినీ కలుపుకుని కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు అలగడం తగదని, ప్రతి ఒక్కరి కష్టాన్ని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని లోకేష్ భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబం అని, కుటుంబంలో సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు.

**తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టండి**

గత వైసీపీ ప్రభుత్వం కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిందని లోకేష్ తీవ్ర విమర్శలు చేశారు. చేయకూడని పాపాలు చేసి, ఇప్పుడు కూడా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వైసీపీ దుష్ప్రచారాలతో నిండిపోయిందని,తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టండంతో పాటు ఆ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తెలుగుదేశం కార్యకర్తలదేనని ఆయన స్పష్టం చేశారు.పార్టీ కోసం ప్రతి కార్యకర్త చేస్తున్న సేవలు, కష్టాలను మై



టీడీపీ యాప్ ద్వారా పార్టీకి తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో మై టీడీపీ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ తరగతులు పార్టీని మరింత బలోపేతం చేయడంలో కీలకంగా మారతాయని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మార్చి నాటికి గొల్లపూడి నుంచి చినకాకాని 6 లైన్ల హైవే పూర్తి

### కేంద్ర మంత్రి గడ్కరీ కీలక ప్రకటన

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విజయవాడ బైపాస్ రోడ్డుపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శుభవార్త చెప్పారు. గొల్లపూడి నుంచి చినకాకాని వరకు నిర్మిస్తున్న ఈ ఆరు వరుసల రోడ్డు మార్చి 31 నాటికి పూర్తవుతుందని తెలిపారు. రూ.1,194.59 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుతో విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే విజయవాడ పశ్చిమ బైపాస్‌లో ఒకవైపు వాహనాలను అనుమతిస్తున్నారు. సంక్రాంతి నుంచి రాకపోకలు ప్రారంభం అయ్యాయి. ఏపీకి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తీపికబురు చెప్పారు. గొల్లపూడి నుంచి చినకాకాని వరకు నిర్మిస్తున్న విజయవాడ బైపాస్ రోడ్డుపై కీలక ప్రకటన చేశారు. ఈ బైపాస్ రోడ్డు ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తవుతుందనిగడ్కరీ తెలిపారు. లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానం ఇచ్చారు. కృష్ణా నదిపై ప్రధాన వంతెనలతో కూడిన ఈ ఆరు వరుసల బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం 2019లో అనుమతులు జారీ అయ్యాయి. దీనికి మొత్తం రూ.1,194.59 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశాము. ఈ రోడ్డు కృష్ణా నదిపై పెద్ద వంతెనలతో నిర్మిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 30 నాటికి.. మొత్తం 17.6 కిలోమీటర్లలో 13.410 కిలోమీటర్ల నిర్మాణం పూర్తి. మిగిలిన 4.226 కిలోమీటర్ల పనులు ఈ ఏడాది మార్చి 31 లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము అన్నారు. ఈ బైపాస్ రోడ్డు విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని భావిస్తున్నారు.

సంక్రాంతి సమయంలో విజయవాడ పశ్చిమ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజా నుంచి కృష్ణా జిల్లా పెదఅవుటుపల్లి వరకు నిర్మించిన విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఒకవైపు రహదారిని అధికారులు ప్రారంభించారు. మార్చి నెలాఖరులోగా రహదారికి రెండో వైపు భాగాన్ని కూడా అందుబాటులోకి తీసుకొస్తామంటున్నారు. చెన్నై, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు కాజా టోల్‌గేట్ దాటిన తర్వాత వెస్ట్ బైపాస్‌లోకి వెళ్లి.. గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు ప్రయాణించి, అక్కడ ఏలూరు వైపు హైవేలోకి వెళ్లొచ్చు. ఈ వెస్ట్ బైపాస్‌లో.. గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు విజయవాడలోకి రావాల్సిన అవసరం లేకుండా నేరుగా ఏలూరు, హైదరాబాద్ వైపు వెళ్ళిపోవచ్చు. ఇప్పటికే గొల్లపూడి నుంచి చిన్నఅవుటపల్లి మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పుడు గుంటూరు జిల్లా కాజా వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా నేరుగా ఏలూరు వైపు వెళ్లొచ్చు. ఈ బైపాస్‌లో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు గొల్లపూడి దగ్గర విజయవాడ–హైదరాబాద్ హైవేలోకి కలిసిపోయి హైదరాబాద్ వైపు వెళ్ళిపోవచ్చు. దీనివల్ల గుంటూరు నుంచి ఏలూరు,



హైదరాబాద్ వెళ్లే వాహనాలు విజయవాడ నగరంలోకి రాకుండానే తమ గమ్యస్థానాలకు వెళ్లొచ్చు. వెస్ట్ బైపాస్‌లో గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలకు వెస్ట్ బైపాస్‌లో కాజా వరకు వెళ్లేందుకు ప్రస్తుతం వీలుపడదు. రహదారి నిర్మాణ పనులు కొన్ని చోట్ల జరుగుతున్నాయని జాతీయ రహదారుల అధికారులు వివరించారు. ఈ వాహనాలు యథావిధిగా గొల్లపూడి వైపు నుంచి వస్తున్నప్పుడు, కృష్ణా నదిపై ఉన్న వంతెనను, సీడ్ యాక్సెస్ రోడ్డును దాటిన తర్వాత మంగళగిరి–మందడం రోడ్డులోకి ప్రవేశించి, సచివాలయం, హైకోర్టు వైపు వెళ్లవచ్చని అధికారులు పేర్కొన్నారు. పూర్తిస్థాయి రహదారి అందుబాటులోకి వచ్చిన తర్వాతే వెంకటపాలెం వద్ద టోల్‌ఫీజు వసూలు చేస్తారు.



# బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసా

● ఏపీ జెన్ కోలో 27 మందికి కారుణ్య నియామకాలు ● ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రక్రియ ● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ఏపీ జెన్ కో పరిధిలో 27 మంది అర్హులకు కారుణ్య నియామక పత్రాలను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తోందని స్పష్టం చేశారు. మృత ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వారి విద్యార్హతలకు తగిన ఉద్యోగాలు కల్పించి, వారి సేవలను విద్యుత్ శాఖలో సమర్థవంతంగా వినియోగించుకుంటామని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కరికి కూడా ఇంజనీరింగ్ స్థాయి ఉద్యోగం ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన వారిని కూడా జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకే పరిమితం చేశారని ఆరోపించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో అర్హులైన అభ్యర్థులకు ఏజ్ రిలాక్సేషన్ కల్పించి, ఇప్పుడు జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాలు కూడా అందజేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు 600 మందికి పైగా కారుణ్య నియామకాలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి కారుణ్య నియామకాల ప్రక్రియను చేపడతామని కీలక ప్రకటన చేశారు. బాధిత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద, ఎమ్మెల్యేలు లు ముత్తుమల అశోక్ రెడ్డి, కందుల నారాయణరెడ్డి, డైరెక్టర్ పుల్లారెడ్డి జెన్కో సీఎండీ, ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# టీడీపీలో కార్యకర్తలే హైకమాండ్..

● కార్యకర్తలు చెప్పింది పాటిస్తాం ● తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా ● తలదించుకునే స్థితి నుంచి ఏపీతో పోటీ పడలేమనే స్థితికి తీసుకువచ్చాం ● సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం ● తిరుమల లడ్డూపై వైసీపీ డ్రామా పట్ల అప్రమత్తంగా ఉండాలి ● ప్రజలకు వాస్తవాలు వివరించాలి అందరినీ సంప్రదించి నియోజకవర్గానికి సమర్థవంతమైన నాయకత్వం అందిస్తాం ● కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్



కాకినాడ: టీడీపీలో కార్యకర్తలే హైకమాండ్.. కార్యకర్తలు చెప్పింది పాటిస్తాం. తలదించుకునే స్థితి నుంచి ఏపీతో పోటీ పడలేమనే స్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కాకినాడ అచ్చంపేట జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన వేదికలో కాకినాడ రూరల్ నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. కాకినాడ కాజ స్వీట్ గా ఉంటుంది. కాకినాడ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మాత్రం హాట్ గా ఉంటారు. నమ్ముకున్న వాటికోసం, పార్టీ కోసం కేసులకు కూడా వెరవని గొప్ప కార్యకర్తలు కాకినాడ పార్లమెంట్ లో ఉన్నారు. ఎన్నికష్టాలు వచ్చినా మీరు నాకు అండగా నిలిచారు. ఈ రోజు వేదికపై మేం కూర్చొన్నామంటే దాని వెనుక మీ త్యాగం, శ్రమ ఉంది. టీడీపీలో కార్యకర్తలే హైకమాండ్.. కార్యకర్తలు చెప్పింది పాటిస్తాం టీడీపీని భూస్థాపితం చేస్తామని ప్రగల్భాలు పలికిన వారు ఏమయ్యారో అందరికీ తెలుసు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. గత మహానాడులో ఆరు శాసనాల గురించి వివరించాం. అందులో ఒక శాసనం కార్యకర్తలే మా అధినేత. టీడీపీలో కార్యకర్తలే మా హైకమాండ్. మీరు చెప్పింది మేం పాటిస్తాం. మీ అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాతనే ఏ నిర్ణయమైనా తీసుకుంటాం. మనందరిది పెద్ద కుటుంబం. అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. కుటుంబంలో కొన్నిసార్లు వెనక్కి తగ్గాల్సి వస్తుంది. పార్టీ అంటేనే ఒక కుటుంబం. మీకు కావాల్సిన నిర్ణయాలు తీసుకునేందుకే మేం ఇక్కడ ఉన్నాం. పసుపు జెండా చూస్తేనే ఒక ఎమోషన్. చంద్రబాబు గారిని 53 రోజుల పాటు జైల్లో అక్రమంగా నిర్బంధించారు. అప్పుడు మీరంతా మాకు అండగా నిలిచారు. మీ త్యాగాల వల్లే 94శాతం సీట్లు గెలుచుకోవడం జరిగింది. 175 స్థానాలకు గాను 164 స్థానాలు గెలిచాం. తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా పుంగనూరు నియోజకవర్గంలో ఆనాటి అధికార పార్టీ అరాచకాలపై మీసాలు మెలేసి తొడగొట్టిన అంజిరెడ్డి తాత నాకు స్ఫూర్తి. పల్నాడులో రక్తం కారుతున్నా బూత్ లో చివరి ఓటు పడేవరకు వీరోచితంగా పోరాడిన మంజుల నాకు స్ఫూర్తి. మెడపై కత్తిపెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని నినదించి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య మనకు స్ఫూర్తి. అందుకే తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నేను పట్టుబట్టా. చట్టం కూడా చేశాం. అసెంబ్లీలో పాస్ అయింది. కౌన్సిల్ కు వస్తే వైసీపీ నేతలు అడ్డుకున్నారు. ఎవరైతే టీడీపీ కార్యకర్తలను హతమారుస్తారో.. వారి కుటుంబం బలహీనపడకుండా వారిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తే మనవైపు చూసేందుకు భయపడతారు. అందుకే చట్టం తీసుకువచ్చాం. వచ్చే సెషన్ లో పాస్ చేసి తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా. తలదించుకునే స్థితి నుంచి ఏపీతో పోటీ పడలేమనే స్థితికి తీసుకువచ్చాం కూటమి ప్రభుత్వంలో ఎన్ని ఆర్థిక కష్టాలు ఉన్నా ఇచ్చిన హామీలను పద్ధతి ప్రకారం నెరవేరుస్తున్నాం. దేశంలో ఎవరూ ఇవ్వని విధంగా పెన్షన్లు చెల్లిస్తున్నాం. వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు చెల్లిస్తున్నాం. తల్లికివందనం కింద ఆర్థికసాయం అందిస్తున్నాం. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు అండగా నిలిచాం. స్త్రీశక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. 220కి పైగా కేసులు వేసినా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేసి 16వేల మందికి టీచర్ ఉద్యోగాలు కల్పించాం. 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. గతంలో ఏపీ నుంచి వచ్చామంటే తలదించుకునే పరిస్థితి. అలాంటిది ఈ రోజుకు ఎక్కడికి వెళ్లినా ఏపీతో పోటీపడలేమనే పరిస్థితి. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం ఇప్పటికే 23 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకోవడం జరిగింది. తద్వారా 16 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పక్కనే ఉన్న కోరమాండల్ ఫర్టిలైజర్స్ కూడా తమ విస్తరణ ప్రణాళిక ద్వారా 8వేల మందికి అదనంగా ఉద్యోగాలు కల్పించనుంది. ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని–అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. కార్యకర్తలను కలిసిన తర్వాతనే ఏ కార్యక్రమం అయినా చేపడుతున్నాం. ఇప్పటికే 81 ప్రజాదర్బార్ లు నిర్వహించాం. ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నాం. కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటున్నాం. తూర్పుగోదావరి జిల్లా అన్నా, టీడీపీ అన్నా ఆ బంధమే వేరు. గత ఎన్నికల్లో 19 స్థానాల్లో గెలిపించారు. టీం 11ను శాసనసభకు కూడా రాకుండా ఏపీ ప్రజలు చేశారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ కు కూడా శంకుస్థాపన చేయడం జరిగింది. తద్వారా 8వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. తిరుమల లడ్డూపై వైసీపీ డ్రామా పట్ల అప్రమత్తంగా ఉండాలి ప్రతిపక్షం దుష్ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. కోడికత్తి డ్రామా, బాబాయి వివేకానంద హత్య, గులకరాయి ఘటనలు చూశాం. టీడీపీపై నెపం వేశారు. కల్తీ నెయ్యి, కల్తీ మద్యం.. వైసీపీ కల్తీ పార్టీ. దేవుడి ప్రసాదం గురించి మాట్లాడుతున్నారు. మనపై ఆరోపణలు చేస్తున్నారు. టీటీడీ లడ్డు విషయంలో రాజకీయం చేయదల్చుకోలేదు. మీకు వాస్తవాలు తెలియాలి. 2019 వరకు నాణ్యమైన నెయ్యి సరఫరాకు చర్యలు తీసుకున్నాం. టెస్టింగ్ చేసి పద్ధతి ప్రకారం వెళ్లాం. నాణ్యమైన నెయ్యి కోసం కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నుంచి ఎక్కువ శాతం నెయ్యి కొనుగోలు చేశాం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టెండర్



నిబంధనలు మార్చారు. ఏకంగా చిన్న చిన్న కంపెనీలకు ఆర్డర్లు ఇచ్చేందుకు నిబంధనలు మార్చారు. 2022లో శాంపిల్ తీసుకుని పరీక్షిస్తే.. ఫెయిల్ అయింది. ఆ రిపోర్ట్ బయటకు రాకుండా తొక్కిపట్టారు. లడ్డు నాణ్యత తగ్గినట్లుగా ఉందని మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడే చర్చించాం. ఎంతోమంది సోషల్ మీడియాలో వీడియోలు పెట్టారు. అందుకే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సీఎం గారు శాంపిల్స్ తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సంస్థ ద్వారా టెస్ట్ చేయగా.. చాలా స్పష్టంగా జంతు కొవ్వు కలిసిందని, వెజిటబుల్ ఆయిల్ ఉందని తేలింది. మొన్నటి చార్జ్ షీట్ పేజ్ నెం.35లో చాలా స్పష్టంగా సీబీఐ చెప్పింది. వైసీపీ ఇప్పుడు కొత్త డ్రామా మొదలుపెట్టింది. టీటీడీ లడ్డును కూడా వదిలిపెట్టడం లేదు. దేవుడి లడ్డూపై వైసీపీ డ్రామా మొదలుపెట్టింది. అప్రమత్తంగా ఉండాలి. ఇంకా చాలా డ్రామాలు చేస్తారు. జగన్ అద్భుతమైన నటుడు. వారే తప్పుచేసి నెపం మనపై వేస్తారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వాస్తవాలు వివరించాలి. పార్టీలో యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్లు ఉండాలని పవనన్న చెబుతున్నారు. ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. ఇది ప్రజలకు వివరించాలి. మన మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తోంది. మనం అప్రమత్తంగా ఉండాలి. కూటమి పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయి. అందరూ సహకరించాలి. పార్టీలో యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. పార్టీ శిక్షణ తరగతుల్లో పాల్గొనాలి. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను తూచా తప్పకుండా అమలు చేయాలి. పార్టీ నేతలు అలక వీడాలి. అందరినీ సంప్రదించి నియోజకవర్గానికి సమర్థవంతమైన నాయకత్వం అందిస్తాం వ్యక్తులు శాశ్వతం కాదు.. పార్టీ శాశ్వతం. పార్టీ అనేక ఒక వ్యవస్థ. కలిసికట్టుగా ముందుకు వెళ్లాలి. మన నియోజకవర్గంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. నేనొక టీమ్ ను పంపిస్తాను. టీం ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి పార్టీ కమిటీలు ఏర్పాటుచేయాలి. పరిశీలకుడిని పంపుతాం. గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటుచేసి మనపని మనం చేయాలి. మీ అందరితో సంప్రదింపులు చేసిన తర్వాతనే పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. సమర్థవంతమైన నాయకత్వం నియోజకవర్గానికి అందిస్తాం. గ్రూప్ రాజకీయాలకు దూరంగా ఉండాలి. చంద్రబాబు గారి చుట్టూ ఈ రోజు కోటరీ లేదు. ఎవరు తప్పు చేసినా ఆయనకు వాట్సాప్ మెసేజ్ పెడతారు. అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. కమిటీలు పూర్తైన తర్వాత మై టీడీపీ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి. పనిచేసే వారిని ప్రోత్సహిస్తాం. ఎంపీలు కూడా పార్టీ కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించాం. కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ సానా సతీష్, నియోజకవర్గ పరిశీలకులు కె.సత్తిబాబు, కాకినాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, జోనల్ కోఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు తదితరులు పాల్గొన్నారు.




కాకినాడ జేఎన్ టీయూలో

## పీజీ బాయ్స్ హాస్టల్ ప్రారంభం

**ప్రారంభించిన మంత్రి లోకేష్**



కాకినాడ: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కాకినాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాకినాడ జేఎన్ టీయూలో నందనం పేరుతో నూతనంగా నిర్మించిన పీజీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా రాజమండ్రి విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గం ద్వారా కాకినాడ జేఎన్ టీయూకి చేరుకున్న మంత్రి లోకేష్ కు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, జేఎన్ టీయూ యాజమాన్యం ఘనస్వాగతం పలికారు. అనంతరం పీజీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. అంతకుముందు యూనివర్సిటీ ప్రాంగణంలో జేఎన్ టీయూ అనుబంధ కాలేజీల ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ ఫెయిర్ పేరుతో" ఏర్పాటుచేసిన 20 స్టాళ్లను మంత్రి సందర్శించారు. వివిధ కాలేజీల విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను పరిశీలించారు. ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన అరటి దవ్వ నుంచి ఆహార ఉత్పత్తుల తయారీ ఆవిష్కరణ, ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు రూపొందించిన 'ద మొబైల్ బనానా ఎక్స్ ట్రాక్టర్', రామకృష్ణంరాజు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు రూపొందించిన 'ఇంటిలిజెంట్ ఎనర్జీ మేనేజ్ మెంట్ సిస్టమ్' ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. కాకినాడ జేఎన్ టీయూలో రూ.10 కోట్ల రూసా, యూనివర్సిటీ నిధులు వెచ్చించి 53,606 చదరపు అడుగుల వైశాల్యంలో జీ+2 పీజీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించడం జరిగింది. దీంతో పాటు జేఎన్ టీయూ క్యాంపస్ లో రూ.21 కోట్ల యూనివర్సిటీ నిధులు వెచ్చించి సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైయిన్స్ సౌకర్యాన్ని కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఎన్ టీయూ-కాకినాడ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డా.చేకూరి శివరామకృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ డా.ఎన్ మోహన్ రావు, జేఎన్ టీయూకే ఇన్నోవేషన్ హెడ్ గోపాలకృష్ణతో పాటు ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, ఆదిరెడ్డి వాసు, జోనల్ కోఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు, కాకినాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నవ్యాంధ్ర నవ నిర్మాణ వారధులు..

**● లోకేష్ హలో - యువతలో సరికొత్త జోష్! ● ఓటమి అంటే పరాజయం కాదు.. అది నేర్చుకోవడంలో మొదటి అడుగు! ● జేఎన్టీయూ వేదికగా మంత్రి లోకేష్ స్ఫూర్తిమంతమైన పిలుపు ● విద్యార్థులు కేవలం పట్టభద్రులకే పరిమితం కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును మార్చే నాయకులుగా ఎదగాలి ● నూతన ఆలోచనలకు పదును పెట్టండి, ఆవిష్కరణలే సమాజ సమస్యలకు ఆయుధాలు కావాలి ● సంస్కారం, మానవ విలువలు కలిసిన సాంకేతికతే రాష్ట్రానికి శ్రీరామరక్ష జేఎన్టీయూకే మౌలిక వసతుల కోసం రూ. 31 కోట్ల కేటాయింపు**



ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు తరగతి గదుల నుండే ఆరంభం కావాలని, ఆ దిశగా యువత అడుగులు వేయాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. కేవలం పట్టా పుచ్చుకుని బయటకు రావడం కాకుండా, సమాజానికి దిశానిర్దేశం చేసే నాయకులుగా, నూతన ఆవిష్కర్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, ఒక దార్శనిక ప్రసంగంతో విద్యార్థులలో నూతన ఉత్తేజాన్ని నింపింది.

**యువ మేధస్సుకు పట్టాభిషేకం :** విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనను మంత్రి సందర్శించినప్పుడు, విద్యార్థుల సృజనాత్మకతకు ఆయన అబ్బురపడ్డారు. సుమారు 20 వినూత్న ప్రయోగాలను స్వయంగా పరిశీలించిన లోకేష్, ప్రతి విద్యార్థితోనూ ముచ్చటించి వారి ఆలోచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీ ఆలోచనలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకూడదు. అవి సామాన్యుడి కష్టాలను తీర్చే సాధనాలుగా మారాలి. స్వయం ఉపాధి, సొంత పరిశ్రమల స్థాపన వైపు దృష్టి సారిస్తే, మీరే పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకుంటారు అని పేర్కొన్నారు.మీరు కేవలం పట్టభద్రులకే పరిమితం కావద్దు.. రాష్ట్ర భవిష్యత్తును మార్చే నాయకులుగా ఎదగాలి

**వైఫల్యంపై సరికొత్త నిర్వచనం :** చాలామంది విద్యార్థులు విఫలమవుతామనే భయంతో కొత్త ప్రయోగాలు చేయడానికి వెనుకాడుతుంటారని, ఆ భయాన్ని వీడాలని మంత్రి సూచించారు. ఓటమి అనేది విజయానికి ముగింపు కాదు, అది గెలుపు వైపు వేసే మొదటి అడుగు. ప్రతి అపజయం ఒక కొత్త పాఠాన్ని నేర్పుతుంది. సృజనాత్మకతకు పదును పెట్టి, పట్టుదలతో ముందుకు సాగితే ప్రపంచం మీ పాదాక్రాంతమవుతుంది అని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

**సాంకేతికతకు తోడవ్వాల్సిన మానవత్వం :** ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధ ప్రాధాన్యతను గుర్తిస్తూనే, దాని పరిమితులను లోకేష్ స్పష్టం చేశారు. యంత్రాలు మనిషి పనిని సులభం చేయగలవు కానీ, మనిషిలోని ఆలోచనా శక్తిని, కుటుంబ వ్యవస్థను భర్తీ చేయలేదు. సంస్కారం, మానవ విలువలు కలిసిన సాంకేతికతే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, ప్రైవేట్ రంగాలు మరియు ప్రజలు కలిసికట్టుగా పనిచేసే చతుర్ముఖ భాగస్వామ్యమే రాష్ట్ర అభివృద్ధికి అసలైన మార్గమని ఆయన ఉద్ఘాటించారు.

**అభివృద్ధి పథంలో విద్యా ప్రాంగణం :** వసతులు మెరుగ్గా ఉంటేనే విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టగలరని నమ్మే లోకేష్, జేఎన్టీయూకే అభివృద్ధి కోసం రూ. 31 కోట్ల నిధులతో చేపట్టిన పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా రూ. 10 కోట్లతో నిర్మించిన నందనం వసతి గృహం 252 మంది విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వసతిని కల్పించనుంది. అలాగే రూ. 21 కోట్లతో చేపట్టిన సిమెంట్ రోడ్లు మరియు మురుగునీటి పారుదల వ్యవస్థలు ప్రాంగణ మౌలిక వసతులను ఆధునీకరించాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికలో మార్పులు తీసుకురావడం ద్వారా, ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచ వేదికపై పోటీ పడేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. హరిత హైడ్రోజన్, క్వాంటం కంప్యూటింగ్ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాలలో జేఎన్టీయూకే ఒక పరిశోధనా కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ తన పర్యటనను ముగించారు.ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, రెక్టార్ ప్రొఫెసర్ పి.సుబ్బారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్టి ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ఐక్యతే బలం

**● పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి ● ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి ● పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండండి ● కూటమి నాయకుల మధ్య సఖ్యత ముఖ్యం.. ● కలిసికట్టుగా పని చేయండి.. ఐక్యంగా ముందుకు సాగాలి ● 11వ బ్యాచ్ క్యాడర్ శిక్షణలో పాల్గొన్న నేతలకు మంత్రి లోకేష్**

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : వార్డు, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల కోసం నిర్వహించిన 11వ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన విస్తృతంగా మాట్లాడారు. పార్టీ క్యాడర్ సమన్వయంతో పాటు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని లోకేష్ స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా ఓర్పుతో, ఐక్యంగా దుష్ప్రచారాలను ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.

**అభివృద్ధిపైనే కాదు.. దుష్ప్రచారాల రాజకీయాన్ని కూడా ఎదుర్కోండి**

201419 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినా, వాటిని ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడంలో వెనుకబడ్డామని లోకేష్ గుర్తు చేశారు. అదే అప్పటి ఓటమికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి కార్యక్రమాన్ని ప్రజలకు నేరుగా వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. 2019లో అభివృద్ధిపై మాత్రమే దృష్టి పెట్టామని, కానీ ప్రతిపక్షం దుష్ప్రచార రాజకీయాలతో అధికారంలోకి వచ్చిందని లోకేష్ అన్నారు. ఇకపై అభివృద్ధితో పాటు, తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేసే శక్తులను ధీటుగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు.

**కూటమి నాయకుల మధ్య సఖ్యత ముఖ్యం**

కూటమి నాయకుల మధ్య సఖ్యత అత్యంత ముఖ్యమని లోకేష్ తెలిపారు. కూటమిని చీల్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నా, కూటమిని విడదీయడం ఎవరి తరం కాదని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో కూటమి నేతలందరినీ కలుపుకుని కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు అలగడం తగదని, ప్రతి ఒక్కరి కష్టాన్ని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని లోకేష్ భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబం అని, కుటుంబంలో సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు.

**తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టండి**

గత వైసీపీ ప్రభుత్వం కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిందని లోకేష్ తీవ్ర విమర్శలు చేశారు. చేయకూడని పాపాలు చేసి, ఇప్పుడు కూడా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వైసీపీ దుష్ప్రచారాలతో నిండిపోయిందని,తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టండంతో పాటు ఆ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తెలుగుదేశం కార్యకర్తలదేనని ఆయన స్పష్టం చేశారు.పార్టీ కోసం ప్రతి కార్యకర్త చేస్తున్న సేవలు, కష్టాలను మై టీడీపీ యాప్ ద్వారా పార్టీకి తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో మై టీడీపీ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ తరగతులు పార్టీని మరింత బలోపేతం చేయడంలో కీలకంగా మారతాయని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.



## మార్చి నాటికి గొల్లపూడి నుంచి చినకాకాని 6 లైన్ల హైవే పూర్తి

**కేంద్ర మంత్రి గడ్కరీ కీలక ప్రకటన**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విజయవాడ బైపాస్ రోడ్డుపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శుభవార్త చెప్పారు. గొల్లపూడి నుంచి చినకాకాని వరకు నిర్మిస్తున్న ఈ ఆరు వరుసల రోడ్డు మార్చి 31 నాటికి పూర్తవుతుందని తెలిపారు. రూ.1,194.59 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుతో విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే విజయవాడ పశ్చిమ బైపాస్‌లో ఒకవైపు వాహనాలను అనుమతిస్తున్నారు. సంక్రాంతి నుంచి రాకపోకలు ప్రారంభం అయ్యాయి. ఏపీకి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తీపికబురు చెప్పారు. గొల్లపూడి నుంచి చినకాకాని వరకు నిర్మిస్తున్న విజయవాడ బైపాస్ రోడ్డుపై కీలక ప్రకటన చేశారు. ఈ బైపాస్ రోడ్డు ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తవుతుందనిగడ్కరీ తెలిపారు. లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానం ఇచ్చారు. కృష్ణా నదిపై ప్రధాన వంతెనలతో కూడిన ఈ ఆరు వరుసల బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం 2019లో అనుమతులు జారీ అయ్యాయి. దీనికి మొత్తం రూ.1,194.59 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశాము. ఈ రోడ్డు కృష్ణా నదిపై పెద్ద వంతెనలతో నిర్మిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 30 నాటికి.. మొత్తం 17.6 కిలోమీటర్లలో 13.410 కిలోమీటర్ల నిర్మాణం పూర్తి. మిగిలిన 4.226 కిలోమీటర్ల పనులు ఈ ఏడాది మార్చి 31 లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము అన్నారు. ఈ బైపాస్ రోడ్డు విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని భావిస్తున్నారు.

సంక్రాంతి సమయంలో విజయవాడ పశ్చిమ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజా నుంచి కృష్ణా జిల్లా పెదఅవుటుపల్లి వరకు నిర్మించిన విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఒకవైపు రహదారిని అధికారులు ప్రారంభించారు. మార్చి నెలాఖరులోగా రహదారికి రెండో వైపు భాగాన్ని కూడా అందుబాటులోకి తీసుకొస్తామంటున్నారు. చెన్నై, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు కాజా టోల్‌గేట్ దాటిన తర్వాత వెస్ట్ బైపాస్‌లోకి వెళ్లి.. గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు ప్రయాణించి, అక్కడ ఏలూరు వైపు హైవేలోకి వెళ్లొచ్చు. ఈ వెస్ట్ బైపాస్‌లో.. గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు విజయవాడలోకి రావాల్సిన అవసరం లేకుండా నేరుగా ఏలూరు, హైదరాబాద్ వైపు వెళ్ళిపోవచ్చు. ఇప్పటికే గొల్లపూడి నుంచి చిన్నఅవుటపల్లి మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పుడు గుంటూరు జిల్లా కాజా వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా నేరుగా ఏలూరు వైపు వెళ్లొచ్చు. ఈ బైపాస్‌లో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు గొల్లపూడి దగ్గర విజయవాడ-హైదరాబాద్ హైవేలోకి కలిసిపోయి హైదరాబాద్ వైపు వెళ్ళిపోవచ్చు. దీనివల్ల గుంటూరు నుంచి ఏలూరు, హైదరాబాద్ వెళ్లే వాహనాలు విజయవాడ నగరంలోకి రాకుండానే తమ గమ్యస్థానాలకు వెళ్లొచ్చు. వెస్ట్ బైపాస్‌లో గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలకు వెస్ట్ బైపాస్‌లో కాజా వరకు వెళ్లేందుకు ప్రస్తుతం వీలుపడదు. రహదారి నిర్మాణ పనులు కొన్ని చోట్ల జరుగుతున్నాయని జాతీయ రహదారుల అధికారులు వివరించారు. ఈ వాహనాలు యథావిధిగా గొల్లపూడి వైపు నుంచి వస్తున్నప్పుడు, కృష్ణా నదిపై ఉన్న వంతెనను, సీడ్ యాక్సెస్ రోడ్డును దాటిన తర్వాత మంగళగిరి-మందడం రోడ్డులోకి ప్రవేశించి, సచివాలయం, హైకోర్టు వైపు వెళ్లవచ్చని అధికారులు పేర్కొన్నారు. పూర్తిస్థాయి రహదారి అందుబాటులోకి వచ్చిన తర్వాతే వెంకటపాలెం వద్ద టోల్‌ఫీజు వసూలు చేస్తారు.







## బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసా

**● ఏపీ జెన్ కోలో 27 మందికి కారుణ్య నియామకాలు ● ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రక్రియ ● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ఏపీ జెన్ కో పరిధిలో 27 మంది అర్హులకు కారుణ్య నియామక పత్రాలను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తోందని స్పష్టం చేశారు. మృత ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వారి విద్యార్హతలకు తగిన ఉద్యోగాలు కల్పించి, వారి సేవలను విద్యుత్ శాఖలో సమర్థవంతంగా వినియోగించుకుంటామని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కరికి కూడా ఇంజనీరింగ్ స్థాయి ఉద్యోగం ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన వారిని కూడా జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకే పరిమితం చేశారని ఆరోపించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో అర్హులైన అభ్యర్థులకు ఏజ్ రిలాక్సేషన్ కల్పించి, ఇప్పుడు జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాలు కూడా అందజేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు 600 మందికి పైగా కారుణ్య నియామకాలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి కారుణ్య నియామకాల ప్రక్రియను చేపడతామని కీలక ప్రకటన చేశారు. బాధిత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద, ఎమ్మెల్యేలు లు ముత్తుమల అశోక్ రెడ్డి, కందుల నారాయణరెడ్డి, డైరెక్టర్ పుల్లారెడ్డి జెన్కో సీఎండీ, ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# టీడీపీలో కార్యకర్తలే హైకమాండ్..

**● కార్యకర్తలు చెప్పింది పాటిస్తాం ● తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా ● తలదించుకునే స్థితి నుంచి ఏపీతో పోటీ పడలేమనే స్థితికి తీసుకువచ్చాం ● సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం ● తిరుమల లడ్డూపై వైసీపీ డ్రామా పట్ల అప్రమత్తంగా ఉండాలి ● ప్రజలకు వాస్తవాలు వివరించాలి అందరినీ సంప్రదించి నియోజకవర్గానికి సమర్థవంతమైన నాయకత్వం అందిస్తాం ● కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్**



కాకినాడ: టీడీపీలో కార్యకర్తలే హైకమాండ్.. కార్యకర్తలు చెప్పింది పాటిస్తాం. తలదించుకునే స్థితి నుంచి ఏపీతో పోటీ పడలేమనే స్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కాకినాడ అచ్చంపేట జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన వేదికలో కాకినాడ రూరల్ నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. కాకినాడ కాజ స్వీట్ గా ఉంటుంది. కాకినాడ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మాత్రం హాట్ గా ఉంటారు. నమ్ముకున్న వాటికోసం, పార్టీ కోసం కేసులకు కూడా వెరవని గొప్ప కార్యకర్తలు కాకినాడ పార్లమెంట్ లో ఉన్నారు. ఎన్నికష్టాలు వచ్చినా మీరు నాకు అండగా నిలిచారు. ఈ రోజు వేదికపై మేం కూర్చొన్నామంటే దాని వెనుక మీ త్యాగం, శ్రమ ఉంది. టీడీపీలో కార్యకర్తలే హైకమాండ్.. కార్యకర్తలు చెప్పింది పాటిస్తాం టీడీపీని భూస్థాపితం చేస్తామని ప్రగల్భాలు పలికిన వారు ఏమయ్యారో అందరికీ తెలుసు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. గత మహానాడులో ఆరు శాసనాల గురించి వివరించాం. పార్టీ అంటేనే ఒక కుటుంబం. మీకు కావాల్సిన నిర్ణయాలు తీసుకునేందుకే మేం ఇక్కడ ఉన్నాం. పసుపు జెండా చూస్తేనే ఒక ఎమోషన్. చంద్రబాబు గారిని 53 రోజుల పాటు జైల్లో అక్రమంగా నిర్బంధించారు. అప్పుడు మీరంతా మాకు అండగా నిలిచారు. మీ త్యాగాల వల్లే 94శాతం సీట్లు గెలుచుకోవడం జరిగింది. 175 స్థానాలకు గాను 164 స్థానాలు గెలిచాం. తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా పుంగనూరు నియోజకవర్గంలో ఆనాటి అధికార పార్టీ అరాచకాలపై మీసాలు మెలేసి తొడగొట్టిన అంజిరెడ్డి తాత నాకు స్ఫూర్తి. పల్నాడులో రక్తం కారుతున్నా బూత్ లో చివరి ఓటు పడేవరకు వీరోచితంగా పోరాడిన మంజుల నాకు స్ఫూర్తి. మెడపై కత్తిపెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని నినదించి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య మనకు స్ఫూర్తి. అందుకే తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నేను పట్టుబట్టా. చట్టం కూడా చేశాం. అసెంబ్లీలో పాస్ అయింది. కౌన్సిల్ కు వస్తే వైసీపీ నేతలు అడ్డుకున్నారు. ఎవరైతే టీడీపీ కార్యకర్తలను హతమారుస్తారో.. వారి కుటుంబం బలహీనపడకుండా వారిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తే మనవైపు చూసేందుకు భయపడతారు.తలదించుకునే స్థితి నుంచి ఏపీతో పోటీ పడలేమనే స్థితికి తీసుకువచ్చాం కూటమి ప్రభుత్వంలో ఎన్ని ఆర్థిక కష్టాలు ఉన్నా ఇచ్చిన హామీలను పద్ధతి ప్రకారం నెరవేరుస్తున్నాం. దేశంలో ఎవరూ ఇవ్వని విధంగా పెన్షన్లు చెల్లిస్తున్నాం. వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు చెల్లిస్తున్నాం. తల్లికివందనం కింద ఆర్థికసాయం అందిస్తున్నాం. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు అండగా నిలిచాం. స్త్రీశక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. 220కి పైగా కేసులు వేసినా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేసి 16వేల మందికి టీచర్ ఉద్యోగాలు కల్పించాం. 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. గతంలో ఏపీ నుంచి వచ్చామంటే తలదించుకునే పరిస్థితి. అలాంటిది ఈ రోజుకు ఎక్కడికి వెళ్లినా ఏపీతో పోటీపడలేమనే పరిస్థితి. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం ఇప్పటికే 23 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకోవడం జరిగింది. తద్వారా 16 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పక్కనే ఉన్న కోరమాండల్ ఫర్టిలైజర్స్ కూడా తమ విస్తరణ ప్రణాళిక ద్వారా 8వేల మందికి అదనంగా ఉద్యోగాలు కల్పించనుంది. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని-అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. తిరుమల లడ్డూపై వైసీపీ డ్రామా పట్ల అప్రమత్తంగా ఉండాలి ప్రతిపక్షం దుష్ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. కోడికత్తి డ్రామా, బాబాయి వివేకానంద హత్య, గులకరాయి ఘటనలు చూశాం. టీడీపీపై నెపం వేశారు. కల్తీ నెయ్యి, కల్తీ మద్యం.. వైసీపీ కల్తీ పార్టీ. దేవుడి ప్రసాదం గురించి మాట్లాడుతున్నారు. మనపై ఆరోపణలు చేస్తున్నారు. టీటీడీ లడ్డు విషయంలో రాజకీయం చేయదల్చుకోలేదు. మీకు వాస్తవాలు తెలియాలి. 2019 వరకు నాణ్యమైన నెయ్యి సరఫరాకు చర్యలు తీసుకున్నాం. టెస్టింగ్ చేసి పద్ధతి ప్రకారం వెళ్లాం. నాణ్యమైన నెయ్యి కోసం కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నుంచి ఎక్కువ శాతం నెయ్యి కొనుగోలు చేశాం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టెండర్ నిబంధనలు మార్చారు. ఏకంగా చిన్న చిన్న కంపెనీలకు ఆర్డర్లు ఇచ్చేందుకు నిబంధనలు మార్చారు. 2022లో శాంపిల్ తీసుకుని పరీక్షిస్తే.. ఫెయిల్ అయింది. ఆ రిపోర్ట్ బయటకు రాకుండా తొక్కిపట్టారు. లడ్డు నాణ్యత తగ్గినట్లుగా ఉందని మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడే చర్చించాం. ఎంతోమంది సోషల్ మీడియాలో వీడియోలు పెట్టారు. అందుకే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సీఎం గారు శాంపిల్స్ తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సంస్థ ద్వారా టెస్ట్ చేయగా.. చాలా స్పష్టంగా జంతు కొవ్వు కలిసిందని, వెజిటబుల్ ఆయిల్ ఉందని తేలింది. మొన్నటి చార్జ్ షీట్ పేజ్ నెం.35లో చాలా స్పష్టంగా సీబీఐ చెప్పింది. వైసీపీ ఇప్పుడు కొత్త డ్రామా మొదలుపెట్టింది.పార్టీ శిక్షణ తరగతుల్లో పాల్గొనాలి. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను తూచా తప్పకుండా అమలు చేయాలి. పార్టీ నేతలు అలక వీడాలి. అందరినీ సంప్రదించి నియోజకవర్గానికి సమర్థవంతమైన నాయకత్వం అందిస్తాం వ్యక్తులు శాశ్వతం కాదు.. పార్టీ శాశ్వతం. పార్టీ అనేక ఒక వ్యవస్థ. కలిసికట్టుగా ముందుకు వెళ్లాలి. పనిచేసే వారిని ప్రోత్సహిస్తాం. ఎంపీలు కూడా పార్టీ కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించాం. కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ సానా సతీష్, నియోజకవర్గ పరిశీలకులు కె.సత్తిబాబు, కాకినాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, జోనల్ కోఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

SRG HOUSING FINANCE LIMITED

SRG HOUSING FINANCE LIMITED
CIN: L65922RJ1999PLC015440
నమోదిత కార్యాలయం: 321, యస్‌యం లోధ కాంప్లెక్స్ , శాస్త్రి సర్కిల్ దగ్గర, ఉదయ్‌పూర్-313001, (రాజస్థాన్)
Phone: 0294-2412609 E-mail: info@srghousing.com Website: www.srghousing.com

రూల్ 8(1) ప్రకారం (స్థిరాస్తి కొరకు ప్రతీకాత్మక స్వాధీన ప్రకటన

దిగువ సంతకందారు SRG హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 321, SM లాధా కాంప్లెక్స్, శాస్త్రి సర్కిల్ దగ్గర, ఉదయపూర్ - 313001 (రాజస్థాన్) యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 కింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని సెక్షన్ 13 (12) మరియు రూల్ 3తో చదవబడిన అధికారాన్ని వినియోగించి, ప్రతి ఖాతాకు ఎదురుగా పేర్కొన్న తేదీలలో డిమాండ్ నోటీసులు జారీ చేశారు, సంబంధిత రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/తనఖాదారులు/హామీదార్లు నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరారు. రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, క్రింద సంతకం చేసిన వ్యక్తి క్రింద వివరించిన ఆస్తులను ప్రతి ఖాతాకు వ్యతిరేకంగా పేర్కొన్న తేదీలలో, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4) కింద అతనికి ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి సింబాలిక్ స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు మరియు సాధారణంగా ప్రజలకు నోటీసు జారీ చేయబడుతున్నది. రుణగ్రహీతలు/తనఖాదారులు/ముఖ్యంగా హామీదారులు మరియు సాధారణంగా ప్రజలు ఆస్తులతో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తులతో ఏదైనా లావాదేవీ SRG హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 321, SM లోధా కాంప్లెక్స్, శాస్త్రి సర్కిల్ దగ్గర, ఉదయపూర్ - 313001 (రాజస్థాన్) కు లోబడి ఉంటుంది, రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/తాకట్టుదారులు (హామీదారులు) తమకు అందుబాటులో ఉన్న సెక్యూర్డ్ ఆస్తులను విమోచించుకోవడానికి లభించే సమయానికి సంబంధించి, సదరు చట్టంలోని సెక్షన్ 13లోని ఉప-సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించగలరు.

| S. No. | Loan Account Number (Lan)/ రుణగ్రహీత / సహ-రుణగ్రహీత / హామీదారు | 1) డిమాండ్ నోటీసు తేది 2) ప్రతీకాత్మక స్వాధీనం తేది 3) డిమాండ్ నోటీసు ప్రకారం క్లెయిమ్ వ్యయం | స్థిరాస్తి యొక్క వివరణ (దానిపై నిర్మించిన మరియు నిర్మించబోయే భవనాలు మరియు నిర్మాణాలతో పాటు, భూమికి అమర్చిన ఫిక్చర్లు మరియు ఫిట్టింగ్‌లు మరియు భూమికి జోడించబడిన ఏదైనా వస్తువుతో సహా.) |
|---|---|---|---|
| 1. | HLR0000000022765 శ్రీ సింగారం అరుణ్ కుమార్ S/o శ్రీ సింగారం వెంకటేశ్వర్లు (రుణగ్రహీత) శ్రీమతి పల్లెపాడు లక్ష్మీదేవి D/o శ్రీ పల్లెపాడు రాముడు (సహ-రుణగ్రహీత-1) శ్రీ నంగన శివ రెడ్డి S/o శ్రీ నంగన లక్ష్మ రెడ్డి (సహ-రుణగ్రహీత-2) | 1. డిమాండ్ నోటీసు తేదీ:నవంబర్ 15, 2025 2. ప్రతీకాత్మక స్వాధీనం తేదీ - జనవరి 29, 2026 3. డిమాండ్ నోటీసు ప్రకారం క్లెయిమ్ మొత్తం నవంబర్ 07, 2025 నాటికి రూ. 42,49,150/- అక్షరాల నలభై రెండు లక్షల నలభై తొమ్మిది వేల నూట యాభై రూపాయలు మాత్రమే, దీనికి అదనంగా నవంబర్ 08, 2025 నుండి భవిష్యత్ వడ్డీ, ఇతర ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు మొదలైనవి వర్తిస్తాయి. | కింది వ్యక్తికి చెందిన మొత్తం భూమి వివరాలు: - శ్రీ సింగారం అరుణ్ కుమార్, తండ్రి పేరు శ్రీ సింగారం వెంకటేశ్వర్లు, చిరునామా: ప్లాట్ నెం. -139, కర్నూలు మండలం, పసుపుల గ్రామ పంచాయతీ, పసుపుల గ్రామం, బి.వి. సుబ్బారెడ్డి నగర్-2, సర్వే నెం.-333/A1A, 333ICA1A, 3331B, 333IA1C, 333IC1B1, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో, తహసీల్ - కర్నూలు, జిల్లా - కర్నూలు (ఆంధ్రప్రదేశ్). ఈ భూమి విస్తీర్ణం 121.17 చదరపు గజాలు. చుట్టూ ఉన్నవి: తూర్పు - ప్లాట్ నెం. 160, పడమర - 30 అడుగుల వెడల్పు గల రహదారి, ఉత్తరం - ప్లాట్ నెం. 140, దక్షిణం - ప్లాట్ నెం. 138. |

స్థలం:- ఆంధ్రప్రదేశ్
తేది:- 31-01-2026
సం/-
అధీకృత అధికారి SRG హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్




suryaeditpage@gmail.com

## అరుదైన ఖనిజ సంపదలో చైనాకి చెక్ పడబోతుందా?

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఫిబ్రవరి మొదటి వారంలో అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 4వ తేదీన వాషింగ్టన్ డి.సి.లో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆధ్వర్యంలో జరగనున్న కీలక ఖనిజాల మంత్రుల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొంటారు. సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు మరియు రక్షణ రంగాలకు అవసరమైన ఖనిజాల సరఫరాను భద్రపరచుకోవడంలో ఈ సమావేశం అత్యంత కీలకం కానుంది. అదే సమయంలో భారత్ మరియు అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు కూడా చాలా సానుకూల వాతావరణంలో వేగంగా జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. ఈ పర్యటనలో ప్రధానంగా చర్చకు రానున్న అంశం ప్రాక్సీ సిలికా. ఇది అమెరికా విదేశాంగ శాఖ చేపట్టిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమం, దీని ద్వారా కృత్రిమ మేధస్సు మరియు సరఫరా గొలుసు భద్రతను పటిష్టం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యంగా నమ్మకమైన భాగస్వామ్య దేశాల మధ్య ఒక కొత్త ఆర్థిక భద్రతా ఏకాభిప్రాయాన్ని సాధించడం దీని ఉద్దేశ్యం. 2025 డిసెంబర్లో జరిగిన మొదటి ప్రాక్సీ సిలికా సదస్సులో భారత్ భాగస్వామిగా లేనప్పటికీ, ఇటీవల అమెరికా రాయబారి సెర్జియో గోర్ చేసిన ప్రకటన ప్రకారం భారత్ త్వరలోనే ఈ కూటమిలోకి అధికారికంగా చేర్చుకోనున్నారు. ఇది అంతర్జాతీయ స్థాయిలో భారత్ యొక్క ప్రాధాన్యతను పెంచుతుంది.

ప్రాక్సీ సిలికా అనేది చైనా గుత్తాధిపత్యానికి ఒక బలమైన ప్రత్యామ్నాయంగా నిలవనుంది. ప్రస్తుతం సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన సిలికాన్ మరియు ఇతర కీలక ఖనిజాల సరఫరాలో చైనా ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థానంలో ఉంది. చైనా ఈ ఖనిజాల ఎగుమతులపై ఆంక్షలు విధిస్తున్న తరుణంలో, దానిపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి ప్రాక్సీ సిలికా ఒక వ్యూహాత్మక మార్గంగా ఉపయోగపడుతుంది. చైనా వెలుపల ఉన్న ఖనిజ వనరులను వెలికితీయడం మరియు మిత్ర దేశాల మధ్య సురక్షితమైన సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో చైనా ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. సెమీకండక్టర్ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలనే భారత్ ఆశయానికి ఈ ఒప్పందం గొప్ప ఊతానిస్తుంది. ప్రాక్సీ సిలికాలో చేరడం ద్వారా భారత్‌కు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడమే కాకుండా, చిప్ తయారీకి అవసరమైన ముడిసరుకు నిరంతరాయంగా లభిస్తుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాలే కాకుండా, దేశ భద్రతకు సంబంధించిన అంశం కూడా. చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను ఒక గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రక్రియలో జైశంకర్ అమెరికా పర్యటన మరియు ఈ కొత్త కూటమిలో చేరిక అత్యంత కీలకమైన మైలురాయిగా నిలవనున్నాయి.ప్రాక్సీ సిలికా కేవలం వ్యాపార ఒప్పందం మాత్రమే కాదు, ఇది ప్రపంచ దేశాల మధ్య మారుతున్న భౌగోళిక రాజకీయ వ్యూహాలకు ఒక నిదర్శనం. గత కొన్ని దశాబ్దాలుగా చైనా తన వద్ద ఉన్న సహజ వనరులను ఒక ఆయుధంగా వాడుకుంటూ ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తోంది. ఇప్పుడు అమెరికా మరియు భారత్ వంటి దేశాలు ప్రాక్సీ సిలికా ద్వారా ఆ ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలని చూస్తున్నాయి. ఈ కూటమిలో భారత్ చేరడం వల్ల, రాబోయే రోజుల్లో ఆఫ్రికా మరియు ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఉన్న ఖనిజ నిల్వలపై చైనాకున్న పట్టు తగ్గుతుంది. ఎందుకంటే, ఈ దేశాలు ఇప్పుడు భారత్ మరియు అమెరికా వంటి నమ్మకమైన భాగస్వాములతో ఒప్పందాలు చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నాయి.

సెమీకండక్టర్ల తయారీలో కీలకమైన సిలికాన్ సరఫరా వ్యవస్థను పునర్నిర్మించడం వల్ల భారత్‌లోని స్థానిక పరిశ్రమలకు భారీ లాభం చేకూరుతుంది. ముఖ్యంగా మేక్ ఇన్ ఇండియా పథకంలో భాగంగా భారత్ చేపట్టిన చిప్ తయారీ కేంద్రాలకు ముడిసరుకు కొరత తీరుతుంది. ప్రాక్సీ సిలికా ద్వారా లభించే సాంకేతిక సహకారం వల్ల భారత్ సొంతంగా క్లిష్టమైన చిప్ డిజైన్లను రూపొందించే స్థాయికి ఎదుగుతుంది. ఇది కేవలం స్మార్ట్‌ఫోన్లకే పరిమితం కాకుండా, రక్షణ రంగంలో వాడే క్షిపణులు, రాడార్లు మరియు అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన పరికరాల తయారీలో మన దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తుంది.అంతేకాకుండా, ఈ ఒప్పందం కృత్రిమ మేధస్సు రంగంలో భారత్ మరియు అమెరికా మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తుంది. డేటా సెక్యూరిటీ మరియు సైబర్ భద్రత విషయంలో చైనాకు ఉన్న అనుమానాస్పద చరిత్ర కారణంగా, ప్రపంచ దేశాలు ఇప్పుడు సురక్షితమైన ప్రత్యామ్నాయాలను వెతుకుతున్నాయి. ప్రాక్సీ సిలికా అటువంటి సురక్షితమైన వ్యవస్థను అందిస్తుంది. దీనివల్ల భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మరియు పరిశోధకులకు అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులలో పనిచేసే అవకాశం దక్కుతుంది. జైశంకర్ అమెరికా పర్యటన ద్వారా ఈ సహకారం ఒక చట్టబద్ధమైన రూపం దాల్చడం వల్ల, భవిష్యత్తులో చైనాకు ఎదురుదెబ్బ తగలడమే కాకుండా, ప్రపంచ సాంకేతిక రంగంలో భారత్ ఒక నిర్ణయాత్మక శక్తిగా అవతరించనుంది.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కీలక ఖనిజాల వెలికితీత మరియు వాటిని శుద్ధి చేసే ప్రక్రియలో చైనాకు తిరుగులేని ఆధిక్యం ఉంది. అయితే, ప్రాక్సీ సిలికా వంటి అంతర్జాతీయ కూటముల ద్వారా అనేక దేశాలు ఏకం కావడం చైనా ఆధిపత్యానికి గట్టి సవాలుగా మారుతోంది. ఈ వ్యూహంలో మొదటిది వనరుల వైవిధ్యీకరణ. ప్రపంచంలోని కీలక ఖనిజాలు కేవలం చైనాలో మాత్రమే లేవు. ఆస్ట్రేలియా, కాంగో, చిలీ మరియు కెనడా వంటి దేశాల్లో లిథియం, కోబాల్ట్, రాగి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో ఈ దేశాలు తమ ముడి ఖనిజాన్ని శుద్ధి చేయడం కోసం చైనాపై ఆధారపడేవి. ఇప్పుడు ప్రాక్సీ సిలికా దేశాలు ఈ ఖనిజాలను చైనాకు పంపకుండా, భారత్ లేదా ఇతర మిత్రదేశాలలోనే శుద్ధి చేసేలా అత్యాధునిక సాంకేతికతను మరియు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నాయి. ఇది చైనా యొక్క నియంత్రణను నేరుగా దెబ్బతీస్తుంది.

రెండవది, ఆర్థిక మరియు సాంకేతిక బలం. చైనాను ఒంటరిగా ఎదుర్కోవడం ఏ ఒక్క దేశానికి సాధ్యం కాకపోవచ్చు, కానీ అమెరికా వద్ద ఉన్న అధునాతన సాంకేతికత, భారత్ వద్ద ఉన్న అపారమైన మానవ వనరులు మరియు మార్కెట్, ఆస్ట్రేలియా వంటి దేశాల వద్ద ఉన్న సహజ వనరులు అన్నీ కలిస్తే ఒక శక్తివంతమైన ప్రత్యామ్నాయం తయారవుతుంది. ప్రాక్సీ సిలికా ద్వారా ఈ దేశాలు ఒకదానికొకటి సహకరించుకుంటూ, సరఫరా గొలుసులో ఎక్కడా చైనా ప్రమేయం లేకుండా చూసుకోగలవు. దీనివల్ల భవిష్యత్తులో చైనా ఒకవేళ ఎగుమతులను ఆపివేసినా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలకుండా ఈ కూటమి ఒక రక్షణ కవచంలా నిలుస్తుంది. నమ్మకమైన మిత్ర దేశాల మధ్యనే ఈ వ్యాపార లావాదేవీలు నిర్వహించడం వల్ల భద్రత కూడా పెరుగుతుంది.

మూడవది పర్యావరణ మరియు నైతిక ప్రమాణాలు. చైనాలో ఖనిజాల వెలికితీత ప్రక్రియలో పర్యావరణ నిబంధనలను తరచుగా ఉల్లంఘిస్తారనే విమర్శలు ఉన్నాయి. ప్రాక్సీ సిలికా కూటమి పర్యావరణహితమైన మరియు పారదర్శకమైన పద్ధతులను అవలంబిస్తామని ప్రకటించింది. నేటి కాలంలో అనేక అంతర్జాతీయ కంపెనీలు పర్యావరణ బాధ్యత కలిగిన సరఫరాదారులకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. కాబట్టి, భారత్ మరియు అమెరికా నేతృత్వంలోని ఈ వ్యవస్థ పారదర్శకతను పెంచడం ద్వారా ప్రపంచ స్థాయి కంపెనీలను తనవైపు తిప్పుకోగలదు. ఇది దీర్ఘకాలంలో చైనా యొక్క వ్యాపార సామ్రాజ్యాన్ని బలహీనపరుస్తుంది.

సెమీకండక్టర్ల తయారీలో సిలికాన్ కంటే మెరుగైన ప్రత్యామ్నాయాల గురించి పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రాక్సీ సిలికా ఇటువంటి కొత్త తరం సాంకేతికతలపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఒకవేళ సిలికాన్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర మూలకాలను వాడటం మొదలైతే, చైనా వద్ద ఉన్న సిలికాన్ నిల్వలకు విలువ తగ్గిపోతుంది. జైశంకర్ అమెరికా పర్యటన ద్వారా ఈ పరిశోధనల్లో భారత్ భాగస్వామి కావడం వల్ల, మనం కేవలం వనరుల కోసమే కాకుండా, కొత్త ఆవిష్కరణల ద్వారా కూడా చైనాను అధిగమించే అవకాశం ఉంది. ఈ దేశాలన్నీ సమన్వయంతో పనిచేస్తే, రాబోయే కాలంలో చైనాపై ఉన్న ఆధారపడటం దాదాపుగా తొలగిపోతుందని నిపుణులు భావిస్తున్నారు.

# నవ భారత ఆర్థిక చిత్రం!

■ దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్న ఆర్థిక సర్వే. ■ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నభారతావని ■ మరింత వృద్ధి వేగాన్ని కాపాడుకుంటుందని ఆర్థిక నిపుణులు ధీమా ■ చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్ చైనా ప్లస్ వన్ వ్యూహం ■ డాలర్‌పై అతిగా ఆధారపడటం వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు ఆర్ బిఐ యత్నాలు



**తేజస్విని**
**హైదరాబాద్**

భారతదేశ ఆర్థిక గమనాన్ని, గత ఏడాది సాధించిన పురోగతిని మరియు భవిష్యత్తు సవాళ్లను విశ్లేషించే అత్యంత ప్రామాణికమైన పత్రమే ఆర్థిక సర్వే. ప్రతి సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒక రోజు ముందు పార్లమెంటులో సమర్పించే ఈ నివేదిక, దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మధ్య కూడా భారత్ ఏ విధంగా స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది, తయారీ మరియు సేవా రంగాల్లో సాధించిన మైలురాళ్లు ఏమిటి, మరియు సామాన్యుడి ఆర్థిక స్థితిగతుల్లో వచ్చిన మార్పులను ఈ సర్వే సమగ్రంగా స్పష్టం చేసింది.

**జీడీపి:** భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటు 7.4% గా నమోదైంది. ఈ వృద్ధి ప్రధానంగా దేశీయ వినియోగం, పారిశ్రామిక ఉత్పత్తిలో పెరుగుదల మరియు సేవా రంగం యొక్క పటిష్టమైన పనితీరు వల్ల సాధ్యమైంది.వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) లో భారత జీడీపీ వృద్ధి 6.8% నుండి 7.2% మధ్య ఉంటుందని సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల హెచ్చుతగ్గులు మరియు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారతదేశం తన వృద్ధి వేగాన్ని కాపాడుకుంటుందని ఆర్థిక నిపుణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.దేశ ఆర్థిక సామర్థ్యం గతంలో ఉన్న 6.5% స్థాయి నుండి ఇప్పుడు 7% కి పెరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వ మౌలిక సదుపాయాల కల్పన మరియు డిజిటల్ విప్లవం వల్ల ఉత్పాదకత పెరగడం, దేశ దీర్ఘకాలిక వృద్ధికి బలమైన పునాది వేసింది.

**విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)** భారతదేశం ప్రస్తుతం విదేశీ పెట్టుబడిదారులకు అత్యంత సురక్షితమైన మరియు లాభదాయకమైన గమ్యస్థానంగా మారింది. ముఖ్యంగా తయారీ రంగం, సేవా రంగాల్లోకి ఎఫ్ డి ఐ ప్రవాహం భారీగా పెరిగింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించాయి.ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసు మార్పుల నేపథ్యంలో, అనేక బహుళజాతి కంపెనీలు చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను ఎంచుకుంటున్నాయి. దీనినే చైనా ప్లస్ వన్ వ్యూహంగా పిలుస్తారు. ఈ క్రమంలో భారత్ తన లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంచుకుంటూ, ప్రపంచ ఉత్పాదక కేంద్రంగా అవతరిస్తోంది. వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0 ను అమలు చేస్తోంది. నిబంధనలను సరళీకరించడం, సింగిల్ విండో క్లియరెన్స్ విధానం మరియు పాత చట్టాల తొలగింపు ద్వారా విదేశీ సంస్థలు భారత్‌లో సులభంగా పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తున్నారు.

**విదేశీ మారక నిల్వలు (ఎఫ్ ఎస్ ఐ):** భారతదేశ విదేశీ మారక నిల్వలు ఎన్నడూ లేనంత పటిష్టంగా ఉండటం దేశ ఆర్థిక భద్రతకు చిహ్నం. ఎగుమతుల పెరుగుదల మరియు విదేశీ పెట్టుబడుల ప్రవాహం వల్ల మన ఫారెక్స్ నిల్వలు పెరిగాయి. ఇది రూపాయి విలువను స్థిరీకరించడానికి మరియు దిగుమతి బిల్లుల చెల్లింపులకు భరోసానిస్తుంది.ఈసారి సర్వేలో బంగారం నిల్వలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆర్‌బీఐ వద్ద ఉన్న బంగారం నిల్వల విలువ 2025 మార్చిలో 78.2 బిలియన్ డాలర్లు ఉండగా, 2026 జనవరి నాటికి అది 117.5 బిలియన్ డాలర్లకు పెరిగింది. కేవలం ధరల పెరుగుదల వల్లనే కాకుండా, ఆర్‌బీఐ చురుగ్గా బంగారాన్ని కొనుగోలు చేయడం వల్ల ఈ పెరుగుదల కనిపించింది.డాలర్‌పై అతిగా ఆధారపడటం వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు ఆర్‌బీఐ తన నిల్వలను వైవిధ్యపరుస్తోంది. . ప్రస్తుతం మన వద్ద సుమారు 880 టన్నుల బంగారం ఉంది, ఇందులో సగానికి పైగా నిల్వ లను దేశీయంగానే భద్రపరచడం గమనార్హం. ఇది ప్రపంచ ఆర్థిక సంక్షోభాల సమయంలో భారత ఆర్థిక వ్యవస్థను కాపాడుతుంది.

**డీమ్యాట్ ఖాతాలు -స్టాక్ మార్కెట్:** భారత స్టాక్ మార్కెట్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన వృద్ధిని కనబరుస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం భారీగా పెరిగింది.సామాన్య ప్రజలు కేవలం పొదుపు ఖాతాలకే పరిమితం కాకుండా, తమ పెట్టుబడులను షేర్ మార్కెట్ మరియు మ్యూచువల్ ఫండ్ల వైపు మళ్లిస్తున్నారు. గడిచిన సంవత్సరంలో డీమ్యాట్ ఖాతాల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. డిజిటల్ టెక్నాలజీ అందుబాటు లోకి రావడం, మొబైల్ యాప్‌ల ద్వారా పెట్టుబడులు సులభతరం కావడం వల్ల యువత మరియు గ్రామీణ ప్రాంతాల వారు కూడా స్టాక్ మార్కెట్‌లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇది దేశీయంగా మూలధన కల్పనకు దోహదపడుతోంది. భారతదేశ మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రస్తుతం జీడీపీలో 136% వద్ద ఉంది. ఇది చైనా (65%), బ్రెజిల్ (37%) వంటి దేశాల కంటే చాలా ఎక్కువ. భారత కంపెనీ లపై అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. అయితే, మార్కెట్ విలువ పెరుగుతున్న కొద్దీ ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాలని కూడా సర్వే హెచ్చరించింది.

**ద్రవ్యోల్బణం:** ద్రవ్యోల్బణ నియంత్రణ అనేది ప్రభుత్వానికి మరియు సామాన్యులకు అత్యంత కీలకమైన అంశం. గత ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో వస్తువుల ధరలు పెరిగినప్పటికీ, భారత ప్రభుత్వం మరియు ఆర్‌బీఐ తీసుకున్న చర్యల వల్ల దేశీయంగా ధరలు నియంత్రణలోనే ఉన్నాయి. ముఖ్యంగా రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది.
ఆహార ద్రవ్యోల్బణం నియంత్రణపై సర్వే సానుకూల అంచనాలను ఇచ్చింది. సరఫరా గొలుసులో లోపాలను సరిదిద్దడం, నిత్యావసర వస్తువుల బఫర్ స్టాక్‌ను నిర్వహించడం వల్ల ధరలు స్థిరంగా ఉంటున్నాయి. 2026 నాటికి ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశించిన 4% లక్ష్యానికి చేరువయ్యే అవకాశం ఉందని సర్వే పేర్కొంది.ద్రవ్యోల్బణం తగ్గడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఇది అటు పరిశ్రమలకు, ఇటు వినియోగదారులకు మేలు చేస్తుంది. వడ్డీ రేట్ల తగ్గుదలకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుంది, తద్వారా గృహ రుణాలు మరియు వ్యక్తిగత రుణాలు చౌకగా లభించే అవకాశం ఉంటుంది.

**వ్యవసాయం -పరిశ్రమలు:** భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం ఇప్పటికీ వెన్నెముకగా నిలుస్తోంది. జీడీపీలో దీని వాటా సుమారు 16% గా ఉంది. అయితే,ఇప్పుడు రైతులు కేవలం వరి, గోధుమలకేపరిమితం కాకుండా ఉద్యానవన పంటలు, పశుసంపద మరియు మత్స్య రంగాలు వంటి వాట పై దృష్టి సారిస్తున్నారు, ఇవి అధిక వృద్ధిని నమోదు చేస్తున్నాయి.పారిశ్రామిక రంగంలో తయారీ విభాగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ రంగం ఊహించని రీతిలో అభివృద్ధి చెందింది. భారత్ ఇప్పుడు స్మార్ట్ ఫోన్ తయారీలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా ఎదిగింది. దేశంలో వాడే 99% స్మార్ట్‌ఫోన్లు ఇప్పుడు మేడ్ ఇన్ ఇండియావే కావడం గర్వకారణం. పరిశ్రమల వృద్ధి కోసం మౌలిక సదుపాయాల కల్పన మరియు రాయితీలు కల్పిస్తున్నారు. ఎంఎస్‌ఎంఈ రంగం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల భారీగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఎగుమతులలో కూడా వృద్ధి కనిపిస్తోంది.

**మౌలిక సదుపాయాలు -డిజిటల్ కనెక్టివిటీ:** దేశాభివృద్ధికి మౌలిక సదుపాయాలు చాలా ముఖ్యం. ప్రస్తుతం భారతదేశం రహదారులు, రైల్వేలు మరియు విమానాశ్రయాల నిర్మాణంలో వేగంగా దూసుకుపోతోంది. ముఖ్యంగా పట్టణ రవాణాలో మెట్రో రైలు ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. 24 నగరాల్లో 1,036 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లు అందుబాటులోకి వచ్చాయి.డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విషయంలో భారత్ ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలిచింది. యూపీఐ ద్వారా జరుగుతున్న డిజిటల్ చెల్లింపులు సామాన్యుడి జీవితాన్ని సులభతరం చేశాయి. దీనివల్ల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెరగడమే కాకుండా, బ్యాంకింగ్ సేవలు మారుమూల ప్రాంతాలకు కూడా చేరాయి.మొత్తం మీద, మౌలిక సదుపాయాల కల్పన మరియు డిజిటల్ విప్లవం కలిసి ఆర్థిక సమ్మిళితత్వాన్ని వేగవంతం చేశాయి. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతున్నాయి. ఇది దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా చేస్తోంది.

**సేవా రంగం:** భారత ఆర్థిక వ్యవస్థలో సేవా రంగం అత్యంత కీలకమైన భాగం. జీడీపీలో సగానికి పైగా వాటా ఈ రంగానిదే. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ సేవలతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , ఫైనాన్షియల్ సర్వీసెస్ మరియు టూరిజం రంగాలు అద్భుతమైన వృద్ధిని కనబరుస్తున్నాయి.భారతదేశం ఇప్పుడు ప్రపంచానికి బ్యాక్ ఆఫీస్‌గానే కాకుండా, పరిశోధన మరియు ఆవిష్కరణల కేంద్రంగా మారుతోంది. అనేక అంతర్జాతీయ సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలను, పరిశోధనా కేంద్రాలను భారత్‌లో ఏర్పాటు చేస్తున్నాయి. దీనివల్ల నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. డిజిటలైజేషన్ పెరగడం వల్ల ఇ-కామర్స్, ఎడ్-టెక్ మరియు ఫిన్-టెక్ సేవలు మారుమూల గ్రామాలకు కూడా విస్తరించాయి. స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో భారత్ ప్రపంచంలోనే మూడవ స్థానంలో ఉండటం సేవా రంగం యొక్క పటిష్టతకు నిదర్శనం. భవిష్యత్తులో ఈ రంగం ఎగుమతుల ద్వారా దేశానికి మరిన్ని విదేశీ మారక ద్రవ్య నిల్వలను తెచ్చిపెట్టనుంది.

**ఉపాధి-నైపుణ్యాభివృద్ధి :** ఉపాధికల్పన అనేది ఈ ఏడాది ఆర్థిక సర్వేలో ప్రధాన చర్చనీయాంశంగా నిలిచింది. దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏటా కోటికి పైగా ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉందని సర్వే పేర్కొంది. దీని కోసం ప్రభుత్వం ప్రైవేట్ రంగంతో కలిసి పనిచేయాలని సూచించింది.కేవలం డిగ్రీలు ఉండటమే కాకుండా, పరిశ్రమల కు అవసరమైన సాంకేతిక నైపుణ్యం లేకపోవడం పెద్ద సవాలుగా మారింది. దీనిని అధిగమించడానికి స్కిల్ ఇండియా మిషన్ ద్వారా లక్షలాది మంది యువతకు ఏఐ,, డేటా సైన్స్ మరియు రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాలలో శిక్షణ ఇస్తున్నారు. గిగ్ ఎకానమీ,ఫ్రీలాన్సింగ్ సంస్కృతి కూడా దేశంలో వేగంగా పెరుగుతోంది. డెలివరీ భాగస్వాముల నుండి సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్స్ వరకు కోట్లాది మంది ఈ పద్ధతిలో ఉపాధి పొందుతున్నారు. వీరి సామాజిక భద్రత కోసం కొత్త చట్టాలను రూపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

**ఇంధన రంగం -హరిత ఇంధనం :**పర్యావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని, భారతదేశం శిలాజఇంధనాల (బొగ్గు, పెట్రోల్)పై ఆధారపడటాన్ని తగ్గించుకుంటోంది. 2070 నాటికి నెట్ జీరో లక్ష్యాన్ని చేరుకోవడానికి నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కీలకపాత్ర పోషిస్తోంది. సౌర మరియు పవన శక్తి ఉత్ప త్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోంది. ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి ఫేమ్ వంటి పథకాలు మరియు రాయితీలు కల్పిస్తున్నారు. దీనివల్లకాలుష్యం తగ్గడమే కాకుండా, ముడి చమురు దిగు మతులకోసం మనం ఖర్చు చేసే విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. దేశవ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు వేగవంతమైంది.అయితే, పారిశ్రామిక వృద్ధికి విద్యుత్ డిమాండ్ నిరంతరం పెరుగుతూనే ఉంది. దీనిని భర్తీ చేయడానికి పునరుత్పాదక ఇంధన వనరులతో పాటు అణుశక్తి వాటాను కూడా పెంచాలని సర్వే ప్రతిపాదించింది. ఇంధన భద్రత సాధించడం ద్వారానే దేశం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

**ఎగుమతులు -దిగుమతులు :** తన ఎగుమతుల పరిధిని విస్తృతం చేస్తోంది. సాంప్ర దాయవస్తువులతో పాటు ఇప్పుడు రక్షణ పరికరాలు , మం దులు ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు గణనీయంగా పెరిగా యి. మేక్ ఇన్ ఇండియా ప్రభావం మన విదేశీ వాణిజ్యంపై స్పష్టంగా కని పిస్తోంది. దిగుమతుల విషయంలో ముడి చమురు మరియు బంగారు దిగుమతులు ఇప్పటికీ భారత్‌కు పెద్ద భారంగానే ఉన్నాయి. వీటిని తగ్గించడానికి స్వదేశీ ఉత్పత్తిని పెంచడం మరియు ఇంధన ప్రత్యామ్నాయాలను వెతకడంపై సర్వే దృష్టి పెట్టింది. వాణిజ్య లోటును తగ్గించడం ద్వారా రూపా యి విలువను కాపాడుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత ఆర్థిక సర్వే 2025-26 ఒక ఆశాజనకమైన చిత్రాన్ని ఆవిష్కరించింది. కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, బలమైన బ్యాంకింగ్ వ్యవస్థ, పెరు గుతున్న డిజిటల్ మౌలిక సదుపాయాలు మరియు యువశక్తి భారత్‌ను వచ్చే దశాబ్ద కాలంలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలప నున్నాయి. భారత ఆర్థిక సర్వే 2025-26 విశ్లేషణను బట్టి చూస్తే, భారతదేశం కేవలంవృద్ధి చెందుతున్న దేశంగానే కాకుండా, ప్రపం చ ఆర్థిక వ్యవస్థకు ఒక సుస్థిరమైన ఇంజిన్‌గా అవతరిం చిందని స్పష్టమ వుతోంది. అంతర్జాతీయంగా సరఫరా గొలుసులో వస్తున్న మార్పులు, డిజిటల్ విప్లవం మరియు పటిష్టమైన బ్యాంకిం గ్ వ్యవస్థ మన దేశానికి గొప్ప అవకాశా లను కల్పిస్తున్నాయి. జీడీపీ వృద్ధింటు స్థిరంగా ఉండటం, ద్రవ్యోల్బణం నియం త్రణలోకి రావడం వంటి అంశా లు దేశ ఆర్థిక పునాదులు బలంగా ఉన్నాయని నిరూపిస్తున్నాయి.అయి-తే, ఈ వృద్ధి ఫలాలు సూజంలోని అన్ని వర్గాలకు అందాలంటే కొన్ని కీలక సవాళ్లను అధిగమించాల్సి ఉంది.

ముఖ్యంగా పెరు గుతున్న జనాభాకు తగి నట్లుగా ఉపాధి అవకా శాలను సృష్టించడం, మారు తున్న సాంకేతికకు అనుగు ణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం మరి యు వ్యవసాయరంగాన్ని మరింత ఆధునీకరిం చడం వంటివి రాబోయే కాలం లో అత్యంత ప్రాధాన్యత సంత రించుకున్నాయి. అలాగే, వాతావరణ మార్పుల ముప్పును ఎదుర్కొంటూ హరిత ఇంధనం వైపు అడు గులు వేయడం భవిష్యత్తు తరాలకు అత్యవస రం.మొత్తం మీద చెప్పాలంటే, 2047 నాటికి వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన భారత్) లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ ఆర్థిక సర్వే ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను అందించింది. ప్రభుత్వ సంస్కరణలు, ప్రైవేట్ రంగ పెట్టుబడులు మరియు పౌరుల భాగస్వామ్యం సమన్వయంతో సాగితే, భారతప్రపంచ ఆర్థిక వేదికపై అగ్రగామిగా నిలవడం ఖాయం. స్థిరత్వం, సమ్మి ళిత వృద్ధి మరియు ఆవిష్కరణలే రాబోయే దశాబ్దంలో భారత ఆర్థిక ప్రయాణానికి దిక్సూచీలు.

# అన్ని రంగాలకు వర్క్ లైఫ్ బ్యాలెన్స్ వర్తింపజేయాలి

**సి.హెచ్.ప్రతాప్**
**98660 71785**

భారతదేశంలో పని ప్రదేశాలలో ఉద్యోగుల క్షేమం, వారి మానసిక ఆరోగ్యంపై జరుగుతున్న ప్రస్తుత చర్చలు ఒకే వర్గానికి పరిమితం కావడం అత్యంత ఆందోళన కలిగించే విషయం. సాధారణంగా వర్క్-లైఫ్ బ్యాలెన్స్ లేదా బర్నౌట్ వంటి పదాలు వినిపించగానే మన కళ్లముందు కేవలం కార్పొరేట్ కార్యాలయాలు, ఏసీ గదుల్లో కూర్చుని పని చేసే సాఫ్ట్‌వేర్ నిపుణులు మాత్రమే మెదులుతారు. కానీ దేశంలోని మొత్తం శ్రామిక శక్తిలో 80 శాతానికి పైగా ఉన్న అసంఘటిత రంగ కార్మికుల గోడు ఈ చర్చల్లో ఎక్కడా వినిపించడం లేదు. వారి గొంతుకలు వ్యవస్థాగత నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. అసంఘటిత రంగం అంటే కేవలం రోడ్లపై పని చేసే వారు మాత్రమే కాదు, మన నిత్యావసరాలను తీర్చే డెలివరీ బాయ్స్, భవన నిర్మాణకార్మికులు, చిన్నతరహా పరిశ్రమల్లో ప్రాణాలకు తెగించి పని చేసే లక్షలాది మంది శ్రామికులు ఇందులో భాగం. వీరిని విస్మరించి చేసే ఏ చర్చ అయినా సమగ్రమైనది అనిపించుకోదు.

ఇటీవల పని గంటలపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున మేధోమథనం జరిగింది. కార్పొరేట్ రంగంలోని విపరీతమైన ఒత్తిడి, పై అధికారుల వేధింపులు, అధిక పని గంటల వల్ల సంభవిస్తున్న విషాదకర మరణాల గురించి అందరూ స్పందించారు. అయితే ఈ చర్చలన్నీ కేవలం నగరాలకే పరిమితమైన ఒక చిన్న వర్గం చుట్టూనే తిరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఎండనక, వాననక శ్రమించే కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు ఈ సంభాషణల్లో భాగం కాకపోవడం మన ఆలోచనా విధానంలోని లోపాన్ని సూచిస్తుంది. అసంఘటిత రంగ కార్మికులకు కనీస పని ఒప్పందాలు ఉండవు, వేతనంతో కూడిన సెలవులు అనే మాటే వారికి తెలియదు. వారికి ఎటువంటి సామాజిక భద్రత కల్పించకపోవడం వల్ల వారు నిరంతరం అభద్రతతో కూడిన జీవితాలను గడుపుతున్నారు. ప్రమాదకరమైన వాతావరణంలో, గంటల తరబడి విశ్రాంతి లేకుండా శ్రమించడం వారికి ఒక అనివార్యమైన నిత్యకృత్యంగా మారింది.

మన సమాజంలో సమాచారాన్ని విశ్లేషించే తీరులో ఫ్రేమింగ్ ఎఫెక్ట్ అనే మానసిక పక్షపాతం స్పష్టంగా కనిపిస్తుంది. అంటే ఒక సమస్యను మనం ఏ కోణంలో చూపిస్తున్నాం అనే దానిపైనే ప్రజల స్పందన ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం పని ప్రదేశాల క్షేమం అనే అంశాన్ని కేవలం సాఫ్ట్‌వేర్ లేదా కార్పొరేట్ రంగం కోణంలోనే చిత్రీకరించడం వల్ల సామాన్యుల సమస్యలు కనుమరుగైపోతున్నాయి. హజిల్ కల్చర్ అనే పదం కార్పొరేట్ లోకంలో ఒక ఫ్యాషన్‌గా చలామణిలోకి రాకముందే, అసంఘటిత రంగ కార్మికులు ఆ జీవనశైలిలోనే దశాబ్దాలుగా బతుకుతున్నారు. ఒక డెలివరీ ఏజెంట్ పది నిమిషాల్లో ఆహారాన్ని చేరవేయాలనే ఒత్తిడిలో తన ప్రాణాలను పణంగా పెడుతున్నాడు. ఐదు నక్షత్రాల రేటింగ్ కోసం వారు రోబోల్లా మారుతున్న తీరును, వారి మానవీయ కోణాన్ని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వినియోగదారుల సౌకర్యం కోసం కార్మికుల గౌరవాన్ని, ఆరోగ్యాన్ని పణంగా పెట్టే ఈ నమూనాను మనం ప్రశ్నించాలి. ప్రభుత్వ గణాంకాలు కూడా అసంఘటిత రంగం పట్ల ఉన్న వివక్షను ప్రతిబింబిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం నమోదైన ఫ్యాక్టరీలలో జరిగే ప్రమాదాలు, మరణాల వివరాలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. కానీ లక్షలాది మంది అనధికారిక కార్మికులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, పనిలో సంభవిస్తున్న ప్రమాదాల వివరాలు బహిరంగంగా ఎక్కడా నమోదు కావడం లేదు. ఇది వారిని మరింత అంధకారంలోకి నెట్టివేస్తోంది. సరైన సమాచారం లేకపోవడం వల్ల వారికి అందాల్సిన పరిహారం లేదా వైద్య సదుపాయాలు అందడం లేదు. ఈ వ్యత్యాసాన్ని తొలగించాలంటే పని ప్రదేశాల క్షేమం అనే అంశాన్ని కేవలం సామాజిక మాధ్యమాల చర్చగా పరిగణించకూడదు. దీనిని ఒక క్షేత్రస్థాయి విధానపరమైన మార్పుగా చూడాలి. అసంఘటిత రంగ కార్మికుల పని పరిస్థితులపై లోతైన అధ్యయనాలు జరగాలి. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వం తక్షణమే కొన్ని కీలక చర్యలు చేపట్టవలసి ఉంది. అసంఘటిత రంగ కార్మికులందరినీ ఒకే గొడుగు కిందికి తెచ్చేలా సమగ్రమైన జాతీయ డేటాబేస్‌ను పటిష్టం చేయాలి. కేవలం నమోదు చేయడమే కాకుండా, ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా, ఉచిత ఆరోగ్య పరీక్షలు, కనీస వేతనం కచ్చితంగా అందేలా చట్టపరమైన నిబంధనలు కఠినతరం చేయాలి. ముఖ్యంగా గిగ్ ఎకానమీలో పనిచేస్తున్న డెలివరీ, ఇతర సర్వీసు కార్మికుల పని గంటలను నియంత్రించేందుకు ప్రత్యేక నియమావళిని రూపొందించాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రాయితీలు కల్పిస్తూనే, అక్కడ పని చేసే వారికి రక్షణ కవచంలాంటి సామాజిక భద్రతా పథకాలను అమలు చేయాలి. ప్రభుత్వం ప్రతి జిల్లాలో కార్మిక సంక్షేమ కేంద్రాలను ఏర్పాటు చేసి, వారి మానసిక ఆరోగ్యానికి భరోసా ఇచ్చే కౌన్సెలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తేవాలి.పని గంటల నియంత్రణ, తక్కువ ధరకే నాణ్యమైన వైద్య సదుపాయాలు, మానసిక ఆరోగ్య రక్షణ వంటివి వారికి కూడా వర్తించేలా జాతీయ విధానాలను సవరించాలి. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా వారు కూడా తమ సమస్యలను గళమెత్తేలా ప్రోత్సహించాలి. స్థానిక భాషలలో ఈ చర్చలను విస్తృతం చేయడం వల్ల సామాన్యులకు కూడా అవగాహన పెరుగుతుంది. అభివృద్ధి చెందిన సమాజంలో శ్రమ గౌరవం అనేది అందరికీ సమానంగా ఉండాలి. కేవలం కార్పొరేట్ సంస్కృతిని సంస్కరిస్తే సరిపోదు, సమాజంలోని నిమ్న ఆర్థిక వర్గాల శ్రామికుల గొంతుకలకు కూడా సరైన వేదిక కల్పించాలి. ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు, సామాజిక కార్యకర్తలు సమన్వయంతో పనిచేసినప్పుడే అన్ని వర్గాల ఉద్యోగుల క్షేమం సాధ్యమవుతుంది. సామాజిక హోదాతో సంబంధం లేకుండా ప్రతి కార్మికుడికి సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించడం ఆధునిక భారతదేశం ముందున్న అతిపెద్ద సవాలు. అట్టడుగున ఉన్న శ్రామికుడి గొంతు వినిపించినప్పుడే మన ప్రజాస్వామ్య చర్చలకు పరిపూర్ణత లభిస్తుంది.



## విద్యా మాఫియాకు సర్కారు ఊడిగం..!

తెలంగాణ విద్యా రంగం నేడు కార్పొరేట్ విద్యా రాబందుల కబందహస్తాల్లో చిక్కుకొని విలవిలలాడుతోంది. విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే, పాలకులు మాత్రం కేవలం ప్రసంగాలకే పరిమితమవుతున్నారు. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ వైకల్యాన్ని బట్టబయలు చేయడమే కాకుండా, ప్రభుత్వ అసమర్థతను కళ్లకు కట్టాయి. నాకు విద్యాశాఖ మంత్రిగా ఛాన్స్ వస్తే కార్పొరేట్ స్కూల్స్ అన్నింటినీ మూసేయిస్తా అని ఆయన అనడం వినడానికి బాగానే ఉన్నా, అది ముమ్మాటికీ బాధ్యతల నుండి పలాయనం చిత్తగించడమే. ఒక కేబినెట్ మంత్రిగా ఉండి, వ్యవస్థలో దారుణాలు జరుగుతున్నాయని తెలిసి కూడా శాఖ మారితేనే మారుస్తా అనడం ప్రజలను వెర్రి వెంగళప్పలను చేయడమే అవుతుంది. ప్రభుత్వం అనేది ఒక సమిష్టి బాధ్యత. సమస్య తెలిసినప్పుడు క్యాబినెట్ లో గట్టిగా నిలదీయలేని మంత్రి, కేవలం పబ్లిసిటీ కోసం ఇలాంటి ప్రకటనలు చేయడం ఆయన రాజకీయ అసహాయతను లేదా పదవీ కాంక్షను సూచిస్తోంది.రాష్ట్రంలో నారాయణ, శ్రీచైతన్య వంటి విద్యా వ్యాపార సామ్రాజ్యాలు విద్యార్థుల రక్తాన్ని ఫీజుల రూపంలో జుర్రుకుంటున్నాయన్నది బహిరంగ రహస్యం. మంత్రి అన్నట్లుగా బట్టీ పద్ధతి అనేది విద్యార్థుల మేధస్సును గొంతు నులిమి చంపేసే ఒక నెమ్మదైన విషప్రయోగం. లక్షలాది రూపాయల ఫీజులువసూలు చేస్తూ, పశువుల పాకల వంటి గదుల్లో విద్యార్థులను బంధించి, కేవలం ర్యాంకుల కోసం వారిని ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తుంటే సర్కారు ఎందుకు నిద్రపోతోంది? ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు ఫ్యాన్లకు ఉరితాళ్లతో వేలాడుతున్నా, అవే సంస్థలకు ప్రభుత్వం ఏటా అనుమతులు ఎలా మంజూరు చేస్తోంది? ఒకవైపు ఆ సంస్థల యజమానులను దొంగలతో పోల్చిన మంత్రి, అదే సమయంలో ప్రభుత్వం వారికి ఎందుకు వత్తాసు పలుకుతుందో సమాధానం చెప్పాలి. పీహెచ్‌డీలు చేసిన మేధావులు కూడా ఉద్యోగాలు లేక ఈ నరకకూపాల్లో వెట్టిచాకిరీ చేస్తున్నారంటే, అది ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో మరియు విద్యా రంగంలో ఉపాధిని కల్పించడంలో ఎంతగా విఫలమైందో చాటి చెబుతోంది. ప్రభుత్వం తన పరిధిలోని లెక్చరర్ పోస్టులను భర్తీ చేయకుండా, ఉన్నత విద్యావంతులను కార్పొరేట్ రాబందుల చేతికి చిక్కేలా చేస్తోంది. ఒకవైపు ప్రభుత్వం మన ఊరు - మన బడి వంటి పథకాలతో గొప్పలు చెప్పుకుంటూనే, మరోవైపు కార్పొరేట్ సంస్థల ఫీజుల దోపిడీని అదుపు చేయడానికి కనీసం ఒక్క జీవో (..) కూడా జారీ చేయలేక చేతులెత్తేస్తోంది. మంత్రి తన సొంత నిధులతో ఒక మోడల్ స్కూల్ కట్టినంత మాత్రాన రాష్ట్రంలోని లక్షలాది మంది పేద విద్యార్థుల సమస్య తీరిపోదు. అది కేవలం ఒక వ్యక్తిగత ఇమేజ్ కోసం చేసే ప్రయత్నం తప్ప, విధానపరమైన మార్పును తీసుకురాదు.

కార్పొరేట్ సంస్థలకు మరియు ప్రభుత్వానికి మధ్య ఉన్న అపవిత్ర పొత్తు ( ) వల్లనే ఇలాంటి గందరగోళ ప్రకటనలు బయటకు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో విరాళాలు ఇచ్చే కార్పొరేట్ శక్తుల మెడలు వంచే ధైర్యం పాలకులకు లేనందువల్లే, ఇలాంటి మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రభుత్వమే స్వయంగా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ, ప్రజల ముందు నీతులు వల్లించడం అత్యంత సిగ్గుచేటు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు ప్రభుత్వంలోని అంతర్గత విభేదాలను కూడా బయటపెడుతున్నాయి. విద్యాశాఖ మంత్రిగా ఉన్న వ్యక్తి సమర్థుడు కాదని కోమటిరెడ్డి భావిస్తున్నారా? లేక ముఖ్యమంత్రి నాయకత్వంలో విద్యా వ్యవస్థ బాగుపడదని ఆయనకు నమ్మకం పోయిందా? అసలు విద్యాశాఖ మంత్రి బాధ్యతలు తీసుకోవడమే సమస్యకు పరిష్కారం అనుకుంటే, ప్రస్తుత కేబినెట్‌లో విద్యాశాఖ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మంత్రి పరోక్షంగా ఒప్పుకున్నట్లే కదా! ఒక పక్క ప్రభుత్వ కాలేజీల్లో కనీసం ల్యాబ్ సౌకర్యాలు లేక, టాయిలెట్లు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతుంటే, వాటిని బాగు చేయడం చేతకాని పాలకులు కార్పొరేట్ స్కూళ్లను మూసేస్తామని చెప్పడం కేవలం రాజకీయ విన్యాసం మాత్రమే. మూసివేత అనేది ఒక ప్రత్యామ్నాయం కాదు, అది కేవలం అసమర్థతను కప్పిపుచ్చుకునే సాకు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా ప్రైవేట్ సంస్థలను తిట్టడం అంటే.. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే.

**వెంక గారి భూమయ్య 98489863**

## ఆపద్ధర్మ ఒప్పందం అయినా ఉభయతారకం

భారత్,యూరోపియన్ యూనియన్ నడుమ కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అన్ని విధాలా ఘనం..ఉభయ తారకం.మన ప్రధాని వర్ణించినట్టు ఇది అన్ని ఒప్పందాలకు తల్లి లాంటిదే. అంతకు మించి ఇరువురకు అత్యవసరమైనది.రెండు దశాబ్దాలుగా పడి ఉన్న ప్రతిపాదన నేడు కార్యరూపం దాల్చడంలో ఇరు వైపులా జరిగిన కృషి అభినందనీయం .అమెరికా మిత్ర,శత్రు బేధం చూపించకుండా అందరినీ తన సుంకాల పెంపు తర్జన చూపించిన నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యం కుదుపుకి లోనైంది.అందుకు భారత్ గానీ యూరోప్ గానీ మినహాయింపు కాదు.ఈ స్థితిలో మూలపడి ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలకు బూజు దులిపి క్రియాశీలకం చెయ్యడం అవసరంగా మారింది.నేడు తుది రూపు తో ఖరారైంది. 27 దేశాల యూరోప్ సమాఖ్య భారత్ ఎగుమతులకు మంచి మార్కెట్ ని చూపెడుతోంది. అలాగే మన దేశానికి అవసరమైన వస్తు సేవల్ని చవకగా అందిస్తుంది.ప్రపంచ జీడీపీ లో 25 శాతం కలిగిన ఈ రెండు భాగస్వాములూ తమ తమ సుంకాల్ని దశలవారీగా దాదాపు ఎత్తివేయడం వల్ల లాభం పొందుతాయి. ఎక్కువ పరిమాణంలో వాణిజ్యం జరిగి ఇతర దేశాలతో స్వేచ్ఛగా,ధైర్యంగా ఒప్పందాలు చేసుకోగల వీలు చిక్కుతుంది. ముఖ్యంగా అమెరికా ఆకస్మిక నిర్ణయాలకు,బెదిరింపులకు లొంగే అవసరం రాదు.తమ దేశీయ ఉత్పత్తిదారులు నష్టపోకుండా జాగ్రత్తలు గైకొని కుదుర్చుకున్న ఈ ఒప్పందం శీఘ్రంగా కార్యరూపం దాల్చాలి.యూరోప్ సమాఖ్య పార్లమెంట్ లో ఆమోదం పొందాల్సి ఉంటుంది. అలాగే మన పార్లమెంట్ లో కూడా. ఈ ఏడాది చివరికల్లా పూర్తి కార్యరూపం దాల్చి,అందివస్తుందని ఆశిద్దాం.

**- డా.డి.వి.జి.శంకర రావు,మాజీ ఎంపీ,9440836931.**

# బిజినెస్

## బడ్జెట్‌కు ముందు నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిశాయి. బడ్జెట్ ముందు మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. ముఖ్యంగా ఐటీ, మెటల్ స్టాక్స్‌లో విక్రయాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీనికితోడు రూపాయి విలువ పతనం, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ ఉదయం 81,947.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,566.37) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాలు కొనసాగాయి. చివరికి 296.59 పాయింట్ల నష్టంతో 82,269.78 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98.25 పాయింట్ల నష్టంతో 25,320.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.02గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రధానంగా నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, ఐటీసీ, బీఈఎల్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 5060 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు, ఫిబ్రవరి బడ్జెట్ ముందు మదుపరుల ఆందోళన ప్రధాన కారణంగా ఈ లాభాల స్వీకరణ జరిగింది. ఐటీ, మెటల్, బ్యాంకింగ్ రంగాల్లో కీలక స్టాక్స్‌పై విక్రయాలు పెరగడం, కొంతమంది మల్టీనేషనల్ ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలను రీబ్యాలెన్స్ చేస్తున్నారని సూచిస్తున్నారు. ఇక కొన్ని భాగాల్లో సూచీలు పునరుద్ధరించుకునే అవకాశం ఉంది, ముఖ్యంగా బడ్జెట్ ప్రకటన తర్వాత మదుపరుల మూడవ దశలో పాజిటివ్ సెంటిమెంట్ తిరిగి వచ్చే అవకాశం ఉన్నందున. మార్కెట్‌లో రూపాయి విలువ పతనం కొనసాగుతుండటంతో, దిగుమతిదారులు మరియు ఎక్స్‌పోర్టర్లలో మిశ్రమ ప్రభావం ఏర్పడింది. రూపాయి 92.02 వద్ద ట్రేడ్ కావడం, డాలరుతో బలమైన సంబంధాన్ని సూచిస్తోంది. ఫారిన్ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగడం వల్ల కూడా సూచీలు నష్టపోవడంలో కీలక పాత్ర పోషించింది. సౌత్ ఈస్ట్ ఆసియా మరియు అమెరికా మార్కెట్ల వృద్ధి/నష్టాలు కూడా దేశీయ మార్కెట్‌లోని ట్రెండ్‌పై ప్రభావం చూపాయి. తైల, బంగారం, సీన్స్ కాంపోడిటీల ధరలు కూడా మదుపరుల నష్టాలను ప్రభావితం చేశాయి. అంతర్జాతీయ బ్రెంట్ క్రూడ్ ధర 68 డాలర్ల వద్ద కొనసాగడం, బంగారం 5060 డాలర్ల వద్ద ట్రేడవడం, సూచీలు పైముఖ్యంగా నష్టాలను పరిమితం చేయడం, కొన్ని హెడ్జ్ ఫండ్లు లాభాలు రక్షించుకోవడం వంటి కారకాలను ప్రతిబింబించింది. అంతర్గత మార్కెట్‌లో, ప్రభుత్వ విధానాలపై, మదుపరుల ఊహాశక్తి మరియు గ్లోబల్ మాక్రో ఎకానమీ పరిణామాలు ప్రధానంగా సూచీల డైనమిక్స్‌ను నిర్ణయిస్తున్నాయి.

## పేటీఎం మూడో వరుస లాభ త్రైమాసికం సాధన



డిసెంబర్ 2025తో ముగిసిన త్రైమాసికంలో పేటీఎం వరుసగా మూడోసారి లాభాన్ని నమోదు చేసి నికర లాభం ₹225 కోట్లకు చేరుకుంది. చెల్లింపులు మరియు ఆర్థిక సేవల్లో బలమైన ఆదాయీకరణ, కృత్రిమ మేధ వినియోగంతో వ్యాపార విస్తరణ, వ్యాపారుల సభ్యత్వాల పెరుగుదల కారణంగా ఆదాయం ₹2,194 కోట్లకు పెరిగింది. యూపీఐలో వినియోగదారుల లావాదేవీల విలువ తొమ్మిది నెలల్లో 35% పెరిగి పరిశ్రమ వృద్ధిని మించింది. చెల్లింపుల సేవలు మరియు ఆర్థిక ఉత్పత్తుల పంపిణీ బలంగా పెరగగా, ఖర్చుల నియంత్రణతో నిర్వహణ లాభం గణనీయంగా మెరుగైంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ నుండి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మరియు అంతర్జాతీయ చెల్లింపుల అనుమతులు లభించడంతో సంస్థ భవిష్యత్ వృద్ధికి మరింత బలమైన స్థితిలో నిలిచింది.

## ఇనార్బిట్ మాల్ లో స్ట్రాబెర్రీ పండుగ సందడి




ఇనార్బిట్ మాల్ సైబరాబాద్‌లో జనవరి ముప్పయ్యవ తేదీ నుంచి ఫిబ్రవరి మొదటి తేదీ వరకు మూడు రోజుల పాటు స్ట్రాబెర్రీ పండుగగా బెర్రీ ల్యాండ్ కార్నివల్ నిర్వహించబడుతోంది. కేంద్ర ప్రాంగణం రెండో అంతస్తులో జరిగే ఈ వేడుకలో స్ట్రాబెర్రీ ఆధారిత అలంకరణలు, రుచికరమైన వంటకాలు, పిల్లలు పెద్దలు అందరికీ అనువైన సృజనాత్మక కార్యకలాపాలు, చేతిపనుల తయారీ, చిత్రలేఖనం, చిన్న దుకాణాల కొనుగోళ్లు ఉంటాయి. సాయంత్రం వేళల్లో సంగీత కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆనందంగా సమయం గడిపేందుకు అనువైన ఈ పండుగకు ప్రవేశం ఉచితం కాగా, కావాలనుకుంటే అక్కడే నమోదు చేసుకుని పాల్గొనవచ్చు.

## యునికామర్స్ షిప్‌వే బీటూబీ లాజిస్టిక్స్ విస్తరణ

న్యూఢిల్లీ లో జనవరి ముప్పయ్యవ తేదీన యునికామర్స్ సంస్థకు చెందిన షిప్‌వే కొత్త లాజిస్టిక్స్ సాఫ్ట్‌వేర్ పరిష్కారం 'షిప్‌వే కార్గో'ను ప్రారంభించింది. వేగవంతమైన వాణిజ్యం, తరచూ జరిగే వ్యాపారం నుంచి వ్యాపారానికి సరుకుల రవాణా, భారీ మరియు పెద్ద పరిమాణ సరుకుల పంపిణీ అవసరాల కోసం ఈ వ్యవస్థను ప్రత్యేకంగా రూపొందించారు. దార్ స్టోర్ల సరుకు నింపడం, గిడ్డంగుల మధ్య రవాణా, పంపిణీదారులకు సరఫరా వంటి అవసరాల్లో ఇది ఖర్చు తగ్గించి సమర్థతను పెంచుతుంది. ప్రత్యేక నియంత్రణ పట్టిక ద్వారా రవాణా నిర్వహణ, సమయ పట్టిక ఆధారిత బెలివరీలు, నిపుణ రవాణా భాగస్వాముల సహకారం లభిస్తుంది. భారతీయ రిటైల్ రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో వ్యాపార సరఫరా వ్యవస్థను మరింత వేగవంతంగా, పారదర్శకంగా మార్చేందుకు షిప్‌వే కార్గో కీలక పాత్ర పోషించనుంది.

## ఫిజిక్స్‌వాలా పదవ తరగతి విద్యార్థులకు ఉచిత సహాయం

భారతదేశవ్యాప్తంగా పదవ తరగతి సీబీఎస్ఈ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఫిజిక్స్‌వాలా సంస్థ ఉచిత సందేహ నివృత్తి మరియు మాక్ బోర్డు పరీక్షల కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ సహాయం సంస్థలో చేరిన విద్యార్థులకే కాకుండా అన్ని పాఠశాల విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది. విజ్ఞానశాస్త్రం మరియు గణితంలో ప్రత్యక్ష బోర్డు పరీక్షలు నిర్వహించి నిజమైన పరీక్ష వాతావరణానికి అలవాటు చేయనున్నారు. విద్యార్థుల సమీపంలోని విద్యాపీఠ్, పాఠశాల లేదా ట్యూషన్ కేంద్రాలను సందర్శించి సందేహ నివృత్తి పొందవచ్చు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు పాఠ్యాంశాల వివరణ, సమాధాన రచనా పద్ధతులు, పునశ్చరణ మార్గదర్శకాలు అందించి పరీక్ష భయాన్ని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉద్దేశించబడింది.

## బీపీఎల్ మెడికల్ ఐఆర్ఐఏలో సాంకేతిక ప్రతిభ ప్రదర్శన



హైదరాబాద్‌లో జరిగిన ఐఆర్ఐఏ 2026 సదస్సులో బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ఆధునిక ఇమేజింగ్ మరియు కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాలను ప్రదర్శించింది. దక్షిణ కొరియాకు చెందిన యెజ్యూ టీఎంటెక్ సంస్థను స్వాధీనం చేసుకోవడం ద్వారా అభివృద్ధి చేసిన ఇమేజింగ్ రంగంలో గ్లోబల్ స్థాయిలో తమ సామర్థ్యాన్ని మరింత బలపరిచింది. ఈ సందర్భంగా బీపీఎల్ క్లారిక్స్ అనే కృత్రిమ మేధ ఆధారిత రేడియాలజీ వేదికను ఆవిష్కరించి వేగవంతమైన, మెరుగైన నిర్ధారణకు దోహదం చేస్తుందని తెలిపింది. మహిళల ఆరోగ్య ఇమేజింగ్, ఎముక సాంద్రత కొలతలు, మామోగ్రఫీ వంటి రంగాల్లో పురోగతిని ప్రస్తావించగా, రోబోటిక్ సహాయకంతో రియల్ నిర్వహించిన కిక్షణ సమాచారం పెద్ద ఎత్తున ఆకర్షణ పొందాయి. భారతీయ ఆరోగ్య వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా వినూత్న, అందుబాటులో ఉండే సాంకేతికతను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని సంస్థ వెల్లడించింది.

## హెచ్‌సీఎల్‌టెక్-గార్డియన్ ఏఐ భాగస్వామ్యం

హెచ్‌సీఎల్‌టెక్ మరియు అమెరికాకు చెందిన ప్రముఖ జీవ బీమా సంస్థ గార్డియన్ కలిసి కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక మార్పు ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ సహకారంతో గార్డియన్ తమ ప్రధాన సాంకేతిక వ్యవస్థలను ఆధునీకరించి, బీమ కార్యకలాపాలను సులభతరం చేయడంతో పాటు వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని అందించనుంది. హెచ్‌సీఎల్‌టెక్ యొక్క జెనరేటివ్ కృత్రిమ మేధ సేవల వేదిక ద్వారా అప్లికేషన్ అభివృద్ధి, మద్దతు, పరీక్షలు మరియు మౌలిక వసతుల నిర్వహణలో సామర్థ్యం పెరుగుతుంది. ఈ భాగస్వామ్యం గార్డియన్‌కు వేగవంతమైన డిజిటల్ నవీకరణ, ఖర్చుల నియంత్రణ మరియు మార్కెట్‌కు త్వరిత సేవల అందింపులో కీలకంగా నిలవనుంది. గార్డియన్ వ్యాపార వృద్ధిలో భాగస్వామ్యం కావడం ఇది ఒక ఉత్తేజకరమైన సమయం. మేము మా సాంకేతిక పరివర్తన అనుభవాన్ని మరియు ప్రపంచవ్యాప్త ఉనికిని ఉపయోగించుకుని, కంపెనీ తన వ్యాపార లక్ష్యాలను సాధించడంలో సహాయపడతాము. యు.ఎస్. లోని అతిపెద్ద బీమా సంస్థలలో ఒకదానితో భాగస్వామ్యం కుదుర్చుకోవడం, మా ఏఐ నైపుణ్యం మరియు విస్తృత పరిశ్రమ అనుభవం ద్వారా ఆర్థిక సేవల రంగంలో హెచ్‌సీఎల్‌టెక్ యొక్క నాయకత్వాన్ని నొక్కి చెబుతుంది అని శ్రీనివాసన్ శేషాద్రి అన్నారు.

## రియల్‌మీ కొత్త పవర్ ఫోన్లతో శక్తివంతమైన ఆవిష్కరణ




రియల్‌మీ, భారత యువతకు అత్యంత సిఫారసు చేయబడిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌గా, కొత్త రియల్‌మీ పి4 పవర్ 5జీ ను విడుదల చేసింది. ఈ ఫోన్లో భారతదేశంలో మొదటిసారిగా 10,001 ఎంఏహెచ్ టైటన్ బ్యాటరీని ఉపయోగించి అత్యధిక శక్తి సమర్థతను అందిస్తోంది. మైడియాటెక్ డిమెన్సిటీ 7400 ఉల్ట్రా 5జీ చిప్‌సెట్, హైపర్‌విజన్ ఏఐ చిప్ మరియు పియర్ అకాడమీతో సహకారంతో రూపొందించిన జెనిజ్ ప్రేరిత ట్రాన్స్‌వ్యూ డిజైన్ ఫోనుకు ప్రత్యేకంగా ఆకర్షణను ఇచ్చాయి. ఫోను 8జిబి128జిబి, 8జిబి256జిబి మరియు 12జిబి256జిబి వేరియంట్లలో అందుబాటులో ఉంది. ఈ ఫోన్ ప్రత్యేకంగా దీర్ఘకాలిక శక్తి, స్మూత్ పనితీరు మరియు వినూత్న దృశ్య ఆకర్షణతో యు-వతకు అనువైన అనుభవాన్ని అందిస్తుంది. ప్రారంభ అమ్మక సమయంలో ₹23,999 నుండి ప్రారంభమయ్యే ధరలో బ్యాంక్/ఎక్స్ఛేంజ్ ఆఫర్లు మరియు నాలుగు సంవత్సరాల బ్యాటరీ వారంటీ లభించనుంది. ఈ ఫోన్ రియల్‌మీ.కామ్, ఫ్లిప్‌కార్ట్ మరియు ఆఫ్‌లైన్ స్టోర్లలో కొనుగోలు చేయవచ్చు. దీనితో పాటు, రియల్‌మీ బడ్స్ క్లిప్ ను విడుదల చేశారు. 5.3 గ్రాముల తేలికపాటి ఈ ఎయిర్‌బడ్స్‌లో 11 మిమీ డ్యూయల్ డ్రైవర్స్, నెక్స్ట్‌బాస్, 3డి స్పేషియల్ ఆడియో, ఏఐ ఈఎన్‌సి కాల్స్ మరియు జెమిని ఆధారిత వాయిస్ అసిస్టెంట్ ఫీచర్లు ఉన్నాయి. గోల్డ్ మరియు గ్రే కలర్లలో అందుబాటులో ఉండే బడ్స్ క్లిప్ ప్రత్యేక ఫస్ట్ సేల్ ధర ₹5,499తో 5వ ఫిబ్రవరి మధ్యాహ్నం 12:00 నుండి 7వ ఫిబ్రవరి వరకు కొనుగోలు చేయవచ్చు. అంతే కాకుండా, రియల్‌మీ టెక్‌లైఫ్ 45 వా కేబుల్ పవర్ బ్యాంక్ 20,000 ఎంఏహెచ్ సామర్థ్యం, 45 వా ఫాస్ట్ ఛార్జింగ్, మూడు అవుట్‌పుట్ పోర్ట్స్, 3డి ట్రాన్స్‌పరెంట్ షెల్ డిజైన్ మరియు మల్టీ-మోడ్ స్మైల్ డిస్ప్లే ఫీచర్లతో అందుబాటులో ఉంది. ఇది ఫోన్లకు మాత్రమే కాకుండా, ఇతర డివైసెస్‌కు కూడా శక్తిని అందిస్తూ వినియోగదారుల రోజువారీ అవసరాలను సులభతరం చేస్తుంది.

## పిఐ ఇండస్ట్రీలు కొత్త లోగోతో జీవిత శాస్త్రాల్లో విస్తరణ

పిఐ ఇండస్ట్రీలు లిమిటెడ్ తన కొత్త కార్పొరేట్ లోగోను విడుదల చేసింది, ఇది కంపెనీని ఒక బలమైన వ్యవసాయ శాస్త్రాల సంస్థ నుండి గ్లోబల్ జీవిత శాస్త్రాల సంస్థగా మార్చే ప్రయాణంలో కీలక మైలురాయిని సూచిస్తుంది. కంపెనీ పేరు మారకుండా ఉండి, పిఐ బ్రాండ్ పేరు కార్పొరేట్ గుర్తింపును కొనసాగిస్తుంది. కొత్త లోగోలో'ఆ యొక్క శాస్త్రీయ డీఎన్ఏ, భవిష్యత్ దిశలో ఉన్న లక్ష్యాలను ప్రతిబింబిస్తుంది. లోగోలో ఉపయోగించిన నీలం రంగు అవిష్కరణ, నమ్మకం, నాణ్యతను సూచిస్తే, ప్రకాశవంతమైన పసుపు రంగు శక్తి, సానుకూలత మరియు శాస్త్ర శక్తిని ప్రతిబింబిస్తుంది. డీఎన్ఏ హెలిక్స్ ఆకారం అనుసంధాన వ్యవస్థల నిర్మాణం పిఐ యొక్క విభాగాల మధ్య శాస్త్రీయ సామర్థ్యాలను సూచిస్తుంది. దేవనాగరి ప్రేరిత టైపోగ్రఫీ భారతీయ మూలాలను మరియు గ్లోబల్ దృష్టిని ప్రతిబింబిస్తుంది. అలాగే పిఐ 80 ఏళ్ల శాస్త్రీయ వారసత్వంతో నాణ్యత, ఖచ్చితత్వం, వేగాన్ని అందిస్తుంది. కంపెనీ ప్రధాన రసాయన, జీవశాస్త్ర, ఫార్మాస్యూటికల్ మరియు కాంప్లెక్స్ రసాయన పరిష్కారాలను ప్రపంచస్థాయి ప్రమాణాలతో అందిస్తుంది. అంతర్జాతీయ భాగస్వామ్యంతో పిఐ ప్రత్యేక మాలిక్యూల్స్, ప్లాట్‌ఫారమ్‌లు మరియు పరిష్కారాలను అందిస్తూ, నాణ్యత, భద్రత మరియు స్థిరత్వ లక్ష్యాలను చేరుస్తుంది. వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ సింఘాల్ ప్రకారం, "పిఐ రసాయన, జీవశాస్త్ర మరియు సాంకేతికతల సంగమంలో పనిచేస్తుంది. కొత్త గుర్తింపు సంస్థ స్కేలు, సాఫిస్టికేషన్ మరియు గ్లోబల్ ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది, భవిష్యత్-సిద్ధ, శాస్త్రీయంగా నడిపే, లక్ష్యసాధనతో ఉన్న సంస్థగా ఉండగా, నాణ్యత, విలువల మరియు శాస్త్రీయ క్రమశిక్షణను కాపాడుతుంది."

## కోరోమాండెల్ అంతర్జాతీయంగా త్రైమాసిక రికవరీ ఫలితాలు

కోరోమాండెల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ 2025 డిసెంబర్ 31 నాటికి ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. కంపెనీ, ఉరికల, పంట రక్షణ, బయో ఉత్పత్తులు, ప్రత్యేక పోషకాలు, సేంద్రియ ఉరికలు మరియు వ్యవసాయ రిటైల్ లో తన నాయకత్వాన్ని మరింత బలపరుస్తు, అగ్రి-డ్రోన్ స్ప్రేయింగ్ మరియు ఇతర డిజిటల్ కార్యక్రమాల ద్వారా సుస్థిరత మరియు పంట ఉత్పాదకతను పెంచుతున్నది. త్రైమాసిక స్వతంత్ర ఫలితాల్లో మొత్తం ఆదాయం రూ. 8,537 కోట్లు, ఇబిటిడిఏ రూ. 763 కోట్లు, ప్యాట్ రూ. 530 కోట్లు నమోదైంది. సంవత్సరానికి మొదటి తొమ్మిది నెలల్లో మొత్తం ఆదాయం 25,133 కోట్లు, ఇబిటిడిఏ 2,652 కోట్లు, ప్యాట్ 1,854 కోట్లు సాధించింది. సంస్థ కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కూడా ఆదాయం మరియు లాభం గణనీయంగా పెరిగాయి, డివిడెండ్ రూపంలో షేర్లకు రూ. 9/- ఎంటరిమ్ డివిడెండ్ ప్రకటించబడింది. కోరోమాండెల్ ఎండి & సీఈఓ శ్రీ. ఎస్. శంకరసుబ్రహ్మణ్యం ప్రకారం, "వాయు మరియు పర్యావరణ పరిస్థితుల సవాళ్లతో కూడినప్పటికీ, త్రైమాసికంలో కంపెనీ స్థిరమైన ప్రదర్శన ఇచ్చింది. ఉరిక ఉత్పత్తి 1 మిలియన్ టన్నుల రికార్డ్ స్థాయిలో చేరింది. ఫాస్ఫాటిక్ ఉరిక విభాగంలో 3.6 మిలియన్ టన్నుల వాణిజ్యాన్ని సాధించి 10% వాల్యూమ్ వృద్ధి సాధించాం. పంట రక్షణ విభాగం మరియు రిటైల్ వ్యాపారం కూడా గణనీయమైన అభివృద్ధిని నమోదు చేశాయి." సంస్థ పూర్తాల ఆధారిత ప్రాజెక్టులు, సల్ఫ్యూరిక్ మరియు ఫాస్ఫోరిక్ ఆమ్ల ప్లాంట్లను క్యూ 4 ఎఫ్వై26 లో ప్రారంభించడానికి సిద్ధం చేస్తోంది. కకినాడలోని ఉరిక సామర్థ్య విస్తరణ ప్రాజెక్టు క్యూ 4 ఎఫ్వై27 లో పూర్తిగా సదుపుపడింది. అలాగే, ఫాస్ఫో-జిప్సమ్ ఆధారిత ఉత్పత్తుల కోసం ప్లస్ ఎన్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ వెంచర్ స్థాపించబడింది. క్వార్టర్‌లో నాకల్ ఇండస్ట్రీస్ సబ్సిడియరీ 249 కోట్ల రైట్స్ ఇష్యూ విజయవంతంగా పూర్తి చేసింది.

## జియో-బీపీ సాంకేతిక పెట్రోల్ ఇంజిన్ శుభ్రత విప్లవం



హర్దీప్ సింగ్ పూరీ జియో-బీపీ యాక్టివ్ సాంకేతికతతో రూపొందించిన కొత్త పెట్రోల్‌ను ఇండియా ఎనర్జీ వీక్ 2026లో గోవాలో ప్రారంభించారు. ఈ పెట్రోల్ ముఖ్య ఇంజిన్ భాగాలపై ఉండే మలినాలను తొలగించగల సామర్థ్యం కలిగి ఉంది, ఇంజిన్ పనితీరును పునరుద్ధరించి, మరింత స్మూత్ గా నడిచేలా చేస్తుంది. సాధారణ పెట్రోల్ ఉపయోగించే కంటే ప్రతి సంవత్సరం 100 కిలోమీటర్ల వరకు అదనపు ప్రయాణ సామర్థ్యం ఇవ్వగలదు, ఇంకా దీని కోసం అదనపు ఖర్చు అవసరం లేదు. యాక్టివ్ సాంకేతికత పెట్రోల్ వినియోగదారులకు నాణ్యమైన ప్రయోజనాలను అందిస్తుంది. ఇది ఇంజిన్ ను శుభ్రంగా ఉంచి స్మూత్ డ్రైవ్, ఇంధన ఆదా, మరియు నిర్వహణలో తగ్గుదల సాధిస్తుంది. ఈ సాంకేతికత ప్రతి వినియోగదారుకి రోజువారీ ఉపయోగంలో ఇంజిన్ పనితీరును మెరుగుపరచే విధంగా రూపొందించబడింది. జియో-బీపీ ఛైర్మన్ సర్తక్ బేహూరియా ప్రకారం, ఈ పెట్రోల్ ద్వారా భారతీయ డ్రైవర్లు ఎక్కువ సౌకర్యం, నమ్మకమైన ఇంజిన్ పనితీరు మరియు తక్కువ నిర్వహణతో ప్రయోజనం పొందవచ్చు. యాక్టివ్ సాంకేతిక పెట్రోల్ ఉపయోగించడం ద్వారా హానికరమైన మలినాల ప్రభావాలను రివర్స్ చేయగలదు. సాధారణ ప్రయాణంలో కూడా ఇంజిన్ శుభ్రతను కొనసాగించగలదని ఆయన వెల్లడించారు. జియో-బీపీ సీఈఓ అక్షయ్ వాధ్వా ప్రకారం, కోయంబత్తూరులో 4,000 కిలోమీటర్ల సహిష్ణుతో మోటార్‌సైకిళ్లపై పరీక్షలు నిర్వహించాం, యాక్టివ్ సాంకేతిక పెట్రోల్ వాడినవేటి ఇంజిన్ గణనీయంగా శుభ్రంగా మరియు సామర్థ్యవంతంగా పని చేశాయి. ఇది ప్రతి సంవత్సరం 100 కిలోమీటర్ల అదనపు ప్రయాణాన్ని సాధించగలదని, ఇంధన ఆదా, నిర్వహణ తగ్గడం వంటి వాస్తవ ప్రయోజనాలను ప్రతిబింబిస్తుంది. జియో-బీపీ పెట్రోల్ వినియోగదారులకు నాణ్యమైన మరియు సుస్థిర ప్రయోజనాలను అందిస్తుంది.

## ఎయిర్‌టెల్ అద్భుతం: అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం ఉచితం




భారతి ఎయిర్‌టెల్ తన 360 మిలియన్ కస్టమర్లకు అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ను ఉచితంగా అందిస్తోంది. ఈ సబ్‌స్క్రిప్షన్ రూ4,000 విలువ కలిగి, వినియోగదారులు వైరాల్ సోషల్ మీడియా కంటెంట్, చిన్న వీడియోలు, మార్కెటింగ్ మెటీరియల్స్ సులభంగా మరియు ప్రొఫెషనల్ క్వాలిటీతో సృష్టించడానికి ఉపయోగించుకోవచ్చు. ఎయిర్‌టెల్ ధన్యవాదాలు యాప్ ద్వారా కేవలం లాగిన్ అయ్యే విధంగా, క్రెడిట్ కార్డ్ అవసరం లేకుండా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం వాడే కస్టమర్లు వేలాది ప్రొఫెషనల్ టెంప్లేట్స్, ఏఐ ఆధారిత ఫీచర్లు, అడోబ్ స్టాక్ అస్సెట్లు, 30,000 కంటే ఎక్కువ ఫాంట్స్, 100జిబి క్లౌడ్ స్టోరేజ్, వీడియో ఎడిటింగ్ మరియు బ్యాక్‌గ్రౌండ్ రిమూవల్ వంటి అధునాతన సౌకర్యాలను పొందగలరు. ఈ ఫీచర్లు ఎలాంటి వాటర్‌మార్క్ లేకుండా, వివిధ డివైసులలో సింపుల్ సింక్ తో పనిచేస్తాయి. ఈ భాగస్వామ్యం ద్వారా సృష్టికర్తలు, ఇన్ఫ్లుయెన్సర్లు, విద్యార్థులు మరియు చిన్న వ్యాపారాలు తాము కోరుకునే కంటెంట్‌ను త్వరగా మరియు అత్యుత్తమ నాణ్యతతో సృష్టించవచ్చు. పండుగ గ్రీటింగ్ కార్డులు, వేడుక ఆహ్వానాలు, సోషల్ మీడియా ప్రకటనలు, వీడియోలు సులభంగా తయారుచేయవచ్చు, మరియు ఏఐ ఫీచర్ల ద్వారా వ్యక్తిగతీకరణ సాధ్యం అవుతుంది. వివిధ భాషలలో-ఇంగ్లీష్, హిందీ, తమిళ్ మరియు బెంగాలీ-అడోబ్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉంది. ఇది భారతీయ వినియోగదారుల సాంప్రదాయాలకు అనుగుణంగా, వ్యక్తిగత మరియు వాణిజ్య కంటెంట్ సృష్టికి సహకరిస్తుంది. స్టూడెంట్స్ ప్రొఫెషనల్ ప్రాజెక్టులు, ప్రటంటేషన్లు తయారు చేయగలరు, చిన్న వ్యాపారాలు వారి బ్రాండ్ మరియు మార్కెటింగ్ ప్రకటనలను త్వరగా రూపొందించవచ్చు, ఇలా ప్రతి ఒక్కరూ క్రియేటివ్ పవర్ పొందుతారు. అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం ద్వారా సృష్టికర్తలు తమ వ్యక్తిగతతను, సృజనాత్మకతను డిజిటల్ ప్రపంచంలో ప్రత్యేకంగా ప్రతిఫలించగలరు. వీడియో ఎడిటింగ్, రీల్స్, యూట్యూబ్ థంబ్‌నెయిల్స్ వంటి కంటెంట్ త్వరగా రూపొందించడానికి ఏఐ ఫీచర్లు సులభతరం చేస్తాయి. వినియోగదారులు ప్రొఫెషనల్ లుక్ కలిగిన పోస్టర్లు, ఫ్లైయర్లు, లోగోలు, క్యూఆర్ కోడ్స్, సోషల్ మీడియా ప్రకటనలు మరియు ఇతర మార్కెటింగ్ మెటీరియల్స్ ను తక్కువ సమయంలో సృష్టించవచ్చు.

## కియా ఇండియా-ఏవిస్ లీజింగ్ వ్యూహాత్మక భాగస్వామ్యం




కియా ఇండియా భారతదేశంలో తన లీజింగ్ మరియు సబ్స్క్రిప్షన్ సేవలను మరింత బలోపేతం చేయడానికి ప్రముఖ ఆటో లీజింగ్ సంస్థ ఏవిస్ లీజింగ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా కియా లీజ్ కార్యక్రమం పరిధి విస్తరించి, వినియోగదారులకు అనువైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణ పరిష్కారాలు అందుబాటులోకి వస్తాయి. ముందస్తు చెల్లింపులు లేకుండా, మొత్తం ఆరు నుంచి అరవై నెలల వరకు లీజు కాలవ్యవధి, నిర్వహణ, బీమా మరియు తిరిగి అమ్మకానికి సంబంధించిన సేవలతో వినియోగదారులకు ఇబ్బందిలేని అనుభవం కల్పించనుంది. లీజు గడువు ముగిసిన తరువాత వాహనాన్ని తిరిగి ఇవ్వడం లేదా కొత్త కియా మోడల్‌కు మారే స్వేచ్ఛ కూడా ఉంటుంది. ఇప్పటికే రెండు ప్రముఖ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్న కియా ఇండియా, ఈ ఒప్పందంతో లీజింగ్ రంగంలో తన స్థానం మరింత పటిష్ఠం చేసుకుంది.

## మారుతి సుజుకి ఐదు స్టార్టప్‌లతో సాంకేతిక భాగస్వామ్యం



మారుతి సుజుకి ఇండియా ఆధునిక సాంకేతికతలను వ్యాపార రంగాలన్నింటిలో విస్తరించేందుకు ఐదు కొత్త స్టార్టప్‌లను తన ఇంక్యుబేషన్ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసింది. ఆగ్‌విజ్, ఆట్లాట్, జెన్ మొబిలిటీ, ఇండస్ విజన్ మరియు ప్రాక్సీ అనే ఈ స్టార్టప్‌లు కృత్రిమ మేధ ఆధారిత తనిఖీలు, తక్కువ లోపాల తయారీ, చివరి దశ సరఫరాకు విద్యుత్ వాహనాలు, వాహన నాణ్యత తనిఖీ, అలాగే కార్లకు భద్రత కోసం ఐటీ ఆధారిత పరిష్కారాలను అందించనున్నాయి. ఐఐఎం బెంగళూరులోని ఎన్ఎస్ఆర్‌సీఈఎల్ సహకారంతో సాగుతున్న ఈ కార్యక్రమం ద్వారా తయారీ ఖచ్చితత్వం, నాణ్యత, భద్రత మరియు స్థిరమైన మొబిలిటీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని సంస్థ తెలిపింది. ఈ భాగస్వామ్యాలు స్టార్టప్‌లకు వాస్తవ పరిశ్రమ అనుభవాన్ని, మారుతి సుజుకికి వినూత్న పరిష్కారాలను అందించే పరస్పర లాభదాయక అడుగుగా నిలుస్తున్నాయి.

## షావోమీ ప్రీమియం సేవా కేంద్రాల విస్తరణ



వినియోగదారుల విశ్వాసం మరియు బలమైన స్పందనను ఆధారంగా చేసుకుని షావోమీ భారతదేశంలో తన ప్రీమియం సేవా కేంద్రాల నెట్‌వర్క్‌ను మరో పదిహేను నగరాలకు విస్తరించింది. ఇది దేశవ్యాప్తంగా వంద ప్రీమియం సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న రెండో దశ ప్రణాళికలో భాగం. ఈ కొత్త తరహా సేవా కేంద్రాలు కేవలం మరమ్మతులకే పరిమితం కాకుండా వేగవంతమైన సేవలు, నిపుణుల సాంకేతిక సహాయం, ఉత్పత్తుల అనుభవ ప్రాంతాలు వంటి సౌకర్యాలతో కొత్త రకమైన సేవా అనుభవాన్ని అందిస్తాయి. మహిళలకు ప్రత్యేక రాయితీలు, రక్షణ సిబ్బంది మరియు దివ్యాంగులకు జీవితకాల సేవా ఛార్జీల మినహాయింపులు వంటి ప్రయోజనాలు కూడా ఇందులో భాగం. పరికరాల వినియోగ కాలం పెరుగుతున్న నేపథ్యంలో నమ్మకమైన అమ్మకాల తర్వాతి సేవలను బలోపేతం చేస్తూ, వినియోగదారులకు దీర్ఘకాలిక మద్దతు అందించడమే షావోమీ లక్ష్యమని సంస్థ తెలిపింది.

## ఫ్యుజిఫిల్మ్ ఇండియా: నూతన వైద్య చిత్రం పరిష్కారాలు



ఫ్యుజిఫిల్మ్ ఇండియా ఐఆర్ఐఏ 2026 లో ఆధునిక వైద్య చిత్రీకరణ మరియు ఆరోగ్య సమాచార పరిష్కారాలను ప్రకటించింది. ఈ పరిష్కారాలు, సిటి స్కానర్, డిజిటల్ మమ్మోగ్రఫీ, ఎక్స్-రే వ్యవస్థలు మరియు హెచ్‌సిఐటి ఫెలిక్స్ ఆరోగ్య సమాచార సాఫ్ట్‌వేర్‌ను కలిగి, రేడియాలజీ విభాగాల్లో పెరుగుతున్న రోగి భారం, సాంకేతిక నవ్యత మరియు క్లినికల్ నాణ్యతను సమర్థవంతంగా నిర్వహించడానికి రూపొందించబడ్డాయి. ఏఐ ఆధారిత స్వయంచాలక చర్యలు, చిన్న శక్తి వినియోగంతో అధిక నాణ్యత చిత్రం, మరియు వైద్య సౌకర్యాల మెరుగుపరచడం ద్వారా సమగ్ర, అందుబాటులో ఉన్న వైద్య సేవలను అందించడం ద్వారా భారతదేశంలో నిర్ధారణ సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఫ్యుజిఫిల్మ్ ఇండియా దృష్టి పెట్టింది.

## స్కూట్ దక్షిణ భారత ప్రయాణపు కొత్త ధోరణులు




స్కూట్ కంపెనీ నిర్వహించిన సర్వే ప్రకారం, దక్షిణ భారతంలోని విహారయాత్రికులు ప్రాముఖ్యమైన, తక్కువ సందర్శిత గమ్యస్థానాలను ఇష్టపడుతున్నట్లు అది తేలింది. ప్రయాణికులు బడ్జెట్ అనుకూలత, తక్కువ జనసాంద్రత, మరియు నిజమైన అనుభవాల కోసం కొత్త, తెలియని ప్రదేశాలను వెతుకుతున్నారు. 2026లో ప్రతి నలుగురు వ్యక్తి ఒక ఏకాంత అంతర్జాతీయ ప్రయాణాన్ని చేయాలని ప్లాన్ చేస్తున్నారు. సర్వే చూపిస్తున్నట్లు, సోషల్ మీడియాలో సమాచారం, ఆన్‌లైన్ సమీక్షలు, మరియు కృత్రిమ బుద్ధి ఆధారిత ప్లాట్‌ఫామ్స్ ద్వారా ప్రయాణ పథకాలు రూపొందించడం ప్రధాన మార్గంగా మారింది. సాధారణంగా, వీక్ ట్రిప్ 1--3 లక్షల మధ్య ఉండగా, 7--8 రోజుల మధ్య ప్రయాణిస్తారు. ఈ ధోరణులు స్వతంత్ర, అన్వేషణాత్మక, మరియు సాంకేతిక ఆధారిత విహారయాత్రను ప్రోత్సహిస్తున్నాయి.

## బార్ట్రోనిక్స్ వ్యవసాయ వ్యాపార విస్తరణకు ఒరిగోతో భాగస్వామ్యం

బార్ట్రోనిక్స్ ఇండియా లిమిటెడ్ మరియు ఒరిగో కామోడిటీస్ మధ్య సౌహార్దపూర్వక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) సంతకం చేయబడింది, దీని ద్వారా వ్యవసాయ కేంద్రిత వ్యాపారాలను పారుగుపరచడం విస్తరించడానికి మౌలిక వసతులు, సరఫరా శ్రేణులు, నిధుల సౌకర్యాలు, సాంకేతిక సేవలు కలిపి సమగ్ర సహకారం అందిస్తారు. బార్ట్రోనిక్స్ యొక్క "ప్రాజెక్ట్ అవియో" పథకం 5,000 గ్రామాలకు పైగా విస్తరించిన గ్రామీణ నెట్వర్క్ ద్వారా రైతులకు వాణిజ్య మరియు సాంకేతిక మద్దతు అందిస్తుంది. పోరపాటు-తరువాత సేవలు, మార్కెట్ లింకేజ్, వ్యవసాయ ఇన్‌పుట్ మరియు అవుట్‌పుట్ పరిష్కారాలను కల్పిస్తుంది. ఒరిగో యొక్క గిడ్డంగి-తరువాత క్రెడిట్, వేర్‌హౌసింగ్ మరియు డిజిటల్ వేలంపాటల నైపుణ్యాలు ప్రాజెక్ట్ అవియో సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయి. ఈ భాగస్వామ్యం ద్వారా రైతులు, వ్యాపారులు మరియు వ్యవసాయ సంస్థలకు సమగ్ర, సాంకేతిక ఆధారిత మరియు మరింత సులభమైన మార్కెట్ సేవల ప్రాప్తి సాధ్యమవుతుంది.

## విప్రో జీఈ హెల్త్‌కేర్ సిగ్నా ప్రైమ్ ఎలైట్ ఆవిష్కరణ



హైదరాబాద్‌లో జరిగిన ఐఆర్ఐఏ 2026 సదస్సులో విప్రో జీఈ హెల్త్‌కేర్ భారతదేశంలోనే తయారైన ఆధునిక ఎమ్ఆర్ ఇమేజింగ్ వ్యవస్థ సిగ్నా ప్రైమ్ ఎలైట్‌ను విడుదల చేసింది. కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతతో రూపొందించిన ఈ వ్యవస్థ వేగవంతమైన స్కానింగ్, స్పష్టమైన చిత్రాలు మరియు మెరుగైన నిర్ధారణ నమ్మకాన్ని అందిస్తుంది. రోగి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన డిజైన్, పనితీరు సరళతరం చేసే స్వయంచాలక విధానాలు వైద్యులకు మరింత సమర్థంగా సేవలందించేందుకు సహాయపడతాయి. తక్కువ విద్యుత్ వినియోగం, హీలియం వినియోగాన్ని గణనీయంగా తగ్గించే మాగ్నెట్ సాంకేతికతతో ఇది పర్యావరణహితంగా కూడా నిలుస్తుంది. భారత ఆరోగ్య రంగ అవసరాలకు అనుగుణంగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వినూత్న పరిష్కారం ఆధునిక నిర్ధారణ సేవలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా కీలక అడుగుగా విప్రో జీఈ హెల్త్‌కేర్ పేర్కొంది. గత మూడు దశాబ్దాలుగా 'భారతదేశం కోసం మరియు ప్రపంచం కోసం - భారతదేశంలోనే తయారుచేస్తున్న' తొలి మెడ్‌టెక్ కంపెనీలలో విప్రో జీఈ హెల్త్‌కేర్ ఒకటి. 2024లో, విప్రో జీఈ హెల్త్‌కేర్ రాబోయే 5 సంవత్సరాలలో తయారీ ఉత్పత్తి మరియు స్థానిక పరిశోధన మరియు అభివృద్ధి కోసం రూ. 8000 కోట్లకు పైగా పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించింది. అదనంగా, ఇంటెలిజెంట్ మాగ్నెట్ టెక్నాలజీ హీలియం వాడకాన్ని 75%కి వరకు తగ్గించడంతో, ఈ పరిష్కారం ఎంఆర్ ఇమేజింగ్ యొక్క భవిష్యత్తును పునర్నిర్వచించేటప్పుడు మరింత స్థిరమైన కార్యకలాపాలకు మద్దతు ఇస్తుంది.




# ఇప్పుడు ఆర్టీఐ వంతు వచ్చిందా?

- ఇప్పటికే ఎంజీనరేగాను చంపేసిన మోడీ సర్కార్
- ఆర్‌టీఐ చట్టాన్ని బలహీనపరుస్తోన్న ఎన్ డిఏ
- 2014 నుంచి ఇప్పటి వరకు 100 మందికి పైగా ఆర్‌టీఐ కార్యకర్తలు హత్య
- కేంద్రంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఘాటు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : ఎంజీనరేగాను చంపేశారు. ఇప్పుడు ఆర్‌టీఐ వంతు వచ్చిందా? అంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఆర్థిక సర్వే నివేదికలో ఆర్‌టీఐ చట్టాన్ని పునఃపరిశీలించాలని సూచించిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆర్‌టీఐ చట్టాన్ని బలహీనపరుస్తోందని ఖర్గే ఆరోపించారు. నిజాన్ని బయటపెట్టే వారికి భయాందోళనను కలిగించే పరిస్థితులను తీసుకొచ్చిందని విమర్శించారు. నిజాన్వేషకులను శిక్షించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మండిపడ్డారు. 2014 నుంచి ఇప్పటి వరకు 100 మందికి పైగా ఆర్‌టీఐ కార్యకర్తలు హత్యకు గురయ్యారని ఆయన ఆరోపించారు. మరోవైపు, ఆర్థిక సర్వే నివేదికలో ఆర్‌టీఐ చట్టాన్ని రీ-ఎగ్జామినేషన్ చేయాలని సూచించడంపై ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు, సర్వీస్ రికార్డులు, సిబ్బంది నివేదికలను ప్రజల పరిశీలన నుంచి తప్పించాలని ప్రభుత్వం యోచిస్తోందని ఆరోపించారు. అన్నింటి కంటే ముఖ్యంగా సమాచారాన్ని నిలిపివేయడానికి మంత్రులకు ప్రత్యేక అధికారం (వీటో) కల్పించే ప్రతిపాదనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది పారదర్శకతను దెబ్బతీస్తుందని అన్నారు.

**26 వేలకుపైగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఐ కేసులు :** మోదీ ప్రభుత్వం ఆర్టీఐ చట్టాన్ని బలహీనపరిచింది. 2025 నాటికి 26 వేలకుపైగా ఆర్‌టీఐ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2019లో మోదీ ప్రభుత్వం ఆర్‌టీఐ చట్టంలో మార్పులు చేసి సమాచార కమిషనర్ల పదవీకాలం, జీతాలపై నియంత్రణను తీసుకొచ్చింది. తద్వారా స్వతంత్రంగా పనిచేయాల్సిన సంస్థలను లోబరుచుకుని, తనకు అనుకూలంగా పనిచేయిస్తోందని ఖర్గే విమర్శించారు.అలాగే, 2023లో తీసుకువచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం అవినీతిని దాచడానికి ఒక కవచంలా మారిందని, ఇది పరిధిని కుదించిందని ఖర్గే పేర్కొన్నారు. గోప్యత పేరుతో అవినీతిని కాపాడే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అంతేకాదు, గత నెల (2025 డిసెంబరు) వరకు కేంద్ర సమాచార కమిషన్‌లో ప్రధాన కమిషనర్ పోస్టు ఖాళీగా ఉందని, గత 11 ఏళ్లలో ఇలా ఏడు సార్లు జరిగిందని ఆయన అన్నారు. ఇది ప్రభుత్వ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. కాంగ్రెస్- యూపీఏ హయాంలో తీసుకువచ్చిన విజిల్ బ్లోయర్ ప్రొటెక్షన్ చట్టం 2014, ఇప్పటివరకు అమలులోకి రాలేదని ఖర్గే గుర్తు చేశారు. అవినీతిని బయటపెట్టే వారికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

గోప్యత పేరుతో సమాచారం బయటకు చెప్పకుండా చేస్తున్నారని, ముఖ్యంగా రేషన్ కార్డు లబ్ధిదారులు, ఎంజీనరేగా కూలీలు, విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల వివరాలను గోప్యత పేరుతో ప్రభుత్వం దాచిపెడుతోందని ఆయన వాదించారు. ఈ కొత్త చట్టం ఆర్టీఐ ప్రజా ప్రయోజన అంశాలను తొలగించిందని, దీనిని అవినీతిని కప్పిపుచ్చడానికి వాడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

యూపీఏ ప్రభుత్వ హయాంలో పారదర్శకత లక్ష్యంగా 2005 అక్టోబర్ 12న ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చింది. 1990లలో రాజస్థాన్‌లో అరుణా రాయ్ నేతృత్వంలోని ఎంకేఎస్ఎస్ ఉద్యమం దీనికి పునాది వేసింది. కూలీలు తమ వేతనాల లెక్కల కోసం సాగించిన పోరాటం జాతీయ ఉద్యమంగా మారి, మన పైసా - మన లెక్క అనే నినాదంతో చట్టరూపం దాల్చింది. ఈ చట్టం ప్రకారం ఏ పౌరుడైనా ప్రభుత్వ సమాచారాన్ని కోరవచ్చు. అధికారులు 30 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలి. ఒకవేళ అది ఒక వ్యక్తి జీవితం లేదా స్వేచ్ఛకు సంబంధించినదైతే, కేవలం 48 గంటల్లోనే సమాచారం అందించాలి. అయితే దేశ భద్రత, విదేశీ సంబంధాలు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే కొన్ని అంశాలకు మాత్రం మినహాయింపు ఉంటుంది. 2జీ స్పెక్ట్రమ్, కామన్వెల్త్ గేమ్స్ వంటి భారీ కుంభకోణాలను వెలుగులోకి తెచ్చిన ఈ చట్టం, ప్రస్తుతం నిధుల కొరత, సవరణల వల్ల సవాళ్లను ఎదుర్కొంటోంది.

## అజిత్ పవార్ శాఖలపై సీఎంను కలిసిన ఎన్‌సీపీ నేతలు



ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ గత బుధవారంనాడు విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన చేతిలోని పదవుల విషయమై నేషనల్ కాంగ్రెస్ పార్టీ () నేతలు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను ఆయన నివాసమైన వర్ష బంగ్లాలో శుక్రవారంనాడు కలుసుకున్నారు. మహాయుతి కూటమి ప్రభుత్వంలోని ఎన్‌సీపీ కోటాలో భాగంగా అజిత్ చేతిలో కీలకమైన ఆర్థిక, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖలు కూడా ఉన్నాయి. ఆ పదవులను తమ పార్టీకే కేటాయించాలని కోరుతూ ఎన్‌సీపీ నేతలు సీఎంకు లాంఛనంగా ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు.

సీఎంతో సమావేశానంతరం ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ, తాము మహాయుతి కూటమిలో భాగస్వాములుగా ఉన్నందున అజిత్ పవార్ నిర్వహించిన శాఖలు సాధ్యమైనంత త్వరగా భర్తీ కావాలని కోరుకుంటున్నామని చెప్పారు. ఏ నిర్ణయం తీసుకున్నప్పటికీ ప్రజల సెంటిమెంట్లను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. అజిత్ పవార్‌ను కోల్పోయిన దుఃఖంలో కుటుంబ సభ్యులు ఉన్నారని, వారు కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని, పార్టీ భవిష్యత్ ప్రణాళికపై సునేత్ర పవార్, ఆయన కుటుంబ సభ్యులను త్వరలోనే సంప్రదిస్తామని తెలిపారు.

అజిత్ పవార్ ఆకస్మిత మృతితో ఎన్‌సీపీలో పలు ప్రశ్నలు తలెత్తాయి. శరద్ పవార్ సారథ్యంలోని ఎన్‌సీపీ (ఎస్‌పీ)తో తిరిగి ఎన్‌సీపీ విలీనం అవుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పార్టీ భవిష్యత్ నాయకత్వ పగ్గాలు ఎవరు చేపడతారనే దానిపై కూడా అనిశ్చితి ఉంది.

**శాసనసభా పక్ష సమావేశం** ఎన్‌సీపీ శాసనసభా పక్షం సమావేశం వచ్చే ఆదివారంనాడు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో అజిత్ భార్య, రాజ్యసభ ఎంపీ సునేత్ర పవార్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకునే అవకాశం ఉంది. పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎవరిని ఎన్నుకోవాలనే దానిపై కూడా శనివారంనాడు సమావేశం జరుగునున్నట్టు ఎన్‌సీపీ వర్గాలు చెబుతున్నాయి

మరోవైపు, రెండు పార్టీలు (ఎన్‌సీపీ-ఎన్‌సీపీఎస్‌పీ) తిరిగి ఏక కావాలన్నదే అజిత్ పవార్ చివరి కోరిక అని, ఇందుకు సంబంధించి ఆయన ఇటీవల శరద్ పవార్‌తో పలు సమావేశాలు జరిపారని ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత అనిల్ దేశ్‌ముఖ్ తెలిపారు. రాబోయే రోజుల్లో పవార్ కుటుంబం మొత్తం సమావేశమై పెండింగ్ అంశాలన్నింటిపైన చర్చ జరుపుతుందని చెప్పారు. కాగా, విలీనం దాదాపు ఖాయమేనని, లాంఛనంగా ప్రకటించడమే తరువాయి అని శరద్ పవార్ వర్గీయుడు ఏక్‌నాథ్ ఖడ్సే తెలిపారు.

## కెనడా విమానాలపై 50% టారిఫ్‌లు

- సుంకాల పేరుతో మరోసారి ట్రంప్ బెదిరింపులు
- కెనడా విమానాలపై 50 శాతం టారిఫ్‌లు విధిస్తానన్న ట్రంప్-
- గల్ఫ్ స్ట్రీమ్ ఏరోస్పేస్ జెట్లను కెనడా ధ్రువీకరించలేదని ఆగ్రహం
- అందుకే ప్రతీకార సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్ : అమెరికా కెనడా మధ్య వాణిజ్య సంబంధాలు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్‌ల ఆయుధాన్ని ఎత్తి చూపుతూ కెనడాపై కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అమెరికాలోకి దిగుమతయ్యే కెనడాకు చెందిన అన్ని విమానాలపై 50 శాతం సుంకాలు విధిస్తానని స్పష్టం చేశారు. జార్జియాలోని సవన్నా కేంద్రంగా పనిచేస్తున్న అమెరికా విమాన తయారీ సంస్థ గల్ఫ్‌స్ట్రీమ్ ఏరోస్పేస్ జెట్లకు కెనడా సర్టిఫికేషన్ ఇవ్వడంలో నిరాకరించడమే దీనికి కారణమని ట్రంప్ ఆరోపించారు. ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో ట్రంప్ తీవ్రంగా స్పందిస్తూ, కెనడా గల్ఫ్‌స్ట్రీమ్ ఉత్పత్తులను అమ్మకుండా అడ్డుకుంటోంది. వెంటనే ఈ పరిస్థితిని సరిచేయకపోతే కెనడా విమానాలన్నింటిపైనా 50% టారిఫ్ విధిస్తాం అని హెచ్చరించారు. కెనడాకు చెందిన ప్రముఖ విమాన తయారీ సంస్థ బాంబార్డియర్ తయారు చేసే గ్లోబల్ ఎక్స్‌ప్రెస్ బిజినెస్ జెట్లపై కూడా ఇదే సుంకాలు వర్తిస్తాయని తెలిపారు. అంతేకాదు, కెనడాలో తయారయ్యే అన్ని విమానాల ధృవీకరణను రద్దు చేసే చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ పరిణామాలతో రెండు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇటీవల కెనడా ప్రధాని మార్క్ కార్నీతో ట్రంప్‌కు ఉన్న విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. కెనడా చైనాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటే అమెరికాకు వచ్చే కెనడియన్ వస్తువులపై 100 శాతం సుంకాలు విధిస్తామని కూడా ట్రంప్ హెచ్చరించారు. కెనడా చైనాకు డ్రాప్ ఆఫ్ పోర్ట్ అవుతుందని భావిస్తే పొరపాటే అంటూ కఠిన వ్యాఖ్యలు చేశారు. చైనా కెనడా ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మింగేస్తుందని కూడా ఆరోపించారు. ఇదిలా ఉండగా, కెనడా ప్రధాని కార్నీ మాత్రం కెనడా సార్వభౌమాధికారాన్ని అమెరికా గౌరవించాలి అంటూ ట్రంప్ వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చారు. బీజింగ్ పర్యటనలో చైనాతో ఆర్థిక సహకారంపై చర్చలు జరిపిన కార్నీ, అమెరికాతో ఉన్న అనిశ్చితి కంటే చైనాతో సంబంధాలు స్థిరంగా ఉంటాయని వ్యాఖ్యానించడం గమనార్హం. చైనా కూడా కెనడా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించే దిశగా ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం.

**క్యూబాపై ట్రంప్ ఒత్తిడి**

మరోవైపు, ట్రంప్ క్యూబాపై కూడా ఆర్థిక ఒత్తిడి పెంచుతున్నారు. క్యూబాకు చమురు సరఫరా చేసే ఏ దేశంపైనైనా అదనపు టారిఫ్‌లు విధించేలా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద ఈ ఉత్తర్వులు జారీ చేశారు. క్యూబా ప్రభుత్వం అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా మారిందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం మెక్సికోపై కూడా ప్రభావం చూపుతోంది. ఇప్పటివరకు క్యూబాకు చమురు సరఫరాలో మెక్సికో కీలక పాత్ర పోషించింది. అయితే ఇటీవల మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ క్యూబాకు చమురు సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఇది అమెరికా ఒత్తిడితో తీసుకున్న నిర్ణయం కాదని, స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు.

ప్రస్తుతం క్యూబా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇంధన కొరత, విద్యుత్ కోతలు, ఆహార సమస్యలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. వెనెజువెలా సరఫరాలు తగ్గిపోవడం, మెక్సికో కూడా తగ్గించడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ తీసుకుంటున్న తాజా చర్యలు క్యూబాను పూర్తిగా ఒంటరిచేసే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ టారిఫ్ రాజకీయాలు ఉత్తర అమెరికా వాణిజ్య సమీకరణాలను కుదిపేస్తున్నాయి. కెనడా, మెక్సికో, క్యూబా దేశాలపై వరుసగా ఒత్తిడి పెంచుతూ అమెరికా తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునే దిశగా కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో అంతర్జాతీయ వాణిజ్య రంగంపై మరింత ప్రభావం చూపే అవకాశముంది.

### శబరిమల బంగారం చోరీ కేసులో

## నటుడు జయరామ్‌ను విచారించిన సిట్!

తిరువనంతపురం : శబరిమల ఆలయంలో బంగారం తాపడాల అదృశ్యం కేసులో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కుంభకోణానికి సంబంధించి ప్రముఖ నటుడు జయరామ్‌ను సిట్ విచారించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని ఆయన నివాసంలో ఈ విచారణ జరిగినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఉన్నికృష్ణన్ పొట్టి ప్రధాన నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. బంగారం పూత కోసం ఆలయం నుంచి తీసుకొచ్చిన తాపడాలతో 2019లో చెన్నైలో ఉన్నికృష్ణన్ నిర్వహించిన పూజల్లో జయరామ్ పాల్గొన్న వీడియోలు ఇటీవలే బయటికి వచ్చాయి. దీనికి సంబంధించి సిట్ ఆరా తీసినట్లు సమాచారం. ఉన్నికృష్ణన్‌తో కలిసి ఎన్నిసార్లు పూజల్లో పాల్గొన్నారని సిట్ బృందం నటుడిని ప్రశ్నించిందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. వీరి మధ్య ఏవైనా ఆర్థికలావాదేవీలు జరిగాయా అనే కోణంలో కూడా విచారించిందని వెల్లడించాయి. కేరళ ()లోని శబరిమల ఆలయంలో ద్వారపాలకుల విగ్రహాలు, గర్భగుడి తలుపుల నుంచి బంగారం అదృశ్యం కావడంపై సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసుకు సంబంధించి 12 మందిని సిట్ అరెస్టు చేసింది. నటుడు జయరామ్ 'అల వైకుంఠపురములో', 'హాయ్ నాన్న', 'గుంటూరు కారం', 'మిరాయ్', 'కాంతార: చాప్టర్1' వంటి పలు సినిమాల్లో కీలకపాత్రల్లో కనిపించారు.

## ఉక్రెయిన్‌పై వారం రోజుల పాటు దాడులు చేయకండి- ట్రంప్




ఉక్రెయిన్ : ఉక్రెయిన్‌పై కొనసాగుతున్న యుద్ధం మధ్య తాత్కాలిక విరామానికి సంకేతాలు కనిపిస్తున్నాయి. తీవ్ర శీతల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కీవ్ సహా ఇతర నగరాలపై ఒక వారం రోజుల పాటు దాడులు చేయవద్దని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిగతంగా కోరినట్లు వెల్లడించారు. తన అభ్యర్థనకు పుతిన్ అంగీకరించారని వైట్‌హౌస్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో తెలిపారు. అయితే ఈ విషయాన్ని క్రెమ్లిన్ ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు.

**కాల్పులు ఆపాలని పుతిన్ను కోరా!**

అసాధారణ చలికాలంలో కీవ్, ఇతర పట్టణాలపై కాల్పులు ఆపాలని పుతిన్‌ను నేను కోరాను. ఆయన అంగీకరించారు అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ కాల్ వల్ల ఫలితం ఉండదని చాలామంది చెప్పినా, ఆశ్చర్యకరంగా పుతిన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. దీంతో పౌరులకు కొంత ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**వింటర్ను ఆయుధంగా!**

ప్రస్తుతం ఉక్రెయిన్‌లో ఉష్ణోగ్రతలు మైనస్ 30 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రష్యా విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేయడంతో ఇప్పటికే విద్యుత్ కొరత తీవ్రంగా ఉంది. హీటింగ్, తాగునీటి సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని ఉక్రెయిన్ అధికారులు వింటర్‌ను ఆయుధంగా వాడటంగా అభివర్ణిస్తున్నారు.

ట్రంప్ ప్రకటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్పందిస్తూ, విద్యుత్ సరఫరా జీవనాధారం. దాడులు ఆగితే ప్రజలకు ఉపశమనం లభిస్తుంది అని పేర్కొన్నారు. శాంతి చర్చలకు ఇది సహకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే రష్యా మరో భారీ వైమానిక దాడికి సన్నద్ధమవుతోందని గూఢచారి నివేదికలు సూచిస్తున్నాయని హెచ్చరించారు. గతంలో 800కు పైగా డ్రోన్లు, క్షిపణులతో భారీ దాడులు జరిగాయని గుర్తుచేశారు. తాజాగా దక్షిణ ఉక్రెయిన్‌లోని జపోరిజ్జియా ప్రాంతంపై రష్యా జరిపిన డ్రోన్ దాడిలో ముగ్గురు పౌరులు మృతి చెందగా, ఒక అపార్ట్‌మెంట్ భవనం అగ్నికి ఆహుతైంది. డ్నిప్రోపెట్రోవ్‌స్క్ ప్రాంతంలో కూడా అగ్నిప్రమాదాలు సంభవించి ఇద్దరు గాయపడ్డారు. యుద్ధ విరామంపై చర్చలు జరుగుతున్నప్పటికీ నేలమీద దాడులు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

**జెలెన్స్కీ వస్తే పూర్తి భద్రత కల్పిస్తామన్న ట్రంప్!**

ఇదిలా ఉండగా, యుద్ధం ముగింపునకు దారితీసేలా శాంతి చర్చల ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇటీవల అబుదాబిలో అమెరికారష్యా ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఇప్పుడు మాస్కోలో చర్చలు జరపాలని రష్యా ఉక్రెయిన్‌ను ఆహ్వానించింది. జెలెన్స్కీ వస్తే పూర్తి భద్రత కల్పిస్తామని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. అయితే ప్రతిరోజూ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో చర్చలపై ఉక్రెయిన్ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇంకా రష్యా డ్రోన్లలో స్టార్‌లింక్ ఉపగ్రహ సేవలు వినియోగిస్తున్నారన్న ఆరోపణలపై ఉక్రెయిన్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పేస్‌ఎక్స్‌తో సంప్రదింపులు జరిపినట్లు రక్షణ మంత్రి మిఖాయిలో ఫెడోరోవ్ తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించినట్లు స్పేస్‌ఎక్స్ స్పందించింది. యూరోపియన్ యూనియన్ విదేశాంగ ప్రతినిధి కాజా కలాస్ మాట్లాడుతూ, రష్యా శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోవడం లేదని విమర్శించారు. యుద్ధంలో ముందుకు సాగలేక పౌర ప్రాంతాలపై దాడులు పెంచుతోందని ఆరోపించారు. ఉక్రెయిన్ భద్రత యూరప్ భవిష్యత్తుతో ముడిపడి ఉందని, చర్చల్లో యూరప్‌కు కీలక పాత్ర ఉండాలని స్పష్టం చేశారు.

అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన చర్చల్లో మంచి పురోగతి కనిపించిందని తెలిపారు. త్వరలో శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలపై ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే యుద్ధం వల్ల ఇరుపక్షాల సైనికుల మరణాలు, గాయాలు, గల్లంతు సంఖ్య వసంతకాలానికి 20 లక్షలకు చేరవచ్చని అంతర్జాతీయ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. మొత్తానికి ట్రంప్ జోక్యంతో ఒక వారం దాడులకు విరామం లభించే అవకాశమున్నా, నేలమీద పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉంది.

## గాజా బోర్డ్ ఆఫ్ పీస్..

### ఇండియా వైపు పాలస్తీనా చూపులు..



న్యూఢిల్లీ, జనవరి 30: గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌లో భాగం కావాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. అయితే బోర్డ్ ఆఫ్ పీస్‌లో చేరే విషయంపై భారత్ ఇప్పటి వరకూ స్పష్టత ఇవ్వలేదు. గాజా పాలస్తీనీయుల అంశంలో పలు సున్నితమైన అంశాలు ఉండడంతో ట్రంప్ ఆహ్వానం పై భారత్ ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌లో భారత్ చేరికపై పాలస్తీనా ఆశాభావం వ్యక్తం చేస్తోంది. బోర్డ్ ఆఫ్ పీస్‌లో భారత్ ఉంటే ఎంతో సహాయంగా ఉంటుందని పాలస్తీనా విదేశాంగ మంత్రి వర్సెన్ అఘాబెకియన్ షాహిన్ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన ఇండియా - అరబ్ ఫారెన్ మినిస్టర్స్ మీటింగ్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'మార్గం, తుది ఫలితాలు స్పష్టంగా ఉంటే గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌లో భారత్ చేరిక మా లక్ష్యానికి సహాయపడుతుంది. బోర్డ్ ఆఫ్ పీస్ భారత్ అవగాహనకు అనుగుణంగా శాంతి, అంతర్జాతీయ చట్టాలపై నిర్ణయం తీసుకుంటుంది' అని అన్నారు. గతంలో ట్రంప్ మాట్లాడుతూ.. గాజాను ఒక విలాసవంతమైన, పర్యాటక తీర ప్రాంతంగా మారుస్తామని అన్నారు.దీనిపై కూడా వర్సెన్ అఘాబెకియన్ షాహిన్ స్పందించారు. పునర్నిర్మాణానికి పాలస్తీనీయులు వ్యతిరేకం కాదని స్పష్టం చేస్తూనే, తమ ఖర్చుతో తమపై రుద్దే ఎలాంటి ఆలోచనకైనా తాము అంగీకరించబోమని చెప్పారు. శాంతి సాధన కోసం చేసే ఏ ప్రయత్నమైనా స్వాగతించదగినదేనని అన్నారు. ఆ ఆలోచన పాలస్తీనాను స్వతంత్రంగా ఉంచే పథకంలా ఉంటే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాష్ట్రపతిని అవమానించిన రాహుల్

- కండువాను రాహుల్ ధరించకపోవడం ప్రథమ పౌరురాలిని అగౌరపరచడమే
- అసోం రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను రాహుల్ గాంధీ పట్టించుకోవడంలేదు
- కేంద్ర మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ : అసోం రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టించుకోలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమంలో ఆమె బహూకరించిన గమోసా (కండువా)ను ధరించడానికి ఆయన నిరాకరించారని పేర్కొన్నారు. అది ఈశాన్య ప్రాంతాన్ని అగౌరవపరచడమేనని ఆయన అన్నారు. ఈ సందర్భంగా దిబ్రూఘర్‌లోని ఖనికర్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడారు. విదేశాల నుంచి వచ్చిన వారితో సహా ప్రముఖులందరూ గౌరవ సూచకంగా ఆ కండువాను ధరించారని, కానీ రాహుల్ గాంధీ మాత్రమే అలా చేయడానికి నిరాకరించిన ఏకైక వ్యక్తి అని షా పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తనకు నచ్చినట్లు ఉండవచ్చు కానీ, బీజేపీ అధికారంలో ఉన్నంత కాలం, ఈశాన్య ప్రాంత సంస్కృతిని ఏమాత్రం అగౌరవపరచడాన్ని సహించదని షా పేర్కొన్నారు.

### బైడెన్‌కు 7,750 విలువైన సిల్వర్ ట్రైన్ సెట్

## బహుమతిగా ఇచ్చిన పీఎం మోడీ

**-ఖరీదైన బహుమతుల జాబితాను విడుదల చేసిన అమెరికా విదేశాంగ శాఖ**




న్యూఢిల్లీ: అగ్రరాజ్యం అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ కు భారత ప్రధాని నరేంద్ర మోడీ అత్యంత విలువైన సిల్వర్ ట్రైన్ సెట్ ను గిఫ్ట్ గా ఇచ్చారు. అమెరికా విదేశాంగ శాఖ నివేదిక భారత నాయకులు అమెరికా అగ్ర రాజకీయ నాయకులకు ఇచ్చిన ఖరీదైన బహుమతుల వివరాలను వెల్లడించింది. నివేదిక ప్రకారం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూలై 2024లో అప్పటి అధ్యక్షుడు జో బైడెన్‌కు 7,750 విలువైన స్టెర్లింగ్ సిల్వర్ రైలు సెట్‌ను బహుమతిగా ఇచ్చారు, తరువాత దానిని నేషనల్ ఆర్కైవ్స్‌కు బదిలీ చేశారు.

స్టేట్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఆఫ్ ప్రోటోకాల్ కార్యాలయం విడుదల చేసిన ఈ నివేదిక, 2024 సంవత్సరంలో వివిధ ఏజెన్సీలకు నివేదించిన బహుమతుల వివరాలను వివరిస్తుంది. సెప్టెంబర్ 10, 2023న, ప్రధాన మంత్రి మోడీ అధ్యక్షుడు బైడెన్‌కు కండువాలు, కుంకుమ పువ్వు, వుడెన్ టీ బాక్స్‌ను బహుకరించారని, దీని విలువ 562 ఉంటుందని అంచనా వేయబడిందని వైట్ హౌస్ ప్రకటన పేర్కొంది. టీ, కుంకుమ పువ్వు వంటి పాడైపోయే వస్తువులు మినహా మిగిలిన వస్తువులను నేషనల్ ఆర్కైవ్స్‌కు అప్పగించారు. 2024 అక్టోబర్ 21న ప్రధాని మోడీ ప్రథమ మహిళ జిల్ బైడెన్‌కు 2,969 విలువైన పష్మినా శాలువాను బహూకరించారని, దానిని నేషనల్ ఆర్కైవ్స్‌కు కూడా బదిలీ చేశారని కూడా నివేదిక పేర్కొంది.

అదనంగా, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివన్‌కు 599 విలువైన కాశ్మీరీ పష్మినా స్కార్ఫ్‌ను బహుమతిగా ఇచ్చారు, దానిని జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్ ()కి అందజేశారు. ఈ నివేదికలో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పేరు కూడా ఉంది. అక్టోబర్ 18, 2024న ప్రధానమంత్రి మోడీ తనకు 1,330 విలువైన "లార్డ్ కృష్ణ రాస లీల" వెండి పెట్టెను బహుమతిగా ఇచ్చారని, దానిని నేషనల్ ఆర్కైవ్స్‌కు బదిలీ చేశారని అందులో పేర్కొన్నారు.అదే రోజు, ప్రధానమంత్రి మోడీ సెకండ్ జెంటిల్‌మన్ డగ్లస్ ఎమ్‌హాఫ్‌కు 585.65 విలువైన కఫ్‌లింక్‌లను కూడా బహుమతిగా ఇచ్చారు. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నవంబర్ 24, 2022న అప్పటి అమెరికా రక్షణ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్‌కు 3,700 విలువైన శివ నటరాజ కాంస్య విగ్రహాన్ని బహూకరించారని, ప్రస్తుతం దీనిని కి బదిలీ చేసే ప్రక్రియలో ఉన్నారని రక్షణ శాఖ ఎంట్రీ పేర్కొంది.

## డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్..

### నేడు ప్రమాణస్వీకారం



ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన భార్య, రాజ్యసభ సభ్యురాలు సునేత్ర పవార్ ( ) కొత్త డిప్యూటీ సీఎం కానున్నారు. ఎన్‌సీపీ జాతీయ అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నేత ప్రఫుల్ పగ్గాలు చేపడతారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సుదీర్ఘకాలం పనిచేసిన అజిత్ పవార్ చేతిలో ఆర్థిక, ప్రణాళిక, ఎక్సైజ్ శాఖలు కూడా ఉన్నాయి.

**శనివారం ప్రమాణస్వీకారం..**ఎన్‌సీపీ వర్గాల సమాచారం ప్రకారం. ఎన్‌సీపీ శాసనసభా పక్షం సమావేశం శనివారం జరుగుతుంది. ఈ సమావేశంలో సునేత్రను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంటారు. అనంతరం ముంబై రాజ్‌భవన్‌లో శనివారం మధ్యాహ్నం డిప్యూటీ సీఎంగా ఆమె ప్రమాణస్వీకారం చేస్తారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి రాజ్‌భవన్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి.మరోవైపు, ఎన్‌సీపీ రెండు వర్గాలు (ఎన్‌సీపీ, ఎన్‌సీపీఎస్‌పీ) విలీనం అవుతాయనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. రెండు వర్గాలు ఏకం కావాలన్నదే అజిత్ పవార్ చివరి కోరిక అని అజత్ పవార్ సన్నిహితుడు కిరణ్ గుజర్ తెలిపారు. ఈ క్రమంలో అజిత్ పవార్ చేతిలోని కీలక శాఖలను తమ పార్టీకే కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను ఎన్‌సీపీ కీలక నేతలు ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బుల్ శుక్రవారంనాడు కలుసుకున్నారు.

## తమిళ రాజకీయాల్లో దళపతి చక్రం తిప్పే ఛాన్స్



చెన్నై : తమిళనాడులో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలతోపాటు బీజేపీ కూడా తమిళనాడులో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాయి. ఈమేరకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. ఇక ఈసారి ఎన్నికల్లో సినీ స్టార్ విజయ్ పార్టీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే చివరి సినిమా విడుదల విషయంలో ఇబ్బందులు పడుతుండగా, తాజాగా వచ్చిన సర్వే ఫలితాలు విజయ్ పార్టీకి పెద్ద ఊరటనిచ్చాయి. ఇండియా టుడే, సీ ఓటర్ సర్వే ఫలితాలు వెల్లడయ్యాయి.

సర్వేలో టీవీకే బలమైన శక్తిగా..తాజా సర్వేలో ఇండీ+ కూటమి 45% ఓటర్ల మద్దతు సాధించగా, ఎన్డీఏకు 33% లభించింది. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన టీవీకే 15% ఓటర్లను ఆకర్షించింది. మిగిలిన 7% ఇతర పార్టీలకు విభజించబడింది. ఈ శాతం టీవీకేను గణనీయ శక్తిగా నిలబెట్టింది.

**విజయ్ ఫ్యాన్ బేస్ ఎలా పని చేస్తోంది?** విజయ్ మాస్ అప్పీల్, క్లీన్ ఇమేజ్ వల్ల పార్టీ పాపులారిటీ పెరిగింది. పట్టణ, యువత ప్రాంతాల్లో టీవీకే బలం కనిపిస్తోంది. ఇది సంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా యువత ఎంపిక చేసుకుంటున్నట్టు సూచిస్తోంది. తాజా సర్వే ఫలితాలు టీవీకే క్యాడర్‌కు ఎనర్జీ ఇస్తాయి. ప్రస్తుత ట్రెండ్ కొనసాగితే, కూటములు, ప్రభుత్వ ఏర్పాటులో టీవీకే కీలక పాత్ర పోషిస్తుంది. రాజకీయ విశ్లేషకులు టీవీకేను అతీతంగా చూస్తున్నారు. తమిళనాడు రాజకీయాల్లో కొత్త ఆకాంక్షకు టీవీకే సిద్ధమవుతోంది.

## విమానాలకు ఆగని బాంబు బెదిరింపులు..

### ఢిల్లీ వెళ్లాల్సిన ఇండిగో విమానం దారి మళ్లింపు!

ఢిల్లీ విమాన ప్రయాణాల్లో బాంబు బెదిరింపులు మళ్లీ కలకలం రేపుతున్నాయి. ఇటీవల వరుసగా విమానాలకు నకిలీ బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో, తాజాగా కువైట్ నుండి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానం లో బాంబు ఉన్నట్లు వచ్చిన సమాచారం ప్రయాణికులను, అధికారులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. గతంలో కూడా అనేక విమానాలకు ఇటువంటి బెదిరింపులు వచ్చినప్పటికీ, తాజా ఘటనతో విమానయాన భద్రతా సంస్థలు మరింత అప్రమత్తమయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున విమానం గాలిలో ఉండగా, అందులోని ఒక టిష్యూ పేపర్ మీద "బాంబు ఉంది, విమానం హైజాక్ అవుతుంది" అని రాసి ఉన్న చేతిరాత నోట్‌ను సిబ్బంది గుర్తించారు. వెంటనే పైలట్ అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి, అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. ఉదయం 6:40 గంటలకు విమానం అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయింది.విమానం ల్యాండ్ అయిన వెంటనే భద్రతా బలగాలు 180 మంది ప్రయాణికులను అత్యవసర ద్వారాల ద్వారా కిందికి దించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. సీఐఎస్ఎఫ్ (), స్థానిక పోలీసులు మరియు బాంబు స్క్వాడ్ బృందాలు విమానాన్ని అంగుళం అంగుళం తనిఖీ చేశాయి. కార్గో విభాగం, ప్రయాణికుల లగేజీని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు ప్రకటించారు. ఈ బెదిరింపు నోట్ వెనుక ఉన్న అసలు వ్యక్తుల కోసం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.వరుసగా వస్తున్న ఈ బాంబు బెదిరింపుల వల్ల విమానయాన సంస్థలకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లడమే కాకుండా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటువంటి నకిలీ బెదిరింపులకు పాల్పడే వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకువచ్చే ఆలోచనలో ఉంది.




# ధైర్యం ఉంటే కల్తీ లడ్డూపై అసెంబ్లీకి రండి

**జగన్‌కు సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య సవాల్**



ఏపీ స్టేట్‌బ్యూరో,అమరావతి : కోట్లమంది భక్తుల ఆరాధ్య దైవం తిరుపతి వెంకన్న లడ్డూ ప్రసాదాలలో కల్తీపై చర్చించేందుకు ధైర్యం ఉంటే, మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి రావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన గురునానక్ కాలనీలోని విజయవాడ ఎంపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. లడ్డూలో పాల చుక్క కొనని కంపెనీల నుంచి రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యి సరఫరా చేసి దేవుని సొమ్మును లూఠీ చేశారని సిట్ దర్యాప్తులో తేలితే, తేలు కుట్టిన దొంగల్లా నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని సిట్ తేల్చిందంటూ డొంక తిరుగుడు సమాధానాలు చెబుతున్నారని అన్నారు. 59 లక్షల 71 వేల కిలోల కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ పాపం మీది కాదా? అని ప్రశ్నించారు. హవాలా పద్దతిలో ఏజెంట్లను నియమించి కల్తీ నెయ్యి సేకరించారని, తద్వారా రూ. 234 కోట్లు దోచారని, టిటిడి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పిఏ చిన్నప్ప ఖాతాలో రూ. 4 కోట్ల 85 లక్షలు ఉన్నాయని ఆరోపించారు. భరత్ భాయ్ ఠాకూర్ అనే ఏజెంట్ ద్వారా విజయవాడ ప్రాంతంలోని వైసీపీ నాయకులకు కూడా రూ. 12 కోట్ల 55 లక్షలు అందాయని తెలిపారు. వీటిలో వైకాపా నాయకులు తలశిల రఘురాం, దేవినేని అవినాష్, జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు వాటాలు ఎంతో తేలాలని పేర్కొన్నారు. గత ఐదేళ్ళు హూ కిల్డ్ బాబాయి అంటే వైసీపీ నాయకులు ఒక్కరూ సమాధానం చెప్పలేదని, ఇప్పుడైనా హూ ఫీ చీటర్స్ ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. సిట్ విచారణలో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన కల్తీ దొంగలు ప్రభుత్వం పై నిందలు వేస్తూ రెచ్చి పోతున్నారని, తప్పు చేసిన వారికి ఎదురు దాడి చేయటం తప్ప మరో మార్గం ఏముంటుంది? అన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పుకు దేవదేవుని సన్నిధిలో పశ్చాత్తాపం చెందాలని, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని బాలకోటయ్య డిమాండ్ చేశారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, పార్టీ నేతలు మద్దిపట్ల సూర్యప్రకాశ్, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలు ఎప్పటికీ ఆచరణీయమని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పోషించిన పాత్ర అద్వితీయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త నడుచుకోవాలని పిలుపునిచ్చారు.
పేదరికం లేని, వివక్ష లేని సమాజ స్థాపన కోసం గాంధీజీ పడ్డ శ్రమను నేతలు గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ గాంధీజీ కలలుగన్న ప్రజాస్వామ్య విలువలకే కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు.. పలు రైళ్లు ఆలస్యం



సూర్యప్రతినిధి, ఒంగోళ : ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. గూడ్స్ రైలులోని వ్యాగన్లు పక్కనే ఉన్న రెండు రైల్వే ట్రాక్‌లపై పడిపోయాయి. దీంతో ఆ మార్గంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే శాఖ అధికారులు, సాంకేతిక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు.గూడ్స్ బోగీలు పట్టాలు తప్పడంతో.. విజయవాడ – చెన్నై ప్రధాన రైల్వే మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదం కారణంగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు వివిధ స్టేషన్లలో నిలిచిపోయాయి. దాంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రైల్వే ట్రాక్ పునరుద్ధరణకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

## నిరుద్యోగులకు ఉగాది తీపికబురు..!

- ఏపీలో మరో జాబ్ క్యాలెండర్‌కు ప్రభుత్వం కసరత్తు
- ఉగాదికి ఖాళీల భర్తీకి ఏపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ సిద్ధం
- ప్రభుత్వ శాఖల్లో ఖాళీలపై ప్రభుత్వం కసరత్తు
- రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించేందుకు సిద్ధమవుతోంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది నాటికి విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి సంబంధించి సమగ్ర జాబితాను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే టీచర్, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన ప్రభుత్వం, ఈసారి అన్ని శాఖల్లోని ఖాళీలను గుర్తించి పకడ్బందీగా జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని భావిస్తోంది. ఈ మేరకు ప్రతి శాఖ నుంచి ఖాళీ పోస్టుల వివరాలను సేకరిస్తూ, ఆర్థిక భారాన్ని కూడా సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలను సేకరిస్తూ.. జాబ్ క్యాలెండర్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారని తెలుస్తోంది. ఈ జాబ్ క్యాలెండర్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారట. ఇప్పటికే కొన్ని ఉద్యోగాలను భర్తీ చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు జాబ్ క్యాలెండర్ కోసం అన్నిశాఖల నుంచి ఉద్యోగ ఖాళీల వివరాలను సేకరిస్తోందని సమాచారం. ఈ కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేసిన సంగతి తెలిసిందే. అలాగే 6 వేల కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ప్రక్రియను పూర్తి చేసింది. ప్రతి ఏడాది అన్ని శాఖల్లోని ఖాళీలను గుర్తించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని నిర్ణయించింది. దీని కోసమే అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల జాబితాను సేకరించి.. వాటిని భర్తీ చేసే ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త ఉద్యోగాల భర్తీ చేపడితే ఆర్థిక శాఖపై పడే భారాన్ని.. ప్రస్తుతం ఉన్న ఖాళీల సంఖ్యను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. ఆ తర్వాతే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని భావిస్తున్నారు. వివిధ శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలు సేకరించే ప్రక్రియ మొత్తం పూర్తి చేసి ఉగాది నాటికి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉగాదినాటికి ఈ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి.. వీలైనంత త్వరగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై పూర్తి స్థాయిలో క్లారిటీ వస్తుందని చెబుతున్నారు. నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసంఎదురు చూస్తున్నారు. వాస్తవానికి గతేడాది విడుదల చేస్తారని భావించినా.. ప్రభుత్వానికి సాధ్యం కాలేదు.ఈసారి మాత్రం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ఖాయం అంటున్నారు.

# ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4

- సమాజానికి కొంత తిరిగి ఇచ్చినప్పుడే నిజమైన సంతృప్తి
- జన్మభూమికి ప్రవాసాంధ్రుల సేవలు స్ఫూర్తిదాయకం
- పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టు
- పదేళ్లలో గుంటూరు సహా అమరావతి రూపురేఖలు మారతాయి
- గుంటూరు జీజీహెచ్‌లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రూ.100 కోట్ల విరాళం సమకూర్చిన గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులకు సీఎం అభినందన

గుంటూరు, జనవరి 30:ఎంత ఎదిగినా జన్మభూమిని మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సంపాదించిన దాంట్లో కొంత సమాజసేవకు వినియోగిస్తే వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేనిదని సీఎం అన్నారు. గుంటూరు జీజీహెచ్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కానూరి–జింఖానా మాతా శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణం కోసం కాలేజీ పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళాలను సమకూర్చగా... ఎక్విప్మెంట్, ఫర్నిచర్ కోసం రూ. 27 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... 'సమాజంలో ఇంకా మంచి మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా నలభై, యాభై ఏళ్ల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడినవాళ్లు జన్మభూమిని మర్చిపోతారు. కానీ మీరంతా చదువుకున్న కాలేజీని గుర్తు పెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థ ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్నారు. అందుకు మీ అందర్నీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఆరోగ్య కేంద్రం నిర్మాణంతో పాటు భవిష్యత్ లో దాని నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం గొప్ప విషయం. మనతో పాటు సమాజం కూడా బాగుండాలన్నదే మన సంస్కృతి. ఇప్పటి వరకూ పాఠశాలలకు, ఆస్పత్రులకు, దేవాలయాలకు, సత్రాలకు, ఆట స్థలాలకు ఎంతోమంది దాతలు పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చారు. మనదేశ సంస్కృతి, సంప్రదాయాలు మరే దేశంలోనూ కనిపించవు. అమెరికాలోనైతే 18 ఏళ్లకే పిల్లలు బయటకు వెళ్లి స్వతంత్రంగా జీవిస్తారు. కానీ మనదేశంలో పిల్లలు ఎంత పెద్దవారైనా జీవితాంతం వారిని తల్లిదండ్రులు కనిపెట్టుకునే ఉంటారు. 1995లో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మెడిసిన్ చేసిన ఎంతోమంది అమెరికా వెళ్లేవాళ్లు. ఇది చూసి చాలామంది నాతో..బ్రెయిన్ డ్రెయిన్ అవుతోందన్నారు. రాబోయే రోజుల్లో బ్రెయిన్ గెయిన్ అవుతుందని వారికి చెప్పాను అని ముఖ్యమంత్రి అన్నారు. లిపేదల అభ్యున్నతి కోసం పీ4లి నేను జన్మభూమి కార్యక్రమానికి పిలుపునిచ్చినప్పుడు ఎంతోమంది ప్రవాసాంధ్రులు తాము పుట్టి పెరిగిన ఊరికి సాయం చేసేందుకు ముందుకొచ్చారు. మనందరం గ్రామీణ ప్రాంతాల్లో చిన్న కుటుంబాల్లో పుట్టినవారమే. అవకాశాలు అందిపుచ్చుకుని అంచెలంచెలుగా ఎదిగాం. రహదారులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ రంగంలో వేగవంతమైన అభివృద్ధికి పీ4 మోడల్ సరైందని కేంద్రం భావిస్తోంది. అయితే ధనిక, పేదల మధ్య వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి. నేను అందుకే పేదల అభ్యున్నతి కోసం పీ4 తీసుకొచ్చాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయి. చదువు అనేది గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలామ్ ఆర్థిక సాయంతోనే అత్యున్నత స్థాయికి ఎదిగారు. పీ4 కార్యక్రమం లక్ష్య సాధనలో 50 శాతం రీచ్ అయ్యాం. 10 లక్షల 42 వేల మందిని లక్షా 2 వేల మంది దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా పేదలకు ఆర్థిక



చేయూత అందించేందుకు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. లిదాతృత్వం గొప్పదిలి 'గుంటూరు మెడికల్ కాలేజీలో చదివిన వారిలో 8 మందికి పద్మశ్రీలు రావడం గొప్ప విషయం. మన రాష్ట్రంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ తర్వాత ఏర్పాటైన రెండవది గుంటూరు మెడికల్ కాలేజీనే. జీజీహెచ్ లో మాతా, శిశు ఆరోగ్య కేంద్రాన్ని 2,69,245 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 5 అంతస్తుల్లో ఏర్పాటు చేశారు. మొత్తంగా 600 బెడ్లు ఈ బ్లాకులో ఉన్నాయి. ప్రసూతి విభాగం 300 బెడ్లు, పిడీయాట్రిక్స్ విభాగంలో 200 బెడ్లు, ఇక చీ×జఖ, గా×జఖ, గా×జఖ వంటి విభాగాల్లో మిగిలిన బెడ్లు ఉన్నాయి. నిర్మాణం కోసం డాక్టర్ గవిని ఉమాదేవి రూ.22 కోట్లు, నళిని–వెంకట్ తేళ్ల రూ.8 కోట్లు, వాసిరెడ్డి రమాదేవి–కొండ్రగుంట వెంకట్రావు రూ. 4.32 కోట్లు, మొవ్వ వేదవతి–వెంకటేశ్వరరావు రూ. 4.04 కోట్లు, డాక్టర్ తేలికిచర్ల–గుడిమెడ కుటుంబాలు రూ. 3.60 కోట్లు, డాక్టర్ లక్ష్మీ–చౌదరి గంగ రూ.3.40 కోట్లు, బీనా నూతక్కి–గోపాలరావు రూ.3.20 కోట్లు ఇచ్చారు. పూర్వ విద్యార్థులు ఈ బ్లాక్ నిర్మాణంతో పాటు... గతంలో రూ.35 కోట్లను వెచ్చించి ఆడిటోరియం నిర్మించారు తులసీ సీడ్స్ సహా పలువురు దాతలు ముందుకొచ్చారు. గుంటూరు ఎంపీ , కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రూ.80 కోట్ల వరకూ విరాళాలు సేకరించి పనులు పూర్తి చేస్తున్నారు. నాట్కో కూడా 2017–18లో రూ. 47 కోట్లు , ఈ ఏడాది రూ.18 కోట్లు, క్యాన్సర్ చికిత్సకు రూ. 18 కోట్లు, ఇతరత్రా అవసరాలకు రూ. 12 కోట్లు ఖర్చు చేశారు. అలాగే గుంటూరులో మిలీనియమ్ బ్లాక్ కోసం రూ. 16 కోట్లు, విశాఖ ఏయూ మెడికల్ కాలేజీ బ్లాక్ నిర్మాణం కోసం రూ. 60 కోట్లు, కాకినాడ ఆస్పత్రికి రూ. 40 కోట్లు, కర్నూలు మెడికల్ కాలేజీకి రూ, 20 కోట్లు ఖర్చు చేయడం అభినందనీయం.' అని సీఎం చంద్రబాబు అన్నారు. లిమేటి నగరంగా అమరావతిలి అమరావతి నూతన గ్రీన్ ఫీల్డ్ నగరంగా అవతరిస్తోందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025–26 ఆర్థిక సర్వేలో స్పష్టం చేసింది. ప్రధాని మోదీ నాయకత్వంలో 2038 నాటికి ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం తయారవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో మనం ముందుకెళ్తున్నాం. రాజధానికి అంత భూమి ఎందుకు, 100 ఎకరాల్లో సచివాలయం కట్టేస్తే చాలని ఎంతోమంది అన్నారు. కానీ జాతికి గుర్తింపు



లభించాలన్నా, అన్ని ప్రాంతాలతో సమానంగా మనం ఉండాలన్నా అభివృద్ధి చెందాలి. కర్ణాటక రాష్ట్రానికి బెంగుళూరు, తమిళనాడుకు చెన్నై , తెలంగాణకు హైదరాబాద్ నగరాలున్నాయి. మనం అమరావతిని చిన్న నగరంగా వదిలేస్తే ఆర్థిక వ్యవస్థలో వెనకబడతాం. అందుకే హైదరాబాద్ కంటే మెరుగైన నగరం కట్టాలని నిర్ణయించాం. ఈ 30 ఏళ్లలో ప్రపంచంలో ఎంతో అభివృద్ధి జరిగింది. టెక్నాలజీలో పెను మార్పులు వచ్చాయి. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంది... మరి ఇండియాలో ఏముందని అడిగే వారికి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఉందన్నదే మన సమాధానం. ఆనాడు సైబరాబాద్ నిర్మించాం. నేడు క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు ఇళ్లలో కరెంటే ఉండేది కాదు ఇప్పుడు ఇంటిపైనే కరెంటు తయారు చేసుకుంటున్నాం. 1999లో నాటి అసెంబ్లీలో కరెంటు గురించే గంటల కొద్దీ చర్చలు జరిగేవి. అప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. విద్యుత్ రంగంలో మన దేశం నెంబర్ వన్ గా ఉండటం గర్వకారణం. అమెరికాలో కూడా నాలుగు గ్రిడ్ లు ఉండగా... ప్రపంచంలో సింగిల్ పవర్ గ్రిడ్ ఉండే ఏకైక దేశం మనదే. సోలార్ విండ్ పంపుడ్ స్టోరేజీకి శ్రీకారం చుడుతున్నాం. ఇంకో పదేళ్లలో గుంటూరు సహా అమరావతి ప్రాంత రూపురేఖలు ఎలా మారతాయో మీరే చూస్తారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు వస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీ ఉంటుంది. పొల్యూషన్ మాటే వినపడదు. 1995లో ఐటీని , 2000లో బయో టెక్నాలజీని ప్రమోట్ చేశాము. ఆనాడు జినోమ్ వ్యాలీకి భూములిచ్చి ప్రోత్సహించగా ఆ తర్వాత కాలంలో భారత్ బయోటెక్ కోవిడ్ వ్యాక్సిన్ అక్కడి నుంచే తయారు చేసిందని సీఎం అన్నారు. లిరాష్ట్రమంతటా సంజీవనిలి టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చి నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నాం. కుప్పంలో పైలట్ ప్రాజెక్టు అయింది. త్వరలో రాష్ట్రమంతటా విస్తరించి రోల్ మోడల్ గా మారుస్తాం. కుప్పంలో 70 వేల మందికి క్లినికల్ టెస్టులు చేశాం. 2026లో డిజిటల్ హెల్త్ రికార్డులు చేయడమే కాకుండా 72 లక్షలమంది రోగుల డేటా తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తున్నాం. నేడు కార్పొరేట్ ఆస్పత్రులు ఫైవ్ స్టార్ హోటళ్లను మించిపోతున్నాయి. రోగి చికిత్స ఖర్చు కంటే రూమ్ ఖర్చే ఎక్కువవుతోంది . త్వరలో ఎయిర్ అంబులెన్స్ లు వస్తున్నాయి. 2026లో డ్రోన్ అంబులెన్స్ తీసుకురావాలని అనుకుంటున్నాం. ప్రవాసాంధ్రులు అమెరికా నుంచి వర్చువల్ గా లేక ఇక్కడికి వచ్చినప్పుడు కానీ పేషెంట్లకు ట్రీట్‌మెంట్ చేసి, మెరుగైన వైద్య సేవలకు తగిన సూచనలు చేయాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి సత్యకుమార్ సహా పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# స్కూల్‌కు వెళ్లని ప్రతి పిల్లవాడు బాల కార్మికుడే

- బాలల హక్కుల ఉద్యమకారిణి పద్మశ్రీ శాంతా సిన్హా
- పిల్లలు ప్రతి కుటుంబానికి అత్యంత విలువైన సంపద అని వ్యాఖ్య

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పాఠశాల కు వెళ్లని ప్రతి పిల్లవాడిని బాల కార్మికుడిగా పరిగణించాల్సిందేనని, ఇది సమాజం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్య అని బాలల హక్కుల ఉద్యమకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత శాంతా సిన్హా అన్నారు. పిల్లలను కేవలం పాఠశాలకు చేర్చడమే తల్లిదండ్రుల బాధ్యత కాదని స్పష్టం చేశారు. పిల్లలు ప్రతి కుటుంబానికి అత్యంత విలువైన సంపద అని, వారి బాల్యాన్ని రక్షించడం, వారి ఆసక్తులను తెలుసుకుని పూరించడం, వారిలో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్నినిర్ధారించడం తల్లిదండ్రులతో పాటు సమాజం బాధ్యత కూడా అని శాంతా సిన్హా అన్నారు. పిల్లలను మొబైల్ ఫోన్లు, టాబ్ లకు అలవాటు చేయవద్దని సూచించారు. పాఠశాలల్లోనే కాకుండా ఇంట్లో కూడా నియంత్రణలేని డిజిటల్ వినియోగం పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగిస్తుందన్నారు. ఇది వారి సృజనాత్మకతను దెబ్బతీస్తుందని ఆమె పేర్కొన్నారు. నిజమైన అర్థంలో బాల్యాన్ని కాపాడాలంటే, పిల్లలు స్వేచ్ఛాయుతమైన, స్నేహపూర్వకమైన వాతావరణంలో జీవనానుభవాలతో, చిరస్మరణీయ జ్ఞాపకాలతో ఎదగాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన సిస్టర్ నివేదితా స్కూల్ 36వ వార్షికోత్సవ సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ అకాడమిక్ నెట్‌వర్క్ అధ్యక్షుడు డా. డబ్ల్యూ. జి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ బాల్యం అమూల్యమైనదని, తల్లిదండ్రులు తమ పిల్లలతో నాణ్యమైన సమయం గడపాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే పిల్లలకు ప్రకృతి పరిచయం మరియు పర్యావరణ అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. సిస్టర్ నివేదితా స్కూల్ చైర్మన్ డా. సుధాకర్ రావు పోల్సాని, సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డా. వెల్చల కొండలరావు అందిస్తున్న నిరంతర మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల అంకితభావం, కృషి వల్లే పాఠశాల విద్యా రంగంలో నిరంతరంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నదని తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డా. టి. లలిత వార్షిక ప్రగతి నివేదికను సమర్పించి, విద్యా మరియు సహపాఠ్య కార్యక్రమాల్లో విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన రంగుల



మయమైన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల కారస్పాండెంట్ హరిహర్ ప్రసాద్, కార్యదర్శి రమా దేవి పోల్సాని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, పీఆర్‌సీ, డీఏ చెల్లించండి



**ఆర్థిక శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీకి టీఎన్‌జీఓస్ కేంద్ర సంఘం వినతి**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : వచ్చేఅసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ, డీఆర్ లు , ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ , సీపీఎస్ రద్దు మరియు ఓపీఎస్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లులు మొదలైన వాటికి బడ్జెట్ కేటాయింపులను ప్రభుత్వం అందించేలా చూడాలని ఆర్థిక శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా కు టీఎన్‌జీఓస్ కేంద్ర సంఘం విన్నవించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం . హుస్సేని ముజీబ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకట్, క్లాస్– 4 అసోసియేషన్ సెక్రటరీ ఖాదర్ బిన్ హసన్, క్లాస్ 4 పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు గడ్డం జ్ఞానేశ్వర్ శుక్రువారం నాడు సచివాలయంలో కలుసుకున్నారు. గత సంవత్సర కాలంగా వీటి కోసం ప్రభుత్వం నుండి సహాయం అందుతుందని భావించినప్పటికీ నిధులు లేని కారణంగా ప్రభుత్వం పెండింగ్‌లో పెడుతోందని, కనీసం ఈ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలలోనైన ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఉద్యోగులకు కేవలం ఒక్క విడుత కరువు భత్యం విడుదల చేసి రెండు జాక్ లతో చర్చించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం 3 డీఏలు చెల్లిస్తారని ఉద్యోగులు భావించారన్నారు.
కానీ తెలంగాణ కేబినెట్ కేవలం ఒక్క డీఏ విడుదల చేసి మిగతావి పెండింగ్‌లోనే ఉంచిందన్నారు. తమకు పీఆర్సీ జాడ కూడా కనబడడం లేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టో లో పెండింగ్ లో ఉన్న డీఏలు తక్షణం చెల్లిస్తామని చెప్పి 10 నెలల తర్వాత కేవలం ఒక్క డీఏ విడుదల చేయడం సరికాదన్నారు.
మిగత 4 డీఏలు ఎప్పుడు చెల్లిస్తారు, 6 నెలల లోపు పీఆర్సీ అమలు చేస్తామని.. మరో ఆరు నెలలు పీఆర్సీ గడువు పొడగించారని, హెల్త్ కార్డ్స్, 317, సీపీఎస్, లాంటి సమస్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. మార్చ్ 24 నుంచి దాదాపు 6 వేల మంది ఉద్యోగులు రిటైరయ్యారని, వారికి రావాల్సిన గ్రాట్యుటీ, ఎన్ క్యాషమెంట్, ఇన్సూరెన్స్, జీపీఎఫ్ చెల్లించలేదని ఈ సమస్యను పరిష్కరించాలన్నారు.
పదవీ విరమణ తర్వాత ఉండే ఆర్థిక బాధల నుండి విముక్తి కలుగుతుందని ఆశించిన వారికి తీవ్ర నిరాశే ఎదురవుతోందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, ఆశా, అంగన్వాడీ ఐకేపీ, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత ఇస్తామని ఎన్నికల హామీలిచ్చారని, వచ్చే బడ్జెట్ సమావేశాలలో దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# తిరుమల లడ్డూ వివాదం

- పవిత్రతపై రాజకీయ యుద్ధం
- భక్తుల విశ్వాసంపై ప్రభావం
- సిట్ నివేదిక ప్రజలకు అందించాలనే అభిప్రాయం వెల్లడవుతోంది

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ నెయ్యి నాణ్యతపై వివాదం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో వేడెక్కింది. సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) నివేదికలో లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతు కొవ్వు లేదని వివరించింది. అయితే రెండు ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఈ అంశాన్ని తమ ప్రయోజనాలకు వాడుతున్నారు. దీని వల్ల భక్తుల విశ్వాసంపై ప్రభావం పడుతోంది. మొదటి నుంచి ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ లు లడ్డూలో వాడిన నెయ్యి కల్తీదేనని ప్రకటనలు చేయడం కొంత వరకు చర్చనీయాంశం అయింది. పూర్తి నివేదికలు, ఆధారాలు లేకుండా ఇరువురు నేతలు ప్రకటనలు చేస్తున్నారని, దీని వలన భక్తుల మనోభావాలు దెబ్బతింటాయనే అభిప్రాయాలు అప్పట్లోనే వ్యక్తం అయింది. కొత్తగా సిట్ ఇచ్చిన నివేదిక రాజకీయ పార్టీల్లో ప్రకంపనలు కలిగిస్తున్నాయి. ప్రధానంగా సిట్ ఇచ్చిన నివేదికలో లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతు కొవ్వు, అనుమానాస్పద పదార్థాలు లేవని వెల్లడి అయింది. భవిష్యత్తులో లడ్డూ తయారీ నాణ్యతను పెంచడానికి కఠిన నియమాలు అమలు చేయాలని సూచనలు చేసింది. ఈ నివేదిక తమకు అనుకూలంగా వచ్చిందనే రీతిలో వైసీపీ నేతలు బాహాటంగా విమర్శలు చేయడం ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని, తిరుమల పవిత్రతను రాజకీయ ప్రయోజనానికి వాడుతున్నారని ఆరోపణలు చేశారు. ఆ పార్టీ నేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు సతీమణి లక్ష్మి పార్వతి నాలుగు అడుగులు ముందుకేసి మరీ విమర్శలు చేశారు. టీడీపీ చేసిన అసత్య ప్రకటనలు, ఆరోపణలను ఖండిస్తూ వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డీజీపికి ఆ పార్టీ లేఖ రాసింది. అయితే టీడీపీ నేతలు మాత్రం ఈ పాపం మాది కాదని, వైసీపీ



ప్రభుత్వం కొనసాగిన సమయంలోనే లడ్డూకు వాడిన నెయ్యిలో నాణ్యత లేదనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నది. టీడీపీ ఏపీ ప్రజల అభ్యున్నతి, అభివృద్ధికె కట్టుబడి ఉందని, కుటిల రాజకీయాలకు ఆ పార్టీ దూరంగా ఉంటుందని తెలిపింది. భక్తుల విశ్వాసం, దేవాలయ పవిత్రత కాపాడడం తమ పార్టీ ముఖ్య ఉద్దేశ్యమని వివరించింది. అయితే సిట్ ఇచ్చిన నివేదికను ప్రజలకు అందించాలని విశ్లేషకులు కోరుతున్నారు. పవిత్రతను తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకు వాడకూడదని చెబుతున్నారు.

# నామినేషన్లు వేసే తేదీని పొడిగించాలి

- మున్సిపల్ ఎన్నికలపై బీసీ రాజ్యాధికార సమితి డిమాండ్
- బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తాం
- పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మున్సిపల్ ఎలక్షన్లలో నామినేషన్ వేసే తేదీని పొడిగించాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర జరుగుతున్న నేపథ్యంలో పోటీ చేయాలనుకున్న బిసి , ఎస్సి , ఎస్టీ ఆశావహులు మొక్కులలో నిమగ్నమైన వేళ నేటితోనే ఈ గడువును ముగించడం అట్టడుగు వర్గాల మనోభావాలను పరిగణన లోకి తీసుకోకపోవడమేనన్నారు. ఆర్టికల్ 324 ద్వారా ఏర్పాటైన ఎన్నికల కమిషన్ ఫ్రీ అండ్ ఫెయిర్ గా నిర్వహించాల్సిన ఎన్నికలను ఇంత హడావిడిగా నిర్వహించడం రాజ్యాంగ విలువలను భేఖాతరు చేయడమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అందుబాటులో లేని సమయంలో ఎన్నికల కమిషన్ తాను తీసుకున్న ఈ నిర్ణయాన్ని పునరాలోచించి నామినేషన్ గడువును పొడిగించాలన్నారు. ఇందుకోసం తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ వీ జీ ఆర్ నారగోని మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర హై కోర్ట్ పరిధిలో పెండింగ్‌లో ఉండగానే గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందని, అయితే పార్టీల గుర్తుతో సంబంధం లేకుండా ఎన్నికలు నిర్వహించినందున కేంద్ర ప్రభుత్వ నిధులు,స్థానిక పారిశుధ్య సమస్యల పరిష్కారం అవుతాయని తాము ప్రభుత్వానికి సహకరించామన్నారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాకముందే ఇప్పుడు పార్టీ గుర్తుపై జరిగే మున్సిపల్ ఎన్నికలను హడావిడిగా నిర్వహించడం వలన బీసీలు పెద్దఎత్తున నష్ట పోయే అవకాశం ఉందన్నారు.

# బీసీల సత్తా చాటాలి

- పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలనే గెలిపించుకోవాలి
- పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థులకు మద్దతు తెలిపాలి
- 42% రిజర్వేషన్లు మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: పట్టణ స్థానిక సంస్థల్లో బీసీల సత్తా చాటాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం బిసి సంక్షేమ సంఘం ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గవ్వల భరత్ కుమార్ మాట్లాడుతూ బీసీల రాజకీయ హక్కులు, సామాజిక న్యాయం కోసం ఇకపై రాజీలేని పోరాటం తప్పదని స్పష్టం చేశారు. బీసీలను మాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా బీసీలను మోసం చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. "బీసీలకు న్యాయం జరగాలంటే పార్టీలకు అతీతంగా ఆలోచించాలి. బీసీలను గెలిపించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలి. బీసీ వ్యతిరేక పార్టీలకు ఈసారి గట్టి గుణపాఠం చెప్పడం ఖాయం" అని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను గాలికొదిలేసిందని భరత్ కుమార్ ఆరోపించారు. బీసీల సంఖ్య జనాభాలో 50 శాతానికి పైగా ఉన్నా, రాజకీయంగా మాత్రం పక్కన పెట్టడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "బీసీలు ఇక మౌనంగా ఉండే పరిస్థితి లేదు. పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల నుంచి శాసనసభ, పార్లమెంట్ వరకు బీసీలకు సముచిత ప్రాతినిధ్యం దక్కే వరకు మా పోరాటం కొనసాగుతుంది. బీసీ సమాజం ఐక్యంగా నిలబడితే ఏ శక్తి మనలను ఆపలేదు" అని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించిన పార్టీలను ప్రజలు గుర్తుపెట్టుకుని తగిన తీర్పు ఇస్తారని గవ్వల భరత్ కుమార్ స్పష్టం చేశారు. బీసీల స్వరాజ్యమే లక్ష్యంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. ఈ సమావేశం లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ ముదిరాజ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ అభిలాష్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమేష్ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కశ్యపు యాదవ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు సుమన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# అరుదైన రికార్డు
# నిర్మల సొంతం

**వరుసగా 9వ సారి బడ్జెట్ ప్రవేశపెడుతున్న తెలుగింటి కోడలు**

**ఒకే ప్రధాని హయాంలో వరుస బడ్జెట్ లు ప్రవేశపెట్టిన మహిళా విత్తమంత్రి**

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026 ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఆమె వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సామాన్యుల నుంచి వ్యాపారవేత్తల వరకు అందరూ ఈ బడ్జెట్ కోసం ఎంతగానో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అస్థిర భౌగోళిక, రాజకీయ పరిస్థితుల మధ్య ఆర్థిక వృద్ధిని పెంచే లక్ష్యంతో సంస్కరణ చర్యలు బడ్జెట్‌లో ఉంటాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఇదే సమయంలో నిర్మలా సీతారామన్ ఓ అరుదైన రికార్డును సృష్టించబోతున్నారు. ఒకే ప్రధానమంత్రి పదవీకాలంలో తొమ్మిది సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఏకైక ఆర్థిక మంత్రిగా సీతారామన్ చరిత్ర సృష్టించబోతున్నారు. మరిన్ని వివరాలలోకి వెళితే...**



భారతదేశంలో మొట్టమొదటి బడ్జెట్‌ను బ్రిటీష్ పాలనలో ప్రవేశపెట్టారు. దీనిని ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ 1860 ఏప్రిల్ 7న చదివారు. స్వాతంత్ర్యం తర్వాత, భారతదేశపు తొలి ఆర్థిక మంత్రి ఆర్.కె. షణ్ముఖం చెట్టి 1947 నవంబర్ 26న తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అయితే అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. వేరు వేరు సమయాల్లో 10 బడ్జెట్‌లను దేశాయ్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. 1959-1964లో ఆర్థిక మంత్రిగా దేశాయ్ మొత్తం 6 బడ్జెట్‌లను, 1967-1969 మధ్య 4 బడ్జెట్‌లను పార్లమెంట్ లో చదివారు. ఆ తర్వాత మాజీ ఆర్థిక మంత్రులు పి. చిదంబరం, ప్రణబ్ ముఖర్జీ వేర్వేరు ప్రధానుల హయాంలో వరుసగా తొమ్మిది, ఎనిమిది సార్లు బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. అయితే నిర్మలా సీతారామన్ మాత్రం ఒకే ప్రధాని హయాంలో వరుసగా తొమ్మిది బడ్జెట్‌లను ప్రవేశపెట్టి, వరుసగా అత్యధిక బడ్జెట్‌లను ప్రవేశపెట్టిన రికార్డును క్రియేట్ చేయనున్నారు. 2019లో ప్రధానమంత్రి మోదీ రెండవసారి గెలిచినప్పుడు, ఆమె భారతదేశపు మొట్టమొదటి పూర్తికాల మహిళా ఆర్థిక మంత్రిగా నియమితులయ్యారు. 2024లో మోదీ మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆమెను ఆర్థిక మంత్రిగా కొనసాగించారు. ఇప్పటివరకు, ఆమె ఫిబ్రవరి 2024లో తాత్కాలిక బడ్జెట్‌తో సహా మొత్తం ఎనిమిది వరుస బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు.



**అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం:**
ఫిబ్రవరి 1, 2020న నిర్మలా సీతారామన్ చేసిన బడ్జెట్ ప్రసంగం రెండు గంటల 40 నిమిషాల పాటు సాగి, అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగంగా రికార్డు సృష్టించింది. ఆ సమయంలో, ఇంకా రెండు పేజీలు మిగిలి ఉండగానే ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.

**అత్యంత చిన్న బడ్జెట్ ప్రసంగం:**
1977లో హిరుభాయ్ ముల్జీభాయ్ పటేల్ చేసిన మధ్యంతర బడ్జెట్ ప్రసంగం కేవలం 800 పదాలతో ఇప్పటివరకు అత్యంత చిన్నదిగా ఉంది. మారిన సమయం: సాంప్రదాయకంగా బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి రోజున సాయంత్రం 5 గంటలకు ప్రవేశపెట్టేవారు. ఈ సమయం వలసవాద కాలం నాటి పద్ధతిని అనుసరించేది, దీనివల్ల ప్రకటనలు లండన్‌తో పాటు భారత్‌లోనూ ఒకే సమయం ఉండేలా చేసేవారు. 1999లో ఈ సమయాన్ని మార్చారు, అప్పటి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న యశ్వంత్ సిన్హా ఉదయం 11 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి, బడ్జెట్లను ఉదయం 11 గంటలకు ప్రవేశపెడుతున్నారు.

**తేదీ మార్పు:**
బడ్జెట్ సమర్పించే తేదీనీ 2017లో మార్చారు. పార్లమెంటరీ ఆమోద ప్రక్రియను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయడానికి, ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుండే బడ్జెట్‌ను అమలు చేయడానికి వీలుగా, ఈ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు.

**భారీ అంచనాలు**
. ఆదివారం సమర్పించబోయే బడ్జెట్‌పై దేశవ్యాప్తంగా సామాన్యులు, వేతన జీవులు మరియు పారిశ్రామిక వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఆదాయపు పన్ను రాయితీలు, సంక్షేమ పథకాలపై నిర్మలా సీతారామన్ ఎలాంటి ప్రకటనలు చేస్తారనేది ఉత్కంఠగా మారింది.

**ఈ సారి మార్పులు**
ఈసారి బడ్జెట్ ప్రాధాన్య అంశాల్లో కొన్ని మార్పులు చూడవచ్చు. ఆర్థిక
**నిపుణుల అంచనాల ప్రకారం**
టెక్నాలజీ, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, గ్రామీణాభివృద్ధి, ఎగుమతులు, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల పై ప్రత్యేక దృష్టి ఉండవచ్చు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, పెన్షన్ ఉత్పత్తులు వంటి రంగాలకు ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది. ఫిస్కల్ డెఫిసిట్‌ను నియంత్రణలో ఉంచుతూ వృద్ధిని 7-7.5 శాతం స్థాయిలో కొనసాగించేలా చర్యలు తీసుకోవచ్చు.

**ఆదివారం బడ్జెట్**
ఆదివారం బడ్జెట్ ప్రవేశం కావడంతో స్టాక్ మార్కెట్లు ఆ రోజు తెరుచుకునే అవకాశం ఉంది. , లు ప్రత్యేక సెషన్ నిర్వహించవచ్చని సమాచారం. గతంలో బడ్జెట్ రోజున మార్కెట్లు ప్రత్యేకంగా తెరిచిన సందర్భాలు ఉన్నాయి. ఈ నిర్ణయం ఆర్థిక మార్కెట్లపై తక్షణ ప్రభావం చూపుతుంది. బడ్జెట్ బాగుంటే.. స్టాక్ మార్కెట్లు దూసుకెళ్తాయి. చాలా సందర్భాల్లో ఇవి దూసుకెళ్తున్నాయి. 2017 నుంచి బడ్జెట్ ప్రవేశ తేదీని ఫిబ్రవరి 1కి మార్చినప్పటికీ ఈసారి ఆదివారం పడటం అరుదైన సంఘటన. గతంలో కొన్ని సందర్భాల్లో తేదీని మార్చినప్పటికీ.. ఈసారి ఫిబ్రవరి 1నే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే.. ఆర్థిక విషయాల్లో ఏమాత్రం ఆలస్యం ఉండకూడదు అని ప్రభుత్వం డిసైడ్ అయినట్లు కనిపిస్తోంది.మొత్తంమీద ఈ బడ్జెట్ దేశ ఆర్థిక ప్రగతికి కీలకమైనదిగా ఉంటుంది. వికసిత భారత్ లక్ష్యం వైపు మరింత బలంగా అడుగులు వేసే అవకాశం ఉంది. దేశ ప్రజలు ఈ బడ్జెట్ నుంచి పన్ను ఉపశమనం, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై ఆశలు పెట్టుకున్నారు. ఫిబ్రవరి 1న సీతారామన్ ప్రసంగం దేశ ఆర్థిక దిశను నిర్దేశించనుంది.

## భారత బడ్జెట్ ప్రస్థానం - మైలురాళ్లు



**భారతదేశ బడ్జెట్ చరిత్ర 160 ఏళ్ల నాటిది.**
**దీనికి సంబంధించిన కొన్ని కీలక ఘట్టాలు:**

తొలి బడ్జెట్ (బ్రిటిష్ కాలం): ఏప్రిల్ 7, 1860న జేమ్స్ విల్సన్ భారతదేశపు మొట్టమొదటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 1999 వరకూ భారత బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి రోజున సాయంత్రం 5 గంటల సమయంలో ఆర్థిక మంత్రులు ప్రవేశపెట్టేవారు. బ్రిటిష్ కాలమానానికి అనుగుణంగా ఇలా చేసేవారు. అయితే, ఈ ఆనవాయితీకి స్వస్తి చెప్పిన అప్పటి ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హా బడ్జెట్ ప్రవేశపెట్టే సమయాన్ని ఉదయం 11.00 గంటలకు మార్చారు. 2017లో ప్రభుత్వం బడ్జెట్ తేదీని ఫిబ్రవరి నెల చివరి నుంచి ఒకటవ తారీఖుకు మార్చింది. మార్చ్ నెలాఖరు నాటికి పార్లమెంటు ఆమోదం పొందేందుకు వీలుగా ఈ మార్పు చేసింది.

**స్వతంత్ర భారత తొలి బడ్జెట్:** నవంబర్ 26, 1947న తొలి ఆర్థిక మంత్రి ఆర్.కె. షణ్ముఖం చెట్టి స్వతంత్ర భారతావని తొలి పద్దును చదివారు. ఎక్కువ సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన దిగ్గజాలు: భారత బడ్జెట్ చరిత్రలో అత్యధిక సార్లు పద్దులు సమర్పించిన రికార్డు మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ పేరుతో ఉంది.

**మొరార్జీ దేశాయ్:**మొత్తం 10బడ్జెట్లనుప్రవేశపెట్టిఅగ్రస్థానంలో ఉన్నారు. పి. చిదంబరం: ఈయన మొత్తం 9 సార్లు బడ్జెట్ ప్రసంగాలు చేశారు.

**చిదంబరం :** మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం తొమ్మిది సార్లు బడ్జెట ్ను ప్రవేశపెట్టారు. ప్రధానమంత్రి హెచ్.డి. దేవెగౌడ నేతృత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో ఆయన మొదటిసారిగా మార్చి 19, 1996న బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2009లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు తిరిగి ఆర్థిక మంత్రి పదవిని చేపట్టారు. నిర్మలా సీతారామన్: ఈ ఏడాది బడ్జెట్‌తో చిదంబరం రికార్డును ఆమె సమం చేయనున్నారు.

**ప్రణబ్ ముఖర్జీ:** మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక మంత్రిగా తన పదవీకాలంలో ఎనిమిది బడ్జెట్లను ప్రవేశపెట్టారు. ఆయన 1982, 1983, 1984లో బడ్జెట్లను ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో 2009, ఫిబ్రవరి, 2012 నుంచి మార్చి 2012 మధ్య వరుసగా ఐదు బడ్జెట్లను ప్రవేశపెట్టారు.

**మన్మోహన్ సింగ్:** ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పేరుగాంచిన మన్మోహన్ సింగ్, 1991-1995 మధ్య వరుసగా 5 బడ్జెట్లను ప్రవేశ పెట్టారు పి.వి. నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు 1991-1995 మధ్య వరుసగా ఐదు బడ్జెట్లను ప్రవేశపెట్టారు.



# సూర్య స్పోర్ట్స్

# క్రికెట్‌కు ఏఐ టచ్

### ఐసీసీ - గూగుల్ భాగస్వామ్యం




క్రికెట్ మ్యాచ్‌ల్లో అత్యుత్తమ అనుభూతి కోసం ఐసీసీ (International Cricket Council)తో గూగుల్ జట్టు కట్టింది. ఈ ఒప్పందంతో క్రికెట్‌ను మరింత లోతుగా విశ్లేషించేందుకు వీలుకానుంది. ప్రత్యక్ష మ్యాచ్‌ల వీడియో, ఆడియో వ్యాఖ్యానాన్ని అడ్వాన్స్‌డ్ ఏఐ జెమిని 3 ప్రో విశ్లేషించనుంది. దీంతో అభిమానులు మ్యాచ్‌లను మరింతగా ఆస్వాదించేందుకు వీలుపడనుంది. ఈ మేరకు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. "ఇప్పుడు గూగుల్ (Google).. మీ గూగ్లీకి సహాయం చేస్తుంది" అని పేర్కొన్నారు. ఏఐ జెమిని 3 ప్రో లైవ్ మ్యాచ్‌ను గమనించి, కామెంటరీని విని, ఏం జరిగిందనేది సరళమైన భాషలో ఫ్యాన్స్‌కు వివరిస్తుంది. మ్యాచ్ హైలైట్స్, ఆటగాళ్లు, ఆటకు సంబంధించి ఇతర ఆసక్తికర విషయాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచనుంది. ఈ అధునాతన సాంకేతితకతను వాడి, మహిళల క్రికెట్‌ను మరింతగా అభిమానులకు చేరువ చేయడం కూడా ఈ భాగస్వామ్యం ఉద్దేశం.

# ఆస్ట్రేలియన్ ఫైనల్‌కు సబలెంకా



మెల్‌బోర్న్: టాప్ సీడ్ అరినా సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక్కడ మూడో టైటిల్‌పై కన్నేసిన ఈ బెలారస్ అమ్మాయి సెమీఫైనల్లో 6-2, 6-3తో ఉక్రెయిన్‌కు చెందిన స్వితోలినాను చిత్తుగా ఓడించింది. సబలెంకాకు ఇది వరుసగా నాలుగో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ కావడం విశేషం. 2023, 2024లో టైటిల్ గెలిచిన ఆమె.. నిరుడు తుది పోరులో పరాజయం పాలైంది. సబలెంకా సెమీస్‌లో స్వితోలినాపై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సెమీస్ చేరే క్రమంలో ఇద్దరు టాప్-10 ప్లేయర్లను ఓడించిన 12వ సీడ్ స్వితోలినా.. సబలెంకా పవర్ హిట్టింగ్ ముందు నిలవలేకపోయింది. ఆమె చేతిలో స్వితోలినాకు ఇది వరుసగా ఆరో ఓటమి. సబలెంకా ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క సెట్ కూడా కోల్పోలేదు. ఆమె వరుసగా 11 మ్యాచ్‌ల్లో గెలిచింది. సబలెంకా గురువారం సెమీఫైనల్లో 29 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. సర్వీసులో 11 పాయింట్లు మాత్రమే జారవిడిచింది. మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసిన స్వితోలినా.. 17 అనవసర తప్పిదాలు చేసింది. 12 విన్నర్లు మాత్రమే కొట్టింది. ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్లో ఆరంభం నుంచీ సబలెంకాదే ఆధిపత్యం. ఆమె బలమైన ఫోర్ హ్యాండ్ షాట్లతో విరుచుకుపడింది. నాలుగో గేమ్‌లో బ్రేక్‌తో 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన సబలెంకా.. ఆ తర్వాత సర్వీసులు నిలబెట్టుకుని 5-2తో నిలిచింది. ఏడో గేమ్‌లో తిరిగి బ్రేక్ సాధించి సెట్‌ను చేజిక్కించుకుంది. అయితే రెండో సెట్లో తొలి గేమ్‌లోనే సబలెంకా సర్వీసును బ్రేక్ చేసిన స్వితోలినా.. పుంజుకున్నట్లు కనిపించింది. కానీ ఆమె ఆనందం ఎంతోసేపు నిలవలేదు. బలంగా పుంజుకున్న సబలెంకా.. నాలుగు, ఆరో గేముల్లో బ్రేక్‌లు సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ప్రత్యర్థికి ఎలాంటి అవకాశమివ్వలేదు. ఏడో గేమ్‌లో సర్వీసు నిలబెట్టుకుని 5-2తో నిలిచిన సబలెంకా.. తొమ్మిదో గేమ్‌లో మ్యాచ్‌ను ముగించింది. మార్టిన్ హింగిస్ (2002) తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా నాలుగుసార్లు ఫైనల్ చేరిన తొలి ప్లేయర్‌గా సబలెంకా ఘనత సాధించింది. "దీన్ని నేను నమ్మలేకపోతున్నా. ఇదో గొప్ప ఘనత. కానీ నా పని ఇంకా పూర్తి కాలేదు" అని సెమీఫైనల్ అనంతరం ఆమె వ్యాఖ్యానించింది.శనివారం జరిగే ఫైనల్లో సబలెంకా.. కజకిస్థాన్ అమ్మాయి రిబకినాను ఢీకొంటుంది. సెమీఫైనల్లో రిబకినా 6-3, 7-6 (9-7)తో ఆరో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా)పై విజయం సాధించింది. తొలి సెట్‌ను తేలికగా గెలుచుకున్న రిబకినా.. రెండో సెట్లో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొంది. హోరాహోరీ పోరులో టైబ్రేక్‌లో సెట్‌ను గెలుచుకుని రిబకినా ఫైనల్లో అడుగుపెట్టింది. పెగులా రెండు సెట్ పాయింట్లు సాధించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఈ మ్యాచ్‌లో రిబకినా 6 ఏస్‌లు, 31 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. మహిళల సింగిల్స్ ఫైనల్ రసవత్తరంగా సాగడం ఖాయం. 2023 ఫైనల్లో సబలెంకా చేతిలో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవడానికి రిబకినాకు ఇది చక్కని అవకాశం. సబలెంకాతో ముఖాముఖి పోరులో ఆమె 6-5తో ఆధిక్యంలో ఉండడం విశేషం.

**సినర్‌తో జకోవిచ్ ఢీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో ఆసక్తికర సమరానికి వేళైంది. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో పదిసార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా).. డిఫెండింగ్ ఛాంపియన్ యానిక్ సినర్ (ఇటలీ)ను ఢీకొంటాడు. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన 37 ఏళ్ల జకోవిచ్‌కు 24 ఏళ్ల సినర్‌తో పోరు ఎంతో కఠినమైందే. ఈ టోర్నీలో నాలుగో రౌండ్లో వాకోవర్ పొందిన జకోవిచ్‌కు క్వార్టర్స్‌లోనూ అదృష్టం కలిసొచ్చింది. రెండు సెట్లు గెలిచి ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి ముసెటి గాయం కారణంగా వైదొలిగాడు. మరోవైపు ప్రపంచ నంబర్ 2 సినర్ సూపర్ ఫామ్‌తో సెమీస్ చేరుకున్నాడు. జకోవిచ్‌తో ముఖాముఖి పోరులో సినర్ 6-4తో ఆధిక్యంలో ఉన్నాడు. మరో సెమీఫైనల్లో మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ)తో ప్రపంచ నంబర్‌వన్ అల్కరాస్ (స్పెయిన్) తలపడతాడు.

# డూ ఆర్ డై మ్యాచ్

### ముంబయి VS గుజరాత్



వడోదర: మహిళల ప్రిమియర్ లీగ్‌లో కీలక పోరు జరగనుంది. టాప్ -3లో చోటు సంపాదించాలంటే ముంబయి ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్‌కు ఈ మ్యాచ్ ఫలితం అత్యంత ముఖ్యం. ఈ క్రమంలో టాస్ నెగ్గిన గుజరాత్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్లకు ఇదే చివరి పోరు. ప్రస్తుతం గుజరాత్, ముంబయి చెరో ఏడేసి మ్యాచ్‌లు ఆడాయి. గుజరాత్ ఖాతాలో 8 పాయింట్లు, ముంబయి ఖాతాలో 6 పాయింట్లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో గుజరాత్ గెలిస్తే.. నాకౌట్‌కు చేరుకోవడం ఖాయం. ఒకవేళ ముంబయి విజయం సాధిస్తే మాత్రం దిల్లీ - యూపీ మ్యాచ్ ఫలితంతో ప్లేఆఫ్స్ స్థానాలు ఎవరికో తేలనుంది. ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండు, మూడు స్థానాల కోసం మిగతా జట్లు తలపడుతున్నాయి.

**తుది జట్లు :** ముంబయి: హీలే మాథ్యూస్, సజీవన్ సజన, నాట్ సివర్ బ్రంట్, హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), అమన్ జోత్ కౌర్, అమెలియా కెర్, రహిలా ఫిర్దోస్, సంస్కృతి గుప్తా, వైష్ణవి శర్మ, షబ్నిం ఇస్మాయిల్, పూనమ్.

**గుజరాత్:** బెత్ మూనీ, సోఫీ డివైన్, అనుష్క శర్మ, ఆష్లే గార్డెనర్ (కెప్టెన్), జార్జియా వార్హమ్, భార్తి ఫుల్మాలి, కనిక అహుజా, క్షీవ్ గౌతమ్, రేణుకా సింగ్ ఠాకూర్, రాజేశ్వరి గైక్వాడ్.

# వరల్డ్ కప్ వేదికపై మరోసారి శతకం...

### 16 ఏళ్ల వెయిటింగ్‌కు ఫుల్ స్టాప్ సంజు పెట్టేనా?

వరల్డ్ క్రికెట్‌లో టీమ్ ఇండియా బ్యాటర్లు ఈమధ్య పరుగుల వరద పారిస్తున్న విషయం తెలిసిందే. ఐపీఎల్ అయినా, అంతర్జాతీయ మ్యాచులు అయినా సెంచరీలతో విరుచుకుపడుతుంటారు. కానీ వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, టీ20 వరల్డ్ కప్ వేదికపై మాత్రం మనోళ్లు సెంచరీ కొట్టి 16 ఏళ్లు దాటిపోయింది. 2024లో మనం వరల్డ్ కప్ గెలిచినా, ఒక్కరు కూడా వంద మార్కును అందుకోలేకపోయారు. ఇప్పుడు 2026 మెగా టోర్నీకి సమయం దగ్గర పడింది. ఈ తరుణంలో మన యంగ్ బ్యాటర్లు రెండవ సెంచరీ రికార్డును అందుకుంటూరా చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఒక టాలెంటెడ్ ప్లేయర్ పేరు ఇప్పుడు మారుమోగుతోంది.

**సురేష్ రైనా ఏమన్నారంటే?**

టీ20 వరల్డ్ కప్‌లో భారత్ తరపున మొట్టమొదటి సెంచరీ సాధించిన రికార్డ్ సురేష్ రైనా పేరిట ఉంది. 2010లో సౌత్ ఆఫ్రికాపై ఆయన ఈ ఘనత సాధించారు. ఇప్పుడు మళ్లీ అదే రైనా, సంజు శాంసన్?పై తన నమ్మకాన్ని ప్రకటించారు. "ఈ వరల్డ్ కప్‌లో సంజు సెంచరీ సాధించే అవకాశం ఉంది. అతను ఓపెనర్‌గా వస్తున్నాడు, పైగా కావాల్సిన టాలెంట్ ఉంది" అని రైనా పేర్కొన్నారు. ఇప్పటికే సౌత్?ఆఫ్రికా గడ్డపై రెండు సెంచరీలు బాదిన అనుభవం సంజుకు ఉందని, అందుకే ఆ 16 ఏళ్ల కరవును తీరుస్తాడని రైనా బలంగా నమ్ముతున్నారు.

**ఫామ్ తాత్కాలికమే, క్లాస్ శాశ్వతం**

ప్రస్తుతం సంజు శాంసన్ ఫామ్ కొంచెం ఆందోళన కలిగిస్తోంది. గత నాలుగు మ్యాచుల్లో అతను చేసిన స్కోర్లు 11, 10, 6, 0, 24 మాత్రమే. అయితే రైనా దీనిపై స్పందిస్తూ "ఫామ్ అనేది తాత్కాలికం, కానీ సంజు క్లాస్ ప్లేయర్. సూర్యకుమార్ యాదవ్ కూడా ఒక ఏడాది పాటు సరిగ్గా ఆడలేదు, కానీ కోచ్ ఆయనను నమ్మారు. సంజు విషయంలో కూడా అదే జరుగుతుంది" అని మద్దతుగా నిలిచారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో సంజు ఇప్పటివరకు 56 మ్యాచ్‌ల్లో 1072 పరుగులు చేశారు.

ఆయన స్ట్రైక్ రేట్ (147.86) కూడా టీ20 ఫార్మాట్‌కు తగ్గట్టుగా అద్భుతంగా ఉంది.ఓపెనర్‌గా సంజు, అదిరిపోయే అవకాశం వచ్చే వరల్డ్ కప్‌లో సంజు శాంసన్, అభిషేక్ శర్మ కలిసి ఓపెనింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీ20ల్లో ఓపెనర్‌గా రావడం అంటే ఎక్కువ బంతులు ఆడే ఛాన్స్ దక్కుతుంది. అదే జరిగితే సెంచరీ సాధించడం సంజుకు పెద్ద కష్టమేమీ కాదు. ఐపీఎల్‌లో కూడా ఆయన ఎన్నో మెరుపు ఇన్నింగ్స్?లు ఆడాడు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ లాంటి యంగ్ గన్స్ ఉన్నా, సంజు తన అనుభవంతో ఈసారి హిస్టరీ క్రియేట్ చేస్తాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. పవర్‌ప్లేలో ఆయన బాదే షాట్లు ప్రత్యర్థి టీమ్ కు వణుకు పుట్టించడం ఖాయం.

**ఫామ్‌లోకి రావడానికి లాస్ట్ ఛాన్స్**

వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు సంజుకు తన ఫామ్‌ను నిరూపించుకోవడానికి జనవరి 31న న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్ చాలా ముఖ్యం. ఈ మ్యాచ్‌తో ఆయన మళ్ళీ పాత సంజులా కనిపిస్తే, ఫిబ్రవరి 7న అమెరికాతో జరిగే మొదటి వరల్డ్ కప్ మ్యాచ్‌కు ఆత్మవిశ్వాసంతో వెళ్లొచ్చు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమ్ ఇండియాకు ఓపెనర్లు ఇచ్చే ఆరంభమే కీలకం కానుంది. రైనా చెప్పినట్లుగా సంజు సెంచరీ కొడితే, అది కేవలం అతనికే కాదు, మొత్తం టీమ్ ఇండియాకు పెద్ద బూస్ట్ అవుతుంది.

**ఆ 16 ఏళ్ల వెయిటింగ్‌కు ఎండ్ కార్డ్ పడుతుందా?**

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లు లేని మొదటి టీ20 వరల్డ్ కప్ ఇది. అందుకే యంగ్ ప్లేయర్లపై బాధ్యత ఎక్కువగా ఉంది. 2010 నుండి ఇప్పటివరకు జరిగిన అన్ని వరల్డ్ కప్‌ల్లో మన బ్యాటర్లు 80లు, 90లు దాటినా సెంచరీ వరకు వెళ్లలేకపోయారు. ఇప్పుడున్న అగ్రెసివ్ క్రికెట్ ట్రెండ్‌లో సంజు శాంసన్ ఆ అడ్డంకిని దాటగలడని విశ్లేషకులు భావిస్తున్నారు.

సంజుకు ఉన్న క్లీన్ హిట్టింగ్ సామర్థ్యం, స్టేడియం ఏ మూలకైనా సిక్సర్లు కొట్టగలిగే టాలెంట్ అతన్ని ఈ రేసులో ముందంజలో ఉంచింది. మరి సురేష్ రైనా నమ్మకాన్ని సంజు నిజం చేస్తాడా? లేక అభిషేక్ శర్మ లాంటి కుర్రాళ్లు ఎవరైనా ముందుగా సెంచరీ కొట్టి రికార్డు సృష్టిస్తారా? అనేది చూడాలి. ఏది ఏమైనా ఈసారి టీమ్ ఇండియా బ్యాటర్ల నుంచి ఒక భారీ ఇన్నింగ్స్ అయితే ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.




# తాడికొండలో ఫుల్ జోష్



గుంటూరు జిల్లా తాడికొండలో ఈనాడు స్పోర్ట్స్ లీగ్ ఉత్సాహం ఈనాడు స్పోర్ట్స్ లీగ్ 15వ సీజన్‌లో భాగంగా టెక్నాలజీ మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు మూడో రోజు గురువారం కూడా ఫుల్ జోష్‌తో సాగాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో హైదరాబాద్ హీరోస్ జట్లు దూసుకెళ్లాయి. బౌలర్లు బంతులతో బ్యాటర్లను హోల్డ్ చేయగా, బ్యాటర్లు బౌండరీలు, సిక్సర్లతో మైదానాన్ని మోత మోగించారు. మ్యాచ్ చూసేందుకు వచ్చిన విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. జట్టు సమష్టి ప్రదర్శనతో విజయాలు నమోదు చేసుకుంటూ ముందంజలో నిలిచారు.జూనియర్స్ విభాగంలో రాయలసీమ రాకర్స్- హైదరాబాద్ హీరోస్ మధ్య జరిగిన మ్యాచ్‌కు చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి వై. సుజిత్ టాస్ వేశారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులందరినీ పరిచయం చేసుకున్నారు. ఈ కళాశాల ఛైర్మన్ వై.వి. ఆంజనేయులు మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. 'ఈనాడు' గుంటూరు యూనిట్ మేనేజర్ ఎం. వెంకటేశ్వర్లు మొత్తం ఏర్పాట్లను పర్యవేక్షించారు.సీనియర్స్ విభాగం హైదరాబాద్ హీరోస్ సులభ విజయం సీనియర్స్ విభాగంలో హైదరాబాద్ హీరోస్( టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ), రాయలసీమ రాకర్స్( సికామ్ కాలేజీ) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన హైదరాబాద్ హీరోస్ బౌలింగ్ ఎంచుకుంది. ఏడుగురు ఆటగాళ్లతోనే బరిలోకి దిగిన రాయలసీమ రాకర్స్ జట్టు 13.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి కేవలం 69 పరుగులకే పరిమితమైంది.హైదరాబాద్ హీరోస్ బౌలర్లు వరుణ్, మధువీర్‌ల అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. అనంతరం లక్ష్య ఛేదనలో హైదరాబాద్ హీరోస్ 5.2 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. కెప్టెన్ గౌరవ్‌రెడ్డి 18 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 40 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. 11 పరుగులిచ్చి 4 వికెట్లు తీసిన వరుణ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

**సీనియర్స్ మ్యాచ్ రద్దు**

సీనియర్స్ విభాగంలో సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్, నార్త్ ఆంధ్రా నింజాస్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు నార్త్ ఆంధ్రా జట్టు హాజరుకాకపోవడంతో అంపైర్లు సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్‌ను విజేతగా ప్రకటించారు.జూనియర్స్ విభాగం సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ గెలుపు జూనియర్స్ విభాగంలో సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్, నార్త్ ఆంధ్రా నింజాస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛాలెంజర్స్ విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సెంట్రల్ ఆంధ్రా జట్టు 16 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనకు దిగిన నార్త్ ఆంధ్రా నింజాస్ జట్టు సెంట్రల్ ఆంధ్రా బౌలర్ల ధాటికి 57 పరుగులకే కుప్పకూలింది.

మూడు కీలక వికెట్లు తీసిన వైభవ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అదే జట్టుకు చెందిన రామ్‌చరణ్ 24 బంతుల్లో 39 పరుగులు చేశాడు. నార్త్ ఆంధ్రా తరఫున సాయి గణేష్ 4 వికెట్లు తీశాడు.2. జూనియర్స్ విభాగం **హైదరాబాద్ హీరోస్ ఘన విజయం**

జూనియర్స్ విభాగంలో హైదరాబాద్ హీరోస్, రాయలసీమ రాకర్స్ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ హీరోస్ ఆధిపత్యం చెలాయించింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ హీరోస్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయలసీమ రాకర్స్ జట్టు హైదరాబాద్ హీరోస్ బౌలర్ల ప్రతిభకు 110 పరుగులకే ఆలౌటైంది. ఆల్‌రౌండర్ ఆదిత్య బ్యాటింగ్‌లో 39 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో 3 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించడంతో పాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కూడా దక్కించుకున్నాడు.

### నేటి మ్యాచ్‌ల షెడ్యూల్

**(గ్రౌండ్ -- 1( జూనియర్స్)**

మ్యాచ్ -- 1 సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ vs హైదరాబాద్ హీరోస్

మ్యాచ్ -- 2 రాయలసీమ రాకర్స్ vs తెలంగాణ టైగర్స్

**(గ్రౌండ్ -- 2( సీనియర్స్)**

మ్యాచ్ -- 1 సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ vs హైదరాబాద్ హీరోస్

మ్యాచ్ -- 2 రాయలసీమ రాకర్స్ vs తెలంగాణ టైగర్స్





# బంతుల్ని ఓడించిన బ్యాటర్...

### ద్రవిడ్ అరుదైన రికార్డు

క్రికెట్ ఆటలో ప్రస్తుతం కొనసాగుతున్న ట్రెండ్ ప్రకారం ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తేనే ఫ్యాన్స్‌కు కిక్కు వస్తుంది. కానీ టెస్ట్ క్రికెట్ అనేది అలా కాదు. ఇది బ్యాటర్ల ఓపికకు, టెక్నిక్‌కు అసలైన పరీక్ష. 1877లో మొదలైన ఈ ఫార్మాట్‌లో ఇప్పటివరకు ఎందరో దిగ్గజాలు తమ బ్యాటింగ్ పవర్‌ను చూపించారు. అయితే ఒక వ్యక్తి మాత్రం మైదానంలో నిలబడ్డాడంటే చాలు ప్రత్యర్థి బౌలర్లు తల పట్టుకోవాల్సిందే. ఎన్ని గంటలైనా క్రీజులో పాతుకుపోయి వికెట్ ఇవ్వకుండా అడ్డుగోడలా నిలబడటం అతడికి మాత్రమే సాధ్యం. ప్రపంచ క్రికెట్ చరిత్రలో వేల సంఖ్యలో బ్యాటర్లు ఉన్నా, కేవలం ఒక్కరంటే ఒక్కరే 30 వేల బంతుల మార్క్?ని దాటారు. ఆ దిగ్గజం ఎవరో ఆ అరుదైన రికార్డు విశేషాలేంటో ఇప్పుడు చూద్దాం.

**టీమ్ఇండియా వాల్ రాహుల్ ద్రవిడ్:** టెస్ట్ క్రికెట్?లో అత్యధిక బంతులు ఎదుర్కొన్న గౌరవం మరెవరికో కాదు, మన టీమ్ఇండియా మాజీ కెప్టెన్, లెజెండరీ బ్యాటర్ రాహుల్ ద్రవిడ్‌కే దక్కుతుంది. అందుకే అతడిని ప్రపంచమంతా ప్రేమగా 'ది వాల్' అని పిలుచుకుంటుంది. ద్రవిడ్ క్రీజులో ఉన్నాడంటే టీమ్?కు ఒక రకమైన ధైర్యం ఉంటుంది. వికెట్లు పడుతున్నా ఒకవైపు తను నిలబడి ఇన్నింగ్స్?ను చక్కదిద్దడంలో సిద్ధహస్తుడు. టెస్ట్ ఫార్మాట్?లో ఆయన చూపించిన ఏకాగ్రత, పట్టుదల మరే బ్యాటర్ లోనూ కనిపించలేదని క్రికెట్ విశ్లేషకులు ఇప్పటికీ చెబుతుంటారు.

**రికార్డుల రారాజు :** రాహుల్ ద్రవిడ్ తన 16 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌లో ఎన్నో రికార్డులను తన పేరిట రాసుకున్నారు. మొత్తం 164 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన అతడు 286 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేశారు. ఈ క్రమంలో ఆయన ఎదుర్కొన్న బంతుల సంఖ్య వింటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఏకంగా 31,258 డెలివరీలను ఆయన ఫేస్ చేశారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో మరే ఇతర బ్యాటర్ కూడా ఇప్పటివరకు ఈ ఫీట్ సాధించలేదు. గంటల తరబడి క్రీజ్?లో నిలబడి ప్రత్యర్థి బౌలర్లను విసిగించడంలో ద్రవిడ్?ది ఒక ప్రత్యేకమైన శైలి. వికెట్ కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఆయన ఆడిన ఇన్నింగ్స్‌లు టీమ్ ఇండియాకు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాయి.

**అందని ద్రాక్షగా ద్రవిడ్ రికార్డు**

రాహుల్ ద్రవిడ్ సృష్టించిన ఈ '31 వేల బంతుల' రికార్డును అందుకోవడం ప్రస్తుత తరం బ్యాటర్లకు ఒక కలలాగే కనిపిస్తోంది. టీ20లు, వన్డేల హవా పెరగడంతో ఇప్పుడు టెస్ట్ మ్యాచుల్లో కూడా బ్యాటర్లు వేగంగా పరుగులు సాధించాలని చూస్తున్నారు. పాతకాలం నాటి ఓపికతో ఆడే బ్యాటర్లు ఇప్పుడు చాలా తక్కువ మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ద్రవిడ్ రికార్డు ఇప్పట్లో ఎవరూ బ్రేక్ చేయలేని ఒక అజేయమైన రికార్డుగా నిలిచిపోయింది.

బౌలర్ ఎంత వేగంగా బంతి వేసినా, ఎంత స్పిన్ చేసినా ద్రవిడ్ బ్యాట్ దగ్గర అది ఆగిపోవాల్సిందే. అందుకే ఆయన్ని టెస్ట్ క్రికెట్?కు అసలైన బ్రాండ్ అంబాసిడర్‌గా పరిగణిస్తారు.

**రేసులో జో రూట్ ఎంత దూరం?**

ప్రస్తుతం ఆడుతున్న ఆటగాళ్లలో ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ మాత్రమే కొంచెం దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇప్పటివరకు రూట్ 24,242 బంతులను ఎదుర్కొన్నారు.

అయితే ద్రవిడ్ రికార్డును అందుకోవాలంటే ఆయన ఇంకా సుమారు 7 వేల బంతుల వరకు ఆడాల్సి ఉంటుంది. రూట్ ఫామ్ చూస్తుంటే ఇది సాధ్యమే అనిపించినా, ద్రవిడ్ ఫిగరను క్రాస్ చేయడం మాత్రం సామాన్యమైన విషయం కాదు. రోజురోజుకీ టెస్ట్ మ్యాచుల సంఖ్య తగ్గుతున్న తరుణంలో ద్రవిడ్ నెలకొల్పిన ఈ మైలురాయిని చేరుకోవాలంటే ఏళ్ల తరబడి నిలకడగా రాణించాలి.

**నేటి తరానికి ద్రవిడ్ ఒక పాఠం**

టెస్ట్ క్రికెట్ అంటే కేవలం పరుగులే కాదు, క్రీజులో ఎంత సమయం గడిపామనేది కూడా ముఖ్యమని ద్రవిడ్ నిరూపించారు. ఆ బంతులన్నీ ఎదుర్కోవడం అంటే కేవలం ఫిజికల్ స్టామినా మాత్రమే కాదు, అపారమైన మెంటల్ పవర్ కూడా ఉండాలి. నేటి తరం యంగ్ క్రికెటర్లు ద్రవిడ్ ఆడిన ఇన్నింగ్స్?లను చూసి డిఫెన్స్ ఎలా చేయాలి, బంతిని ఎలా వదిలేయాలి అనే విషయాలు నేర్చుకుంటున్నారు.

క్రికెట్‌లో టెక్నిక్ పరంగా ద్రవిడ్ ఒక యూనివర్సిటీ లాంటి వారు.అందుకే ఆయన రిటైర్ అయినా ఆ రికార్డుల ద్వారా ఇప్పటికీ క్రికెట్ ప్రేమికుల గుండెల్లో నిలిచే ఉన్నారు. టెస్ట్ క్రికెట్?లో వికెట్ వాల్యూ ఏంటో ద్రవిడ్ తన బ్యాటింగ్?తో ప్రపంచానికి చాటి చెప్పారు. ఇక భవిష్యత్తులో ఈ రికార్డును అందుకోవడం ఆటగాళ్లకు అంత సులభం కాదు. మరి కనీసం ఆ రికార్డు దగ్గరకైనా ఎవరైనా వస్తారేమో చూడాలి.

# సినిమా



## ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 7న 'వారణాసి'

ప్రస్తుతం అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తోన్న భారతీయ చిత్రాలలో ఒకటిగా 'వారణాసి' నిలిచింది. మహేష్ బాబు దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళితో కలిసి తొలిసారిగా చేస్తున్న చిత్రం వారణాసి. ఈ మూవీని శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై కె.ఎల్. నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌లో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం నుంచి వస్తున్న ప్రతీ అప్‌డేట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. నవంబర్‌లో జరిగిన గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్ అంతర్జాతీయంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఇటీవల విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాల్ని తారాస్థాయికి పెంచేసింది. త్రేతాయుగంలో ప్రారంభమై, వారణాసిలో 512 సీఈ గుండా ప్రయాణించి, 2027 సీఈకి మారి, త్రేతాయుగంకి తిరిగి వస్తుందని గ్లింప్స్‌తో చెప్పకనే చెప్పేశారు. ఈ గ్లింప్స్ ఒక రహస్యమైన మిషన్‌లో ఉన్న రుద్ర అనే వ్యక్తి శక్తివంతమైన పరిచయంతో ముగిసిందన్న సంగతి తెలిసిందే. తన అద్భుతమైన, అసాధారణ ప్రచార వ్యూహాలకు పేరుగాంచిన ఎస్.ఎస్. రాజమౌళి 'వారణాసి' విడుదల ప్రచారాన్ని అద్భుతమైన రీతిలో ప్రారంభించారు. నిన్న వారణాసి నగరం అంతటా విడుదల తేదీ పోస్టర్ బ్యానర్లు అకస్మాత్తుగా కనిపించడంతో దేశవ్యాప్తంగా అనేక చర్చలు నడిచాయి. నిర్మాతలు అధికారికంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'వారణాసి' విడుదల తేదీని ధృవీకరించారు. ఎస్.ఎస్. రాజమౌళి, మహేష్ బాబు, మొత్తం తారాగణం, సిబ్బంది అద్భుతమైన పోస్టర్‌తో పాటు ఆన్‌లైన్‌లో ఈ రిలీజ్ డేట్ అప్డేట్‌ను పంచుకున్నారు. ఈ విజువల్ వండర్‌ను చూడటానికి అభిమానులు మరికొంత కాలం వేచి ఉండాల్సి ఉంటుంది. ఎందుకంటే వారణాసి ఏప్రిల్ 7, 2027న థియేటర్లలోకి రానుంది.

### పొలిటికల్ యాక్షన్ డ్రామా

## భగవంతుడు



యంగ్ టాలెంటెడ్ హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా భగవంతుడు. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ 1గా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న భగవంతుడు సినిమా ఈ సమ్మర్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ లో చిత్ర టీజర్ ను ఈ రోజు హీరోలు విశ్వక్ సేన్, సందీప్ కిషన్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జి.జి. విహారి మాట్లాడుతూ – నేను సినిమా పాత్రికేయుడిగా కెరీర్ స్టార్ట్ చేశా. భగవంతుడు మూవీ టీజర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. నాతో ట్రావెల్ చేసిన నాకు సపోర్ట్ చేసిన మా టీమ్ అందరికీ థ్యాంక్స్. నేను ఈ సినిమా విషయంలో వేణు ఊడుగుల అన్నకు, రవి పనస అన్నకు కృతజ్ఞతలు చెప్పాలి. చిన్నగా మొదలైన ఈ కథతో క్రమంగా చాలా బిగ్ మూవీ చేశాం. ఈ కథను తిరువీర్ కు నెరేట్ చేసినప్పుడు ఫస్టాఫ్ విని సెకండాఫ్ నీకు నచ్చితే చెప్పు లేకుంటే లేదు అన్నారు ఆయనకు అంత బాగా స్టోరీ మీద నమ్మకం కుదిరింది. ఫరియా అబ్దుల్లా గారి నెంబర్ తీసుకుని స్క్రిప్ట్ ఆమెకు మెసేజ్ చేశా. వెంటనే ఆఫీస్ కు వచ్చారు. అలా ప్రతి ఒక్కటీ ఈ మూవీకి కుదిరాయి. మనల్ని మనం అర్థం చేసుకునేందుకు, మన చుట్టూ ఉన్న, సమాజం ఉన్న వైరుధ్యాలు తెలుసుకునేందుకు కథలు చెబుతాం. ఈ అవగాహనతో నేను రూపొందించిన చిత్రమిది. తిరువీర్, రిషి, ఫరియా అబ్దుల్లా ..ఈ ముగ్గురూ సినిమాకు పిల్లర్స్ లా ఉన్నారు. పల్నాడు యుద్ధాన్ని తెలుగు మహాభారతం అంటారు. మన రూట్స్ అన్నీ పల్నాడులోనే ఉన్నాయి. తెలుగు వారు మర్చిపోయిన వైరుధ్యాలు పల్నాడులోనే పుట్టాయి. ఇప్పటికీ అక్కడ కత్తుల్ని దైవాలుగా కొలుస్తారు. వెయ్యేళ్ల కిందటే మన సమాజంలోని అంతరాలకు సమాధానం పల్నాడులో చెప్పడం జరిగింది. అందుకే ఈ సినిమాకు పల్నాడు బ్యాక్ డ్రాప్ తీసుకున్నాను అన్నారు.

### ఫిమేల్ ఓరియెంటెడ్ క్రైమ్ థ్రిల్లర్

## 'మండవెట్టి'



కోమలి ప్రసాద్ తన 'మండవెట్టి' చిత్రంతో తమిళంలో ఎంట్రీ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇది పవర్‌ఫుల్ ఫిమేల్ ఓరియెంటెడ్ సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఆమె సినీ కెరీర్‌లో ఇదొక ముఖ్యమైన, కొత్త చాప్టర్. 'మండవెట్టి' సినిమాను ప్రారంభించటం తమకెంతో గర్వంగా ఉందని చెప్పిన చిత్ర యూనిట్ సినిమాకు సంబంధించిన విషయాలను బయటకు చెప్పలేదు. టస్కర్స్ డెన్ పిక్చర్స్ బ్యానర్‌పై శరణ్ రాజ్ సెంథిల్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న మండవెట్టి మూవీ టీమ్ లాంఛనంగా పూజా కార్యక్రమాలను పూర్తి చేసి షూటింగ్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం తమిళనాడులోని మదురై జిల్లా ఉసిలంపట్టి ప్రాంతంలో షూటింగ్ జరుగుతోంది. చిత్రంలోని నటీనటులు, సాంకేతిక నిపుణులు ప్రాధాన్యమున్న ఈ కథకు తెరపై జీవం పోయటానికి శ్రమిస్తున్నారు. 'మండవెట్టి'తో కోమలి ప్రసాద్ తన సినీ కెరీర్‌లో కొత్త భాష, కొత్త సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెడుతున్నారు. సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ అంశాలతో పాటు మిస్టిసిజం, ఎమోషన్స్ కలయికగా ఓ మహిళ ప్రధానమైన కథతో సినిమా తెరకెక్కుతోంది. మనకు కావాల్సిన దాన్ని కోల్పోవటం కలిగే బాధ, గుర్తింపు, జీవన పోరాటం, వంటి అంశాలను మిళితం చేసి పెర్ఫామన్స్‌కు స్కోప్ ఉన్న కథను రూపొందించారు.

## మండుటెండల్లో కూల్...కూల్‌గా...
















సమ్మర్ హాలీడేస్ వచ్చాయంటే చాలు ముందుగా సినిమాల పండగ ఎక్కువగా ఉంటుంది. పెద్ద హీరోలు ఎక్కువగా ఈ సమ్మర్‌లో పోటీపడుతుంటారు. అయితే ఈ సారి మాత్రం టాలీవుడ్‌లో సమ్మర్ సీజన్‌లో రిలీజ్ కానున్న సినిమాల విషయంలో చాలా గందరగోళం ఏర్పడింది. ముందుగా అభిమానుల్లో, ఇండస్ట్రీ వర్గాల్లో కొన్ని సినిమాల రిలీజ్ డేట్స్ విషయంలో స్పష్టత ఉంది, కానీ గత వారం రోజులలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా పాన్ ఇండియా భారీ సినిమాల రిలీజ్ షెడ్యూల్ గందరగోళంగా మారుతోంది. హై బడ్జెట్ సినిమాలు సరైన సమయం చూసుకుని విడుదల చేయాలి. లేదంటే బాక్సాఫీస్ ముందు వర్కవుట్ అవ్వవు. ఒకపోతే సంక్రాంతి హడావిడి అయిపోయింది. చిరంజీవి, ప్రభాస్ నుంచి చిన్న హీరోలు శర్వానంద్, నవీన్‌పొలిచర్ల వరకు ఈ సంక్రాంతికి సందడి చేసి ఎవరివారు ఓ రేంజ్‌లో హిట్లు కొట్టారు. ప్రస్తుతం అందరి చూపు సమ్మర్‌వైపు పడింది. ఇక ఈ సమ్మర్‌కి సందడి చేసే సినిమాలు... పెద్ది, ప్యారడైజ్, ఉస్తాద్ అంటూ మాట్లాడుకుంటున్నారు కానీ.. కొందరు మీడియం రేంజ్ హీరోలు కూడా ఈ సీజన్‌ను క్యాష్ చేసుకోవాలని చూస్తున్నారు. ఫిబ్రవరి 13న ఫంకీ రానుంది.. విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని అనుదీప్ కేవీ తెరకెక్కిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తుంది. అలాగే శ్రీ విష్ణు ఎంటర్‌టైనింగ్ సినిమా విష్ణు విన్యాసం కూడా ఫిబ్రవరిలోనే రానుంది. దీనిపై అంచనాలు బాగానే ఉన్నాయి. అడివి శేష్ డెకాయిట్ సినిమా ప్యాన్ ఇండియన్ స్థాయిలో మార్చి 19న విడుదల కానుంది. శేష్ ట్రాక్ రికార్డు అద్భుతంగా ఉండటం డెకాయిట్‌కు కలిసొచ్చే విషయం. అలాగే కమిటి కుర్రోళ్లు తర్వాత నిహారిక నిర్మిస్తున్న రాకాస సినిమా ఎప్రిల్ 3న విడుదల కానుంది. సంగీత్ శోభన్ ఇందులో హీరోగా నటిస్తున్నారు. స్వయంభు కోసం ఇండియాస్ టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పని చేస్తున్నాయి. గ్రాఫిక్స్ బాగోలేకపోతే దారుణంగా ట్రోల్ చేస్తున్నారు.. అందుకే క్వాలిటీ ఔట్‌పుట్ కోసమే టైమ్ తీసుకుంటున్నారు మేకర్స్. ఈ చిత్రం ఎప్రిల్ 10న రిలీజ్ కానుంది. కార్తికేయ 2 తర్వాత మరోసారి ప్యాన్ ఇండియాపై ఫోకస్ చేసారు నిఖిల్. మొత్తానికి ఈ సీజన్ అంతా క్రేజీ సినిమాలే రానున్నాయి. రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న 'పెద్ది' సినిమాను మార్చి 27న విడుదల చేయాలని ప్లాన్ చేశారు. కానీ షూటింగ్ పోస్ట్ ప్రొడక్షన్ డిలే కారణంగా ఈ షెడ్యూల్ మలుపు తిప్పినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం మేకర్స్ మార్చి 27 కాకుండా మే 1కి విడుదల చేయాలని పరిశీలిస్తున్నారట. అలాగే 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా ఏప్రిల్‌లో రిలీజ్ కావాల్సింది. కానీ 'పెద్ది' డేట్‌కు మే 1న థియేటర్లలోకి తీసుకురావాలనే కారణంతో ప్రీపోన్ చేయబడింది. ఈ రెండు సినిమాలను మైత్రీ మూవీస్ నిర్మిస్తున్నందు వల్ల డేట్ మార్పులో సమస్యలు ఉండకపోవచ్చని టాక్.



'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' చిత్రాలలో ప్రశంసలు పొందిన దర్శకుడు అజయ్ భూపతి, ప్రస్తుతం మరో క్రేజీ ప్రాజెక్ట్ 'శ్రీనివాస మంగాపురం' కు దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబుల వారసత్వాన్ని కొనసాగిస్తూ, జయ కృష్ణ ఘట్టమనేని ఈ చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్

## 'మంగ' పాత్రలో రాషా థడానీ

నటి రవీనా టాండన్ కుమార్తె, 'ఉయ్ అమ్మ' పాటతో గుర్తింపు పొందిన రాషా థడానీ కూడా తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. సక్సెస్ ఫుల్ నిర్మాత అశ్విని దత్ ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తుండగా, 'చందమామ కథలు' బ్యానర్ పై నిర్మాత పి. కిరణ్ దీనిని నిర్మిస్తున్నారు. టైటిల్ రివిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఈ సినిమా ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం నుంచి రాషా థడానీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.

### విత్ లవ్ కనెక్ట్ అయ్యే

## ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్




అభిషన్ జీవింత్, అనస్వర రాజన్ ప్రధాన పాత్రలలో నటించిన ఫీల్-గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ విత్ లవ్. మదన్ రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సౌందర్య రజనీకాంత్‌తో పాటు నజరత్ పసిలియన్, మహేష్ రాజ్ పసిలియన్ ఎంఆర్‌పి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మించారు. విత్ లవ్ చిత్రం ఫిబ్రవరి 6, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ సురేష్ ప్రొడక్షన్స్ నిర్వహిస్తోంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో రానా దగ్గుబాటి మాట్లాడుతూ... చెప్పలేని ప్రేమ గురించి ఇక్కడ అంతా చాలా బ్యూటిఫుల్ గా మాట్లాడారు. ట్రైలర్ చూసిన అందరూ కూడా చాలా కనెక్ట్ అయ్యారు. చూస్తున్నప్పుడు ఇది మన కథే అనిపిస్తోంది. సౌందర్య తెలుగులో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. అందరికీ ఆల్ ది బెస్ట్ థాంక్యూ.



## సుమతి శతకంతో ఒక్క ఛాన్స్ ఇవ్వండి

విజన్ మూవీ మేకర్స్ బ్యానర్ పై సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మాతగా ఎం.ఎం. నాయుడు రచన దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సుమతీ శతకం. అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో టేస్టీ తేజ, మహేష్ విట్ట, జె.వి.డి. ప్రసాద్, ఆకెళ్ళ గోపి కృష్ణ, కిరణ్ విజయ్, మిర్చి కిరణ్, మలక్పేట్ శైలజ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి నహిద్ మహమ్మద్ ఎడిటింగ్ చేయగా ఎస్. హలేష్ సినిమాటోగ్రాఫర్ గా చేశారు. ఫిబ్రవరి 6వ తేదీన మైత్రి మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ద్వారా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ఈ చిత్ర బృందం నేడు తిరుపతిలోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా... హీరో అమర్‌దీప్ మాట్లాడుతూ... శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో ఉన్న పాజిటివ్ వైబ్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. నా కెరీర్ 'రామ' అనే పేరుతోనే మొదలైంది. ఇప్పుడు అదే పేరున్న కాలేజీలో మా 'సుమతి శతకం' ట్రైలర్ లాంచ్ అవ్వడం ఒక మంచి సెంటిమెంట్‌గా భావిస్తున్నాను. నేను కూడా మీలాగే కంప్యూటర్ సైన్స్ స్టూడెంట్‌ని, మీ ఎనర్జీ చూస్తుంటే నా కాలేజీ రోజులు గుర్తొస్తున్నాయి. అనంతపురంలో ఒక సామాన్య స్థాయి నుంచి వచ్చిన నాకు మీరు ఎంతో ప్రేమను అందించారు. ఈ సినిమా కోసం నా ప్రాణం పెట్టి పనిచేశాను. షూటింగ్ సమయంలో గాయాలైనా వెనకాడకుండా కష్టపడ్డాను.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044